సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 193

సోమవారం 3-10-2022

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సన్నిధి

సాక్షి ఫ్యామిలీ

శ్రీకాకుళం
సోమవారం ॥ 3-10-2022

మంచి మాట



నిశ్శబ్దం

ఓ అద్భుత ఆంతరంగిక వాణి

ప్రకృతి మనకు అందించే శ్రవణానందకర శబ్దాలను విని ఆనందించేటందుకు, మనలోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేటందుకు, రసాస్వాదనకు ఒక ప్రశాంత స్థితి, ఒక నిర్మలత కావాలి. అది నిశ్శబ్ద వాతావరణంలోనే కుదురుతుంది. ఆ కోణంలో చూసినపుడు మన సృజన శక్తులు జాగృతమై చైతన్యవంతమయ్యే ఓ అద్భుత స్థితికి కావలసిన ఆవరణను కల్పించేదే నిశ్శబ్దమంటే.

ఒక చేతిలోని పదునైన ఉలిని ఒక కఠినమైన రాయిపై ఉంచి, మరొక చేతిలోని సుత్తితో లాఘవంగా, ఒడుపుగా తన మనసులోని అద్భుత రూపానికి జీవకళ ఉట్టిపడేటట్టుగా అకుంఠిత దీక్షతో శిల్పి పనిచేస్తుంటాడు. కావలసిన రంగులుంచుకున్న పళ్ళేన్ని ఒక చేతిలో, కుంచెను మరొకచేతిలో పట్టుకున్న ఓ చిత్రకారుడు తన ఊహాచిత్రానికి ఓ చక్కని రూపునిచ్చే తపోదీక్షలో ఉంటాడు. కలాన్ని తన చేతి వేళ్ళ మధ్య ఉంచుకుని ఆలోచనా క్షీరసాగరాన్ని మథనం చేస్తూ భావ సంక్లిష్టత, అస్పష్టతలనే కెరటాల గరళాన్ని అధిగమిస్తూ సాహిత్యామృతాన్ని అందించే యత్నం చేస్తుంటాడు రచయిత. ఈ సృజన ఒక నిశ్శబ్ద వాతావరణంలోనే సాధ్యమవుతుంది. నిశ్శబ్దంలో మనలోని ఏకాగ్రత, స్థిరత్వం, నిశ్చలతలు బలోపేతమవుతాయి. అపుడు మనం దృష్టి కేంద్రీకరించగలుగుతాం.

ఆంగ్ల భాషలో నిశ్శబ్దానికి, మౌనానికి అర్థ భేదం లేదు. నిశ్శబ్దం అనే ఒకేరకమైన మాటను వాడతారు. కాని, తెలుగుభాషలో ఈ రెండిటికి ఎంతో తేడా ఉండటమే కాదు ఎంతో లోతైన, విస్తృతమైన అర్థంలో వాడతాం.. కొన్ని సందర్భాలలో, ప్రదేశాలలో మనం నిశ్శబ్దంగా ఉండాలి. పాఠాలను, ప్రసంగాలను, సంగీత కచేరిలో సంగీతాన్ని వింటున్న వేళల్లో, గ్రంథాలయం లాంటి ప్రదేశాలలో ఉన్నప్పుడు నిశ్శబ్దంగా ఉండాలి. ఈ నిశ్శబ్దం పాటించటంలో మన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేదు. తప్పనిసరైన నియమం. అయితే, మౌనం మనం పాటించేది. వ్యక్తిగతం. మన ఇష్టపూర్వకంగా స్వీకరించేది. ధ్యానం ఒక నిశ్శబ్ద పయనం. మన అంతరంగమనే సాగరంలోకి వెళుతూ దాని ఘోషను వినగలిగే ఓ అద్భుత అవకాశం. ఈ మౌనం మనం నియమించుకున్న నిశ్శబ్దం ఒక ప్రశాంతమైన వాతావరణం. మన నడవడికను నెమరు వేసుకునే సందర్భం. మంచి, చెడులను తెలుసుకునేందుకు మనకై మనం పెట్టుకున్న నిబంధన. నిరంతర సుదీర్ఘ ప్రయాణం. అది మనల్ని ఉన్నతంగా ఆలోచింపచేస్తుంది మానవ దౌర్బల్యాలను, బలహీనతలను దాటగలిగే మానసిక స్థైర్యాన్ని ఈ నిశ్శబ్ద వాతావరణం మనకు ప్రసాదిస్తుంది.

మన సాహిత్యకారులు నిశ్శబ్దం తాండవిస్తోంది అని వర్ణిస్తుంటారు. శబ్దశూన్యతే నిశ్శబ్దం అయినప్పుడు నర్తిస్తున్నదనటంలో అర్థమేమిటి? అపార్థాలతో కాపురం చేసే భార్యాభర్తల మధ్య మాటలుండవు. కాని, ఇరువురి మనసుల్లో అభివ్యక్తం కాని అనంతమైన ఆలోచనలు, భావాలు వారి మనోసంద్రపు తీరాన్ని తాకి మళ్లీ వెనకకు పోతుంటాయి. పై చెప్పిన మాటకు అర్థమిదే.

భావాలు, మనోభావాలు ఘనీభవించిన స్థితే ఇక్కడ నిశ్శబ్దమంటే. పరపాలనలో మగ్గే ప్రజ తమ ఉచ్ఛ్వాస నిశ్వాసాల మీద కూడ అధికారాన్ని, నియంత్రణను చూపుతూ, తమధన, మాన, ప్రాణాలను దోచుకునే పాలకుల దౌర్జన్యం, దోపిడీ కొంతవరకే ఓర్చుకోగలరు. వాటిని నిశ్శబ్దంగా భరిస్తుంటారు. వారి స్వాతంత్ర్య కాంక్ష అగ్నిపర్వతపు లావాలా పొగలు కక్కుతుంటుంది. ఈ నిశ్శబ్దం విస్ఫోటనమైన వేళ వచ్చే పర్యవసానం భయంకరంగా ఉంటుంది. అది బీభత్సాన్ని సృష్టిస్తుంది. ఒక్కోసారి కొన్ని వందల మాటల్లో చెప్పలేనిది కూడ ఒక అర్థవంతమైన నిశ్శబ్దం సూచిస్తుంది. అది మన మనసుకు అద్దం పడుతుంది.

నిశ్శబ్దం ఓ అద్భుతమైన శక్తి. మన అనేకమైన మిశ్రమ భావాలకు భాష్యం చెప్పగలదీ నిశ్శబ్దం. నిశ్శబ్దమిచ్చే ఏకాంతంలో, ఆలోచనలో సత్యశోధన చేయగలం. సత్యాన్ని దర్శించగలం. అందుకే నిశ్శబ్దం ఓ అద్భుత అంతరంగిక వాణి.

– బొడ్డపాటి చంద్రశేఖర్, ఆంగ్లోపన్యాసకులు.

సూక్తి సుధ

వైఫల్యం ఇహాన్ని మరిపిస్తుంది.
విజయం అహాన్ని కురిపిస్తుంది.
వైఫల్యంలోనూ, విజయంలోనూ తటస్థంగా ఉండాలి.

* * *


ఎదురుగాలిలోనే గాలిపటం పైకిలేస్తుంది.
నిన్ను చూసి నవ్వే ప్రపంచాన్ని చూసి నవ్వగలగడమే నీ తొలి విజయం.
కాబట్టి విమర్శలకు భయపడకు.

* * *

కష్టం కన్నీళ్లనే కాదు కొన్ని నిజాలను బయటకి రప్పిస్తుంది.
దాపరికాల ముసుగును తొలగిస్తుంది.
వాస్తవాలు వెలుగు చూసేలా చేస్తుంది.

శ్రేష్ఠదీవెనలు మనకోసం...

సువార్త



శ్రేయస్కరమైన ఆశీర్వాదములతో నీవు అతనిని ఎదుర్కొనుచున్నావు (కీర్తన 21:3). శ్రేష్ఠమైన దీవెనలు మనలను ఎదుర్కోవాలి అనే ఆశతో రోజును ప్రారంభిస్తాం. శుభ పరిణామాలు మన బతుకుల్లో నెరవేర్చబడాలని తపిస్తూంటాము. మన జీవితాలు బాగుండాలి అని ఎంతగా మనం ఆశిస్తామో అంతే ఆశతో అపవాది మనలను పాడుచేయాలని ఇటు అటు తిరుగుతున్నాడు. కొన్ని సందర్భాలలో కీడు, అపజయం, నిరాశ, ఓటమి మనలను ఎదుర్కోవడానికి పోటీపడుతున్నాయా అనిపిస్తుంది. నిశ్చలంగా ఉన్న మన జీవితాల్లో ఉన్నటుండి ఏదో శ్రమ, ఇబ్బంది నిర్మలమైన నీటిలో రాయి పడినట్టుగా పరిస్థితులను తారుమారు చేస్తుంటాయి.

దేవునియందు సంతోషించేవానికి సంభవించే మహోన్నత ఆశీర్వాదమును లేఖనం గుర్తుచేస్తుంది. దేవుడు ఆశీర్వాదమునకు మూలము. ఆయన తేజోసంపన్నుడు, మహిమాన్వితుడు గనుక ఆయన ఎక్కడుంటే అక్కడ ఆశీర్వాదం తొణికిసలాడుతుంది. మనం ఎదుర్కొనే ప్రతి పరిస్థితిని కృపగల దేవుడు యధార్థ దృక్పథంతో చూస్తాడు. చల్లబడ్డ మేఘాలు భూమ్మీద వర్షించినట్టుగా పరమాత్ముని దయార్ద్ర దృష్టి తనను విశ్వసించేవారిపై పుష్కలంగా వర్షిస్తుంది. తన కృపామహదైశ్వర్యంతో దేవుడు వారిని అత్యున్నతంగా ఆశీర్వదిస్తాడు.


తనకు రావల్సిన ఆశీర్వాదాన్ని దొంగిలించాడని తన తమ్ముని మీద పగతో రగిలిపోతున్న ఏశావు నాలుగు వందల మందిని వెంటబెట్టుకొని యాకోబును వెదుకుతున్నాడు. ఈలోపు యబ్బోకు రేవు దగ్గర దేవుని దర్శనం యాకోబుకు లభించింది. దేవుని దివ్య స్పర్శతో బతుకు మారిపోయింది. యాకోబు ఇశ్రాయేలుగా మార్చబడ్డాడు.

ఎప్పుడైతే దేవుని దయాసంకల్పాలకు మన జీవితాలను అప్పగించుకుంటామో అప్పుడే కాంతులు మన జీవితాల్లో ఉదయిస్తాయి. కీడు కలిగించాలనే ఆశతో ఉన్న ఏశావు కంటే మేలు కలుగచేసే దేవుడు యాకోబును ఎదుర్కొన్నాడు. దేవుని ఆగమనంతో చరిత్ర కూడా మారింది. శత్రువైన తన అన్న తన తమ్ముడైన యాకోబుకు మిత్రుడయ్యాడు. చంపాలనే కోరికతో ఉన్నవాడు కుశల ప్రశ్నలడిగి తియ్యగా మాట్లాడాడు. ఇదే దేవుని మహాత్యం.

కీడు జరుగుతుందేమోనన్న భయం నిన్ను వేధిస్తుందా? దేవుని బిడ్డా! ఈ ధన్య సత్యాన్ని గుండెల్లో దాచుకో! కీడు నీ పాదాలను తాకకముందే నీకోసం పరలోకం నుండి భువికేతెంచి కలువరిలో మరణించిన క్రీస్తు తన కౌగిట్లోకి నిన్ను లాక్కుంటాడు. నా అరచేతిలో నీవున్నావు అని చెప్పి నిన్ను ఊరడిస్తాడు. అంతులేని ఆనంద డోలికల్లో తేలియాడతావు. ఆయన నీ పట్ల కలిగియున్న ప్రణాళికలను గ్రహించి పరవశిస్తావు. దావీదు వలె నీవు కూడా ఆత్మలో ఆనందిస్తావు. నిరాశ చీకట్లు తొలగిపోయి నీ ఆధ్యాత్మిక జీవితంలో వెలుగులు విరజిమ్ముతాయి. ప్రభువైన యేసుక్రీస్తు దీవెనలు మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉండును గాక.


– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

గురువాణి



ఏమి పనిమీద భూమికేతెంచినాడొ!

ఆధునిక తెలుగు కవులలో విశిష్ట స్థానం పొందిన గుర్రం జాషువా నవజాత శిశువును గురించి ఒక కవితలో మహాద్భుతంగా వర్ణన చేసారు. ''గానమాలింపక కన్నుమూయని రాజు/ అమ్మకౌగిట పంజరంబు చిలుక/ కొదమ కండలు తేరుకొను పిల్లవస్తాదు/ ఉయ్యేల దిగని భాగ్యోన్నతుండు/ ఉ ఊలు నేర్చిన యొక వింత చదువరి/ సతిని ముట్టనినాటి సాంబ మూర్తి/ ప్రసవాబ్ధితరియించి, వచ్చిన పర దేశి/ తన యింటి క్రొత్త పెత్తనపుదారు/ ఏమి పనిమీద భూమికేతెంచి నాడొ ! ముందు ముందేమొ కానియిప్పటికి మాత్రమేపాప మెఱుగడితడు !'' అన్నారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సాధారణంగా రాజులు, చక్రవర్తులకు ఒక అలవాటు ఉండేది. వాళ్ళు పడుకొని నిద్రపోవడానికి ముందు చక్కటి సంగీతాన్ని మంద్రస్థాయిలో వినిపిస్తూ ఉంటే ప్రశాంతంగా నిద్రలోకి జారుకొంటారు. మళ్ళీ అంత భోగం చిట్టిపాపాయిలకు మాత్రమే ఉంటుంది. ఏదోఒక జోలపాట పాడితే గానీ నిద్రపోరు. ఆ శిశువులది రాజభోగం అంటూ ఇంకా ఇలా అంటున్నారు. అమ్మలకు పిల్లలను గట్టిగా గుండెలకు కావిలించుకుంటేనే గానీ తృప్తి ఉండదు. అలా అమ్మ కౌగిట ఉన్న శిశువు పంజరంలోని చిలుకలాగా ఆప్యాయను రాగాలు పొందుతాడు. చేతులు గాలిలో ఊపుకుంటూ బుడిబుడినడకలతో కదులుతుంటేచిన్నపాటి వస్తాదు నడిచి వస్తునట్లుంటుంది.

ఊయలలోనే తినడం, పడుకోవడం, దానిలో కూర్చునే వ్యవహారాలు నడిపించడం భోగభాగ్యాలకు గుర్తు.

శిశువు కూడా అంతే... అన్నీ ఉయ్యాలలోనే, కూర్చున్నా, పడుకొన్నా, ఏడ్చినా, పాలు తాగినా... ఒకవేళ ఉయ్యాల దిగినా అమ్మ ఒడే.. ఎంతటి భాగ్యమో కదా! అంటూ ఇక్కడ బుజ్జి పాపాయిల వింత చదువులంటూ బహు చక్కగా ప్రస్తావించారు. శిశువు ఊయలలో పడుకొనే బోసినోటితో నవ్వుతూ 'ఉ' అనీ, 'ఊ' అనీ అంటూంటే... ఎవరో చెప్పింది విని అలా ఊ కొడుతున్నాడని చూస్తే అక్కడ చెప్పేవారెవరూ మనకు కనపడరు. అయినా ఎవరో ఏదో చెబితే వింటూ, శ్రద్ధగా చదువు నేర్చుకుంటూ ఊ కొడుతున్న ఒక విద్యార్థి లాగా శిశువు కనబడుతున్నాడు. ఇదేమి వింత చదువరి !!!

పార్వతీదేవిని స్పృశించకుండా తపస్సులో ఉండిపోయిన యోగమూర్తి అయిన పరమేశ్వరుడి లాగా ఆ శిశువు కనబడుతున్నాడు. మనం చూసే దృష్టి వేరు... కవి... అందునా మహాకవి దృష్టి వేరు.. వారి పరిశీలన ఎంత గాఢంగా ఉంటుందంటే... అమ్మ పొట్టలో చిమ్మచీకట్లో కొంత కాలం గడిపి ప్రసవ సముద్రాన్ని దాటి వచ్చిన పరదేశి లాగా కూడా ఆ శిశువు ఉన్నాడట... అంటే జననం కూడా సముద్రయానమే.

ఇప్పుడయితే మన ఇంటికొచ్చాడు. పరదేశియే అయినా కొత్త పెత్తందారు. ఆ ఇంటి వారి సర్వస్వానికీ హక్కుదారుడయిపోయాడు. ఆ హక్కులతో వచ్చీరాగానే పెత్తందారులాగా పెత్తనం చలాయిస్తున్నాడు. అంటే పిల్లలు కనిపించిన ప్రతిదాన్నీ కావాలని అడగడమూ, అది దక్కే దాకా హఠం చేస్తుంటారు. ఏ పని మీద ఈ లోకానికి వచ్చాడో!! పరదేశి కాబట్టి భాష తెలియదు. మాటలు పలకడం వచ్చిన తరువాత అడగాలి.


ముందు ముందేమో గానీ ఇప్పటికయితే ఏ పాపం, ఏ తప్పు చేయని అమాయకుడు. కొత్తగా పుట్టిన పిల్లలను గురించి ఇంత చక్కగా, మృదువుగా, మధురంగా భావం, భాష, వాటి అల్లిక కేవలం జాషువాగారి సొంతం. మరొకరికి అసాధ్యం అనిపిస్తుంది.

సినిమా



● రష్మికా మందన్నా

వైజాగ్ టు హైదరాబాద్



● రవితేజ, చిరంజీవి

చిరంజీవి హీరోగా బాబీ(కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో రూపొందుతున్న తాజా సినిమా 'వాల్తేరు వీరయ్య'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రవితేజ ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ఇటీవల చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ వైజాగ్‌లో మొదలైంది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, రవితేజలపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అయితే ఈ షెడ్యూల్‌లో తన వంతు షూటింగ్‌ను పూర్తి చేసుకున్న రవితేజ తిరిగి హైదరాబాద్‌కు వచ్చారట. ఈ సినిమాలో రవితేజ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారని టాక్. ప్రస్తుతం 'గాడ్‌ఫాదర్' చిత్ర ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు చిరంజీవి. కాగా 'వాల్తేరు వీరయ్య' కొత్త షెడ్యూల్ అతి త్వరలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సహ నిర్మాతలు: జీకే మోహన్, ప్రవీణ్ ఎం, లైన్ ప్రొడ్యూసర్: కేవీవీ బాలసుబ్రహ్మణ్యం.

నా ఆగమనం.. అధర్మ విధ్వంసం



● ప్రభాస్

సినిమా అభిమానులు, ముఖ్యంగా ప్రభాస్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'ఆదిపురుష్' సినిమా టీజర్ వచ్చేసింది. రామ జన్మభూమిగా పేరొందిన అయోధ్యలో 'ఆదిపురుష్' టీజర్ వేడుకను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ప్రభాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఆదిపురుష్'. ఓం రౌత్ దర్శకత్వం వహించారు. టీ సిరీస్, గుల్షన్ కుమార్‌ల సమర్పణలో భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. 'భూమి కృంగినా, నింగి చీలినా', 'న్యాయం చేతుల్లోనే అన్యాయానికి సర్వనాశనం', 'వస్తున్నా.. న్యాయం రెండు పాదాలతో నీ పది తలల అన్యాయాన్ని అణచివేయడానికి', 'నా ఆగమనం.. అధర్మ విధ్వంసం' అంటూ ప్రభాస్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఆకట్టుకుంటున్నాయి. 1:40 నిమిషాల నిడివి ఉన్న ఈ టీజర్ చూస్తే 'ఆదిపురుష్' విజువల్ వండర్‌గా ఉంటుందని తెలుస్తోంది. రామాయణం ఇతివృత్తంగా రూపొందిన ఈ చిత్రంలో రాముడిగా ప్రభాస్, సీతగా కృతీసనన్, రావణాసురుడిగా సయీఫ్ అలీఖాన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్ నటించారు.

మహేశ్ సినిమాలో...



● పృథ్వీరాజ్ సుకుమారన్

తెలుగు సినిమాలపై మరింత ఫోకస్ పెట్టినట్లున్నారు మలయాళ దర్శక–నిర్మాత, నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పటికే ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సలార్' చిత్రంలో పృథ్వీరాజ్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. తాజాగా హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొంతున్న కొత్త సినిమాలో ఓ ప్రధాన పాత్రలో పృథ్వీ నటించనున్నారట. ఈ మేరకు ఆయనతో చిత్రయూనిట్ సంప్రదింపులు జరుపుతోందట. తన పాత్ర నచ్చడంతో పృథ్వీరాజ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేందుకు సుముఖంగానే ఉన్నారని టాక్. కాగా ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలున్నాయి.

హిట్ సీక్వెల్‌లో...

రష్మికా మందన్నా కెరీర్ మంచి జోరు మీద ఉంది. ఒకవైపు దక్షిణాది సినిమాలు సైన్ చేస్తూ మరోవైపు ఉత్తరాదిపై కూడా దృష్టి పెట్టారీ బ్యూటీ. ఇప్పటికే హిందీలో 'గుడ్ బై', 'మిషన్ మజ్ను', 'యానిమల్' వంటి చిత్రాలు ఆమె లిస్ట్‌లో ఉన్నాయి. తాజాగా ఓ హిట్ సీక్వెల్ (ఆషికీ) లో హీరోయిన్‌గా రష్మికా దాదాపు ఖరారు అయ్యారని సమాచారం. రాహుల్ రాయ్, అను అగర్వాల్ జంటగా రూపొందిన 'ఆషికీ' (1990) మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ తర్వాత పదమూడేళ్లకు ఆదిత్యరాయ్ కపూర్, శ్రద్ధా కపూర్ జంటగా రూపొందిన 'ఆషికీ 2' (2013) కూడా హిట్టయింది. ఇప్పుడు 'ఆషికీ 3'లో కార్తీక్ ఆర్యన్ హీరోగా నటిస్తుండగా హీరోయిన్‌గా రష్మికను ఓకే చేసినట్లు సమాచారం. ఈ చిత్రానికి అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో రష్మిక నటించే విషయమై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మావాడు మారిపోయాడు!



● ఆది, దిగంగన

ఆది సాయికుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'క్రేజీ ఫెలో'. ఫణికృష్ణ సిరికి దర్శకత్వం వహించారు. దిగంగనా సూర్యవంశీ, మర్నా మీనన్ హీరోయిన్లు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేసి, ఈ నెల 14న సినిమాని రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. 'మావాడు చాలా మారిపోయాడు.. ఇంతకుముందులా లేడు' అంటూ అనీష్ కురువిల్లా చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమై, 'పుణ్యానికి పోతే పాప ఎదురయిందంటే ఇదే అనుకుంటా' అంటూ ఆది చెప్పే డైలాగ్‌తో ముగిసింది. ''ఫ్యామిలీ, ఫన్, రొమాన్స్, యాక్షన్ ఉన్న చిత్రమిది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ మూవీకి సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, సంగీతం: ఆర్ఆర్ ధృవన్, కెమెరా: సతీష్ ముత్యాల.

ఓన్లీ ఎమోషన్స్!



● విజయ్ సేతుపతి

ప్రయోగాత్మక చిత్రాల్లో నటించే హీరోల్లో ముందువరుసలో ఉంటారు విజయ్ సేతుపతి. తాజాగా ఆయన 'గాంధీ టాక్స్' అనే సైలెంట్ ఫిల్మ్(డైలాగులు లేని)లో లీడ్ రోల్ చేస్తున్నారు. మరాఠీ దర్శకుడు కిశోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అరవింద్ స్వామి, అదితీరావ్ హైదరీ, సిద్ధార్థ్ జాదవ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఆదివారం గాంధీ జయంతి (అక్టోబరు 2) సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు చిత్రయూనిట్. ''డైలాగ్స్ లేకుండా కేవలం ఎమోషన్స్‌తోనే కథను చెప్పడం అంత సులువైన విషయం కాదు. ఈ సినిమా నాకు చాలెంజింగ్‌గా అనిపించింది'' అని కిశోర్ పాండురంగ్ బేలేకర్ అన్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

యువత ఆలోచనలు



● రిచ, శ్రీరామ్

శ్రీరామ్ నిమ్మల, రిచా జోషి జంటగా నాగ ధనుష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మది'. ప్రగతి పిక్చర్స్‌పై రామ్ కిషన్ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. ఈ సందర్భంగా నిర్మాత రామ్ కిషన్, సహ నిర్మాత శ్రీనివాస్ రామిరెడ్డి మాట్లాడుతూ– ''రొమాంటిక్ లవ్ స్టోరీగా రూపొందిన చిత్రమిది. ఈ తరం యువత ఆలోచనా విధానానికి అద్దం పట్టేలా ఉంటుంది. కథ, సందర్భానుసారంగా ఈ సినిమాలో ఐదు పాటలున్నాయి. రఘు కుంచె, సునీత, రమ్యాబెహ్రా, దీప్తు, సాయి చరణ్, హరిణి ఆలపించారు. త్వరలో విడుదల కానున్న మా చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి సమర్పణ: ఆర్‌వీ రెడ్డి, సహ నిర్మాత: ఆర్వీ సినిమాస్, కెమెరా: విజయ్ ఠాగూర్, సంగీతం: పీవీ ఆర్.రాజా.


స్నేహితుల కథ



● శివ, శేఖర్ కమ్ముల, ఎస్‌వీఎన్ రావు

శ్రీకాంత్ పరకాల, శివ ప్రధాన పాత్రల్లో దీక్షిత్ కోడెపాక దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఈ 3 విత్ లవ్'. ఎస్‌వీఎన్ రావు సమర్పణలో వాయుపుత్ర క్రియేషన్స్‌పై రూపొందుతున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దేవుడి పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఎస్‌వీఎన్ రావు, నిర్మాత టి.రామసత్యనారాయణ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు శేఖర్ కమ్ముల క్లాప్ కొట్టారు. ఎస్‌వీఎన్ రావు మాట్లాడుతూ– ''మహాత్మా గాంధీగారి జయంతిన 'ఈ 3 విత్ లవ్' చిత్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉంది. ఈ సినిమా కొత్తగా ఉంటుంది'' అన్నారు. ''ఇది నా మొదటి సినిమా. ఇద్దరి స్నేహితుల మధ్య జరిగే కథే ఈ చిత్రం. ఈ నెల 10 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు దీక్షిత్ కోడెపాక. ''ఈ కథ అందరికీ నచ్చుతుంది'' అన్నారు శ్రీకాంత్ పరకాల. ఈ చిత్రానికి కెమెరా: అల్లాడి ప్రణవ్ చంద్ర.

తెలిసినవారు తక్కువ!



● దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్ ఆఫ్ కోతా'. మలయాళ సీనియర్ దర్శకులు జోషి కుమారుడు అభిలాష్ జోషి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవల మధురైలో ప్రారంభమైంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ విడుదలైంది. 'అతడికి కొంతమంది భయపడతారు.. మరికొంత మంది గౌరవిస్తారు... ఇంకొందరు ప్రేమిస్తారు, కానీ అతని నిజస్వరూపం తెలిసినవారు చాలా తక్కువమంది' అంటూ దుల్కర్ పాత్రను చెప్పే ప్రయత్నం చేశారు చిత్రయూనిట్. ఈ మూవీలో హీరోయిన్ పాత్రకు సమంత, ఐశ్వర్యలక్ష్మీల పేర్లు తెరపైకి వచ్చాయి.

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 193

సోమవారం 3-10-2022



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'



భారత్‌దే సిరీస్

దక్షిణాఫ్రికాపై రెండో టి20లోనూ గెలుపు.. 2–0తో సిరీస్ భారత్ సొంతం -IVలో



సొంతింటికి 'జంట' దారి!

ఉమ్మడిగా దరఖాస్తు చేసుకుంటే అధిక గృహ రుణం - 10లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పోటీ అక్కర్లేదన్నా.. పట్టుబట్టాడు

కాంగ్రెస్ అధ్యక్ష రేసులో ఒకే అభ్యర్థి ఉంటే బాగుంటుందని కాంగ్రెస్ నేత ఖర్గే అన్నారు. కానీ శశిథరూర్ విభేదించారని చెప్పారు.

వివరాలు 6లో



భారీగా డ్రగ్స్ స్వాధీనం

నారింజ పండ్ల బాక్సుల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.1,476 కోట్ల విలువైన డ్రగ్స్‌ను ముంబైలో స్వాధీనం చేసుకున్నారు.


వివరాలు 6లో



కేజ్రీవాల్‌పైకి నీళ్ల సీసా

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌పై ఓ దుండగుడు ప్లాస్టిక్ వాటర్ బాటిల్ విసిరాడు. అది ఆయన తలపై నుంచి వెళ్లి కింద పడిపోయింది.

వివరాలు 6లో



ఉగ్ర దాడి.. పోలీసు వీరమరణం

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఓ పోలీసు అధికారి వీర మరణం పొందగా.. సీఆర్‌పీఎఫ్ జవాను గాయపడ్డారు.

వివరాలు 6లో

కలల కొలువు సులువే

ఉచిత ఆన్‌లైన్ కోర్సులతో కోరుకున్న ఉద్యోగాలు.. నైపుణ్యాల పెంపునకు ఏపీ సర్కార్ శిక్షణ

- మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, ఫుల్‌స్టాక్, గూగుల్ ఆండ్రాయిడ్ తదితర డొమైన్లలో విద్యార్థుల శిక్షణకు ఏర్పాట్లు
- 2.15 లక్షల మంది గుర్తింపు.. తొలి దశలో 1.25 లక్షల మంది ఎంపిక
- ఆన్‌లైన్ రీస్కిల్లింగ్, సర్టిఫికేషన్ కోర్సులకు ప్రాధాన్యం.. ఇప్పటికే రెగ్యులర్ కోర్సులతోపాటు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి
- ఇందు కోసం 27,119 సంస్థలతో అనుసంధానం
- దేశంలోనూ ఆన్‌లైన్ కోర్సులకు పెరుగుతున్న ఆదరణ
- ప్రస్తుతం వర్సిటీలు అందించే ఆన్‌లైన్ కోర్సులకే గుర్తింపు
- ఇతర సంస్థల ఆన్‌లైన్ కోర్సులకు కూడా గుర్తింపు వస్తే మరింత పెరుగుదల



పోటీ ప్రపంచంలో ఇప్పుడంతా ఆన్‌లైన్ మయం. ఇందులో ముందుండాలంటే మిగిలిన వారితో పోలిస్తే భిన్న ప్రతిభా పాటవాలు అవసరం. తాము చదువుకున్న కోర్సుకు సంబంధించి అదనపు నైపుణ్యాలు ఉన్న వారికే కంపెనీలు పెద్దపీట వేస్తున్నాయి. అలాంటి వారికే మంచి పే ప్యాకేజీలు అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తమ విద్యకు, నైపుణ్యాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయడంతో పాటు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న అంశాల్లో ప్రముఖ సంస్థల ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పించేందుకు శ్రీకారం చుట్టింది.

సాక్షి, అమరావతి: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ఉన్నత విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి నైపుణ్యాలతో ఆయా కోర్సులు పూర్తి చేసేలా ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేయడమే కాక వారు అత్యుత్తమ, కోరుకున్న ఉద్యోగాలు సాధించేందుకు ప్రముఖ సంస్థల ద్వారా ఆన్‌లైన్ శిక్షణ ఇప్పించేందుకు మరో అడుగు ముందుకు వేసింది. రానున్న కాలం మొత్తం డిజిటల్‌గా మారుతున్న తరుణంలో ఆయా అంశాల్లో విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దుతోంది. ఇంటర్న్‌షిప్‌లకు అదనంగా కంపెనీలు, వివిధ పరిశ్రమలకు అవసరమైన ఐటీ తదితర సాంకేతిక నైపుణ్యాలను కూడా విద్యార్థులకు అందించేలా కార్యాచరణ చేపట్టింది. ఇందుకు అనుగుణంగా ప్రపంచంలోనే ప్రముఖ సంస్థలు అందిస్తున్న వివిధ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తోంది. ఈ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

మిగతా 2వ పేజీలో ▶

విజయవాడ కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



దుర్గమ్మ సేవలో సీఎం

పూర్ణకుంభంతో స్వాగతం పలికిన వేద పండితులు

అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించిన వైఎస్ జగన్

సంప్రదాయ బద్ధంగా పంచెకట్టుతో పూజలు

వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల స్వీకరణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ/సాక్షి, అమరావతి: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. అత్యంత ప్రాశస్త్యమైన మూలా నక్షత్రం రోజున శ్రీసరస్వతీదేవి అలంకరణలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మ వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. ఆదివారం

మిగతా 2వ పేజీలో ▶

ఏది నిజం?

అబద్ధాలే.. రామోజీకి నిత్యావసరం!

- చంద్రబాబు ఐదేళ్లలో కందిపప్పు, పంచదార సబ్సిడీకి రూ.568 కోట్లు.. ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్లలోనే వీటి సబ్సిడీకి పెట్టింది రూ.1,891 కోట్లు
- ఈ లెక్క చాలు రేషన్ పంపిణీపై ఎవరి చిత్తశుద్ధి ఏంటో చెప్పడానికి
- అయినా సరే పంచదార, కందిపప్పు ఇవ్వటం లేదంటూ రామోజీ రాతలు
- 2019తో పోలిస్తే 6 లక్షల కుటుంబాలకు అదనంగా రేషన్
- అప్పట్లో పండగ కానుకలంటూ హెరిటేజ్‌కే అడ్డగోలు కాంట్రాక్టు
- నిబంధనలు బేఖాతర్.. టెండర్లకు సైతం మంగళం.. అంతా వాళ్లిష్టం
- అయినా ఒక్క అక్షరం కూడా వ్యతిరేకంగా రాయని 'ఈనాడు'
- ఇప్పుడు ఇంటింటికీ రేషన్ అందుతున్నా.. దానిపైనా విమర్శలు
- జనం గతంలో సెలవు పెట్టుకుని డిపోలకు వెళ్లారట.. అదే మంచిదట
- ఇప్పుడు బండి ఎప్పుడొస్తుందో తెలియక జనానికి ఇబ్బందులట!

4లో

మహిళల మానప్రాణాలతో చెలగాటమా?



- ఐటీడీపీ పేరుతో చింతకాయల విజయ్ చేసే పని ఇదా?.. అలాంటి వారిని అరెస్టు చేయడానికి వెళ్లటం తప్పా?
- అలాంటి వ్యక్తిని సమర్థించడానికి సిగ్గుగా లేదా?
- సూటిగా ప్రశ్నించిన మంత్రి మేరుగు నాగార్జున
- ప్రజలు అసహ్యించుకునేలా విజయ్ పోస్టులు

8లో

దస్‌పల్లా భూములకు రాజకీయ రంగు పులమొద్దు

- మీడియా కథనాలు సరికాదు
- భూముల యజమాని రాణి కమలాదేవి, దిగ్విజయ్‌దేవ్ భంజ్

8లో



స్వర్ణ రథోత్సవానికి హాజరైన అశేష భక్త జనం

స్వర్ణ రథంపై సప్తగిరీశుడు


మూడు వాహన సేవల్లో దర్శనమిచ్చిన మలయప్ప

7లో

- శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలలో ఆదివారం సాయంత్రం స్వర్ణ రథోత్సవం వైభవంగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు స్వర్ణ రథంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అశేష భక్తజన గోవింద నామస్మరణలతో తిరుమల మార్మోగింది.

అరకు కాఫీ కప్పు రూ.637

- అరకు కాఫీ అంతర్జాతీయంగా రికార్డులు సృష్టిస్తోంది. జపాన్‌లో అయితే మంచి డిమాండ్ లభిస్తోంది. ప్రస్తుతం జపాన్‌లో కప్పు అరకు కాఫీని ఏడు పౌండ్ల(రూ.637)కు విక్రయిస్తున్నారు. అలాగే పలు సంస్థలు అరకు కాఫీ గింజలను సేకరించి.. ఇన్‌స్టంట్‌తో పాటు వివిధ రకాల కాఫీ పొడులుగా మార్చి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించి లాభాలను ఆర్జిస్తున్నాయి.



- వివరాలు 2లో

చిన్నారి ప్రాణాలకు సీఎం అభయం

అరుదైన వ్యాధి బాధితురాలికి రూ.కోటి కేటాయించి వైద్యం

- అమలాపురం ఏరియా ఆస్పత్రిలో తొలి ఇంజెక్షన్ ఇచ్చిన వైద్యులు
- చిన్నారికి చదువుతో పాటు పౌష్టికాహారం, పెన్షన్ అందిస్తామని ప్రభుత్వం భరోసా
- ముఖ్యమంత్రి మానవత్వాన్ని చూసి తల్లిదండ్రుల ఆనందభాష్పాలు
- జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామంటూ ఉద్వేగం



పి.గన్నవరం మండలం గంటి పెదపూడిలో జూలై 26న బాధిత బాలిక హనీ, తండ్రి రాంబాబుతో సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

అమలాపురం టౌన్: ఓ చిన్నారి ప్రాణాలకు సీఎం వైఎస్ జగన్ శ్రీరామరక్షలా నిలిచారు. ఆమెకు సోకిన అరుదైన వ్యాధి వైద్యానికి లక్షలాది రూపాయల ఖర్చును జీవితాంతం భరిస్తానని భరోసా ఇచ్చారు. దీంతో ఆ చిన్నారి తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తమ పాలిట దైవంలా వచ్చి తమ బిడ్డకు ప్రాణం పోశారంటూ ఆ నిరుపేద తల్లిదండ్రులు సీఎం జగన్‌కు చేతులెత్తి దండం పెడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం నక్కా రామేశ్వరానికి చెందిన మూడేళ్ల కొప్పాడి హనీ.. కాలేయానికి సంబంధించిన అరుదైన వ్యాధి

మిగతా 2వ పేజీలో ▶



హనీ తల్లికి మెడికల్ కిట్ అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, మునిసిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి తదితరులు

టీఆర్‌ఎస్సే ఇక బీఆర్‌ఎస్!



- తెలంగాణ రాష్ట్ర సమితి.. భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెందుతోంది. ఈ నెల 5న మధ్యాహ్నం 1.19 గంటలకు తెలంగాణ భవన్ వేదికగా కొత్త జాతీయ పార్టీ పేరును తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రకటించనున్నారు. అనంతరం డిసెంబర్ 9న ఢిల్లీ వేదికగా ఆ విర్భావ సభ నిర్వహించనున్నారు. దీనికి భావ సారూప్య పార్టీల నేతలను ఆహ్వానించనున్నట్లు సమాచారం.

9లో

మైదానంలో విషాద క్రీడ



- ఇండోనేషియాలోని స్టేడియంలో తొక్కిసలాట.. ఇద్దరు పోలీసులు సహా 125 మంది బలి
- మరో 11 మంది పరిస్థితి విషమం
- స్టేడియంలో ఓడిన జట్టు మద్దతుదారుల వీరంగం.. బాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు
- తప్పించుకునే క్రమంలో అభిమానుల తొక్కిసలాట

6లో

మౌలిక వసతుల కల్పనలో రికార్డు వ్యయం

- టీడీపీ ఐదేళ్లలో రూ.1,021 కోట్లు ఖర్చుపెట్టిన ఏపీఐఐసీ
- వైఎస్సార్‌సీపీ మూడేళ్ల పాలనలో రూ.1,058 కోట్లు.. రాష్ట్ర విభజన తర్వాత 2021–22లో అత్యధికంగా రూ.348.71 కోట్లు వ్యయం
- కొత్తగా 51 పార్కుల అభివృద్ధి

9లో

ఇదండీ సంగతి



సంతోషం! అలా అయినా మనకో ట్విట్టర్ అకౌంట్ ఉందని పబ్లిసిటీ అయ్యింది!!

పోలవరంతో భద్రాద్రి భద్రమే

ప్రాజెక్టుతో ముంపు ముప్పు లేదన్న ఐఐటీ హైదరాబాద్

పోలవరం ప్రాజెక్టు కట్టాక భద్రాచలం వద్ద పెరిగే మట్టం 2 సెంటీమీటర్లే

- గోదారికి పది వేల ఏళ్లకు ఒకసారి 44.61 లక్షల క్యూసెక్కుల వరద
- 50 లక్షల క్యూసెక్కులు వచ్చినా సులభంగా వదిలేలా పోలవరం స్పిల్‌వే
- గేట్లను సమర్థంగా నిర్వహిస్తే బ్యాక్ వాటర్ ప్రభావమే ఉండదు
- ముందు జాగ్రత్తగా 124.55 కి.మీ. పొడవున గోదావరికి కరకట్టలు నిర్మించాలని సూచన
- పోలవరం గరిష్ట వరద, బ్యాక్ వాటర్‌పై ఐఐటీ–హైదరాబాద్‌తో తెలంగాణ సర్కార్ అధ్యయనం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు వల్ల భద్రాచలానికి ఎలాంటి ముంపు ముప్పు ఉండదని ఐఐటీ–హైదరాబాద్ తేల్చి చెప్పింది. పోలవరాన్ని కట్టాక భద్రాచలం వద్ద పెరిగే గోదావరి నీటి మట్టం కేవలం గోరంతేనని (2 సెంటీమీటర్లు) స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం తాను స్వయంగా చేయించిన ఈ అధ్యయనంలోనే పోలవరం ద్వారా భద్రాచలానికి ఏ మాత్రం ముప్పు లేదని స్పష్టం కావడం గమనార్హం. వరద ప్రవాహాన్ని దిగువకు విడుదల చేసేలా పోలవరం గేట్లను సమర్థంగా నిర్వహిస్తే బ్యాక్ వాటర్ ప్రభావం భద్రాచలం సహా తెలంగాణలోని ఇతర ప్రాంతాలపై ఏమాత్రం ఉండదని తెలిపింది. పోలవరం వద్ద గోదావరి గరిష్ట వరద, బ్యాక్ వాటర్ ప్రభావంపై తెలంగాణ నీటిపారుదల శాఖ 2017లో ఐఐటీ–హైదరాబాద్‌తో

మిగతా 2వ పేజీలో ▶



గేట్ల నిర్వహణే కీలకం

పోలవరం ప్రాజెక్టు గేట్లను సమర్థంగా నిర్వహిస్తే బ్యాక్ వాటర్ ప్రభావం కనిష్ట స్థాయిలో ఉంటుందని ఐఐటీ–హైదరాబాద్ తేల్చింది. బ్యాక్ వాటర్ ప్రభావం లేకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించింది.

- పోలవరంలో నీటి నిల్వలు.. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వరదను దిగువకు విడుదల చేసేలా సమర్థంగా గేట్లను నిర్వహించాలి.
- పోలవరం జలవిస్తరణ ప్రాంతంలో నదీ గర్భంలో ఎప్పటికప్పుడు ఇసుక మేటలను తొలగించాలి. దీనివల్ల నీటి మట్టం పెరగదు.
- ముంపును నివారించాలంటే ఎగువన కాళేశ్వరం, మేడిగడ్డ లాంటి ప్రాంతాల్లో బ్యారేజ్‌లు నిర్మించాలి.
- పోలవరం డ్యామ్ నిర్మించడం వల్ల తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో భూఉపరితల మట్టం కంటే నీటి ఉపరితల మట్టం రెండు సెంటీమీటర్ల మేర పెరుగుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ప్రాధాన్యత క్రమంలో పది దశల్లో గోదావరికి ఇరువైపులా 124.55 కి.మీ. పొడవున కరకట్టలు నిర్మించాలి. ఇందుకు రూ.996.4 కోట్ల వ్యయం అవుతుంది.

క్లుప్తంగా

గాంధీజీ, శాస్త్రిలకు గవర్నర్ ఘన నివాళి



బాపూజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్

సాక్షి, అమరావతి: అహింసా సిద్ధాంతం అనే బలమైన ఆయుధాన్ని అందించిన మహాత్మా గాంధీ ప్రపంచానికి ఆదర్శనీయుడని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. జై జవాన్ జై కిసాన్ నినాదంతో దేశ రక్షణ, స్వయం సమృద్ధి దిశగా మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి దేశాన్ని ప్రగతిపథంలోకి నడిపించారని కొనియాడారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వారి సేవలను స్మరించుకుంటున్నాను..

బాపూజీ, శాస్త్రిలకు నివాళులర్పించిన సీఎం జగన్



మహాత్ముడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం సీఎం వైఎస్ జగన్ తన నివాసంలో మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆ మహనీయులకు నివాళులర్పిస్తూ సీఎం వైఎస్ జగన్ ఆదివారం ట్వీట్ చేశారు. 'మన దేశానికి చెందిన ఇద్దరు గొప్ప వ్యక్తులు జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారు అందించిన సేవలను స్మరించుకుంటున్నాను. సమాజ మేలు కోసం వారి ఆదర్శాలు, ఆలోచనలు మన దేశ పురోగతికి వేసే ప్రతి అడుగులో శాశ్వతంగా ప్రతిధ్వనిస్తాయి' అని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో..



గాంధీజీ, లాల్ బహదూర్‌శాస్త్రిల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

సాక్షి,అమరావతి : మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. పలువురు పార్టీ నేతలు వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, శాసన మండలిలో విప్ జంగా కృష్ణమూర్తి, మండలిలో విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు మాట్లాడుతూ దేశానికి గాంధీజీ, లాల్ బహదూర్‌శాస్త్రి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పోతుల సునీత, ఎమ్మెల్యే మద్దాళి గిరి, వ్యవసాయ మిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి పాల్గొన్నారు.



కర్నూలు నగరం కొత్తపేటలో లక్ష్మీదేవమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఖాదర్‌బీ



విజయనగరం జిల్లా నెల్లిమర్ల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విశాఖకు చెందిన జయలక్ష్మికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ రమ్య



శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న దేరసాం గ్రామానికి చెందిన రాముడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ సంతోష్‌కుమార్



విజయవాడ నగరంలోని కుమ్మరిపాలెం సెంటర్‌లో ముంతాజ్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ విజయకుమారి



ఒంగోలు నగరం ఇందిరమ్మ కాలనీలో కోటమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ స్వప్న



నెల్లూరులో చికిత్స పొందుతున్న తిరుపతి జిల్లా చిల్లకూరుకు చెందిన తలారి చెన్నయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పుష్పలత

94.65 శాతం మందికి పింఛన్ల పంపిణీ

- రెండు రోజుల్లో 59.18 లక్షల మందికి రూ.1,505.02 కోట్లు అందజేత
- ఆదివారం కూడా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేసిన వలంటీర్లు

సాక్షి, అమరావతి : వలంటీర్లు ఆదివారం సెలవు రోజు కూడా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను డబ్బులు పంపిణీ చేశారు. శని, ఆదివారాల్లో కలిపి రూ.1,505.02 కోట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ నెల పింఛను కింద 62,53,506 మందికి పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,590.53 కోట్లు విడుదల చేయగా... ఆదివారం సాయంత్రానికి 59,18,947 మంది లబ్ధిదారులకు రూ.1,505.02 కోట్లను అందించారు. వలంటీర్లు ఈ రెండు రోజుల్లోనే 94.65 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. మరో మూడు రోజులపాటు వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి డబ్బులు అందజేసే కార్యక్రమం కొనసాగుతుందని సెర్ప్ అధికారులు వెల్లడించారు.

అరకు కాఫీ కప్పు రూ.637

- మన కాఫీకి జపాన్‌లో అద్భుత డిమాండ్
- బెంగళూరు నుంచి అంతర్జాతీయ మార్కెట్‌కు అరకు కాఫీ



సాక్షి, అమరావతి: అరకు కాఫీ అంతర్జాతీయంగా రికార్డులు సృష్టిస్తోంది. మన కాఫీ బ్రాండ్ ఇమేజ్‌ను విదేశీ మార్కెట్‌లో సుస్థిరం చేస్తోంది. ప్రస్తుతం జపాన్‌లో కప్పు అరకు కాఫీని ఏడు పౌండ్లకు విక్రయిస్తున్నారు. ఏడు పౌండ్లు అంటే భారతీయ కరెన్సీలో రూ.637. ఆదివారం జపాన్ పౌండ్ విలువ రూ.91.0267గా ఉంది. మొదటి నుంచి అంతర్జాతీయంగా అరకు కాఫీకి మంచి డిమాండ్ ఉంది. మరోవైపు అత్యధికంగా కాఫీ తోటలను సాగు చేసే బ్రెజిల్, మన దేశంలోని కర్ణాటక రాష్ట్రంలో ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అరకు కాఫీకి మరింత డిమాండ్ పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని పాడేరు కాఫీ ప్రాజెక్ట్ పరిధిలో ఏజెన్సీ ప్రాంతంలో అరబికా, రోబస్టా చెర్రీ కాఫీ రకాలను సాగు చేస్తున్నారు. ఇదే కాఫీ రకాలను సేంద్రీయ పద్ధతి(ఆర్గానిక్)లో కూడా సాగు చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా మరింత డిమాండ్ పెరుగుతోంది.

పెరుగుతున్న కాఫీ గింజల ధర

గతేడాది అంతర్జాతీయంగా కాఫీ గింజల ఉత్పత్తి తగ్గడంతో అరకు కాఫీకి బయటి మార్కెట్‌లో మంచి ధర లభించింది. ఏడాది క్రితం వరకు అరకు కాఫీ గింజలు సాధారణంగా కిలో రూ.150 నుంచి రూ.180 ధర ఉండేది. గత ఏడాది నవంబర్, డిసెంబర్ మాసాల్లో అరబిక్ పార్చిమెంట్(తొక్క తీసిన కాఫీ గింజలు) కిలో రూ.350 నుంచి రూ.380కి పైగా ధర లభించింది. బెంగళూరులోని అనేక ప్రైవేటు సంస్థలు అరకు కాఫీ గింజలను సేకరిస్తాయి. ఆ గింజలను శుద్ధి చేసి ఇన్‌స్టెంట్ కాఫీ పొడిగా, వివిధ రకాల కాఫీ పొడులుగా మార్చి ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయిస్తాయి. అయితే, వ్యాపారులు అరకు కాఫీ పొడి పేరుతోనే బెంగళూరును కేంద్రంగా చేసుకుని బ్రెజిల్, జపాన్ తదితర దేశాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తున్నారు.

'సుగమ' అతిథి గృహం ప్రారంభం

శ్రీ శారదా పీఠం పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి అశ్వనీకుమార్ చౌబే



అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి అశ్వనికుమార్ చౌబే, న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

సింహాచలం : విశాఖ శ్రీశారదా పీఠం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సుగమ అతిథి గృహాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి అశ్వనీకుమార్ చౌబే, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, రైల్వే జడ్జి శ్రీనివాస్‌లు ప్రారంభించారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారిని వారు దర్శించుకున్నారు. స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిల సమక్షంలో పూజలు నిర్వహించారు.

యువతలో మేధోశక్తి పెరగాలి

పీఠంలో జరిగిన సరస్వతీ పూజలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యువతరంలో మేధో శక్తి పెరగాలని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అమ్మవారిని ప్రార్థించారు. సరస్వతీదేవి ఆరాధనకు, విశాఖ శ్రీ శారదా పీఠానికి ఉన్న సంబంధాన్ని వివరించారు. రాజశ్యామల అమ్మవారి నిత్య ఆరాధనతో విరాజిల్లుతోన్న శారదాపీఠంలో ముహూర్తంతో సంబంధం లేకుండా ఎప్పుడైనా అక్షరాభ్యాసాలు చేయించుకోవచ్చన్నారు. అమ్మవారిని ఆరాధించే విద్యార్థుల కోరికలు ఫలించేందుకు పీఠాన్ని సంప్రదిస్తే ప్రసాదంగా అమ్మవారి కుంకుమను ఉచితంగా పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంతో భద్రాద్రి భద్రమే

▶ మొదటి పేజీ తరువాయి

అధ్యయనం నిర్వహించింది. గోదావరి పరీవాహక ప్రాంతంలో సీడబ్ల్యూసీ, తెలంగాణ జలవనరుల విభాగం లెక్కల ప్రకారం వరద ప్రవాహాలు, ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ నమోదు చేసిన వరద ప్రవాహాలను అధ్యయనం చేసేందుకు ఐఐటీ–హైదరాబాద్‌కు తెలంగాణ ప్రభుత్వం అందజేసింది.

ముంపు ముప్పు ఉత్తదే..

ధవళేశ్వరం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నమోదు చేసిన రికార్డులు కచ్చితంగా ఉండటంతో వాటిని పరిగణలోకి తీసుకుని పోలవరం వద్ద వెయ్యేళ్లకు, పది వేల ఏళ్లకు ఒకసారి గరిష్ఠంగా వచ్చే వరదను లెక్కకట్టిన ఐఐటీ–హైదరాబాద్ బ్యాక్ వాటర్ ప్రభావంపై సమగ్రంగా అధ్యయనం చేసింది. అందులో వెల్లడైన అంశాలివీ..

- పోలవరంలో 45.72 మీటర్లలో 194.6 టీఎంసీలను నిల్వ చేస్తే 637 చ.కి.ప్రాంతం ముంపునకు గురవుతుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 601, ఒడిశాలో 12, ఛత్తీస్‌గఢ్‌లో 24 చ.కి.మీ. భూభాగం ఉంది. ఆంధ్రప్రదేశ్ 222 రెవెన్యూ గ్రామాలు ముంపునకు గురవుతుండగా ఛత్తీస్‌గఢ్‌లో పది, ఒడిశాలో ఏడు రెవెన్యూ గ్రామాలపై ముంపు ప్రభావం ఉంటుంది.
- గోదావరిలో గరిష్ఠంగా 36 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చినప్పుడు భద్రాచలం వద్ద నీటి మట్టం పోలవరం కట్టక ముందు 57 మీటర్లు ఉంటే.. కట్టాక 57.02 మీటర్లు మాత్రమే ఉంటుంది.
- గోదావరి చరిత్రలో 1986 ఆగస్టు 16న ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి గరిష్ఠంగా 35,06,338 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది.
- గోదావరి గరిష్ఠ వరద ప్రవాహాలను పరిగణలోకి తీసుకుంటే వెయ్యేళ్లకు ఒకసారి గరిష్ఠంగా 39.72 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. ఆ స్థాయిలో వరద వచ్చినప్పుడు భద్రాచలం వద్ద నీటి మట్టం పోలవరం కట్టక ముందు 57.7 మీటర్లు ఉంటే.. నిర్మాణం పూర్తయ్యాక 57.77 మీటర్లు ఉంటుంది.
- పది వేల సంవత్సరాలకు ఒకసారి గోదావరికి గరిష్ఠంగా 44.61 లక్షల క్యూసెక్కుల వరద వస్తుంది. ఆ స్థాయిలో వరద వచ్చినప్పుడు భద్రాచలం వద్ద నీటి మట్టం పోలవరం కట్టక ముందు 61.41 మీటర్లు ఉంటే.. నిర్మాణం పూర్తయ్యాక 61.43 మీటర్లు ఉంటుంది.
- కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదించిన డిజైన్ మేరకు గోదావరికి గరిష్ఠంగా 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా సులభంగా విడుదల చేసేలా పోలవరంలో ప్రపంచంలోనే అతిపెద్ద స్పిల్‌వే నిర్మిస్తున్నారు. పోలవరం డిజైన్ మేరకు అంటే గరిష్ఠంగా 50 లక్షల క్యూసెక్కుల వరద గోదావరికి వచ్చినప్పుడు భద్రాచలం వద్ద నీటి మట్టం ప్రాజెక్టు కట్టక ముందు 61.77 మీటర్లు ఉంటే కట్టాక 61.79 మీటర్లు ఉంటుంది.

దుర్గమ్మ సేవలో సీఎం



దుర్గమ్మకు తెచ్చిన పట్టువస్త్రాలను ఆలయ ఈవో భ్రమరాంబకు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

మధ్యాహ్నం 3 గంటలకు సంప్రదాయ పట్టు పంచె, తెల్ల చొక్కా ధరించి ఆలయ దర్శనానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వేద పండితులు, ఆలయ పూజార్లు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ స్థానాచార్యులు విష్ణు భట్ల శివప్రసాద్ శర్మ సీఎం తలకు పరివట్టం (పట్టువస్త్రంతో తలపాగా) చుట్టారు. అనంతరం అమ్మ వారికి సమర్పించే పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలను వైఎస్ జగన్ తన తలపై పెట్టుకుని మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ్య ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారి అంతరాలయంలోకి వెళ్లి శ్రీసరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో వేద పండితులు సీఎం జగన్‌కు వేద ఆశీర్వచనం.. ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ, ఆలయ ఈవో భ్రమరాంబలు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్, ఎంపీలు నందిగం సురేష్, వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణ్‌కుమార్, కల్పలతారెడ్డి, ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యేలు కొడాలి నాని, వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, కె.అనిల్‌కుమార్, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అమ్మవారి ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

చిన్నారి ప్రాణాలకు సీఎం అభయం

▶ మొదటి పేజీ తరువాయి

'గాకర్స్' బారిన పడింది. తల్లిదండ్రులు రాంబాబు, నాగలక్ష్మి నిరు పేదలు. తండ్రి ఇంటింటా ప్రభుత్వ రేషన్ వాహనాన్ని నడుపుకుంటూ, తల్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఐదేళ్ల కుమారుడు, కుమార్తె హనీ ఉన్నారు. హనీకి 15 రోజులకోసారి రూ.1.25 లక్షల విలువైన సెరిజైమ్ అనే ఇంజెక్షన్ చేయాల్సి ఉంది. అమెరికాలోని ఈ ఇంజెక్షన్ తయారీ సంస్థ డిస్కౌంట్ పోను రూ.74 వేలకు దీనిని అందిస్తోంది. ఇంత ఖర్చు చేయడం ఆ కుటుంబం వల్ల కావడం లేదు.

ప్లకార్డు చూసి.. స్పందించిన సీఎం జగన్

కుమార్తెను ఎలా దక్కించుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపద్బాంధవుడిలా కనిపించారు. గత జూలై 26న సీఎం జగన్ కోనసీమ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల సందర్శనకు వచ్చారు. లంకల్లో వరద పరిస్థితులను పరిశీలించాక పి.గన్నవరం మండలం గంటి పెదపూడిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు కాన్వాయ్‌తో వెళుతున్నారు. 'సీఎం గారూ.. మా పాపకు వైద్యం అందించండి' అనే అభ్యర్థనతో ప్లకార్డు పట్టుకుని.. హెలిప్యాడ్ సమీపాన కుమార్తెతో కలిసి తల్లిదండ్రులు నిలుచున్నారు. ఆ ప్లకార్డు చూసి ఆగిన సీఎం జగన్.. ఆ చిన్నారి వ్యాధి గురించి విని చలించిపోయారు. పాప ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఎన్ని లక్షల రూపాయలు ఖర్చయినా జీవితాంతం వైద్యం చేయిస్తానని వారికి భరోసా ఇచ్చారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆదేశించారు.

తొలి విడతగా రూ.10 లక్షలతో 13 ఇంజెక్షన్లు

సీఎం ఆదేశాల మేరకు చిన్నారి వైద్యానికి తొలి విడతగా రూ.10 లక్షల విలువైన 13 ఇంజెక్షన్లను అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక ముందు కూడా దాదాపు రూ.40 లక్షలతో మరో 52 ఇంజెక్షన్లు తెప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రిలో కలెక్టర్ సమక్షంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పద్మశ్రీరాణి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి భరతలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావులు.. హనీకి ఆదివారం ఉదయం తొలి ఇంజెక్షన్ చేశారు. బాలిక తల్లిదండ్రులకు కలెక్టర్ శుక్లా ధైర్యం చెప్పారు. చిన్నారి వైద్యానికి సీఎం జగన్ రూ.కోటి కేటాయించారని తెలిపారు. చదువుతో పాటు పౌష్టికాహారం, పెన్షన్‌ను కూడా ప్రభుత్వం అందిస్తుందని భరోసా ఇచ్చారు. చిన్నారికి ప్రభుత్వం సరఫరా చేసిన మందుల కిట్‌ను వారికి అందించారు.

దేశంలో మొత్తం 14 మంది.. రాష్ట్రంలో తొలి బాధితురాలు

హనీకి వచ్చిన కాలేయ సంబంధిత గ్రాకర్ వ్యాధి అత్యంత అరుదైనది. దేశంలో ఈ తరహా బాధితులు 14 మందే ఉండగా.. రాష్ట్రంలో హనీ తొలి బాధితురాలు. కాలేయ పనితీరులో జరిగే ప్రతికూల పరిస్థితులు, జన్యుపరమైన లోపాల వల్ల ఈ అరుదైన వ్యాధి సోకుతుంది. లివర్ హార్మోన్ల రీప్లేస్‌మెంట్ థెరపీ ద్వారా చిన్నారికి వైద్యం అందిస్తున్నారు. లివర్‌లో ఉండే ఎంజైమ్ బీటా గ్లూకోసైడేజ్ లోపించడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. వీరికి జీవితాంతం వైద్యం అవసరం. అయితే హనీ చిన్న వయస్సులో ఉన్నందున పదేళ్ల పాటు ప్రతి నెలా రెండు ఇంజెక్షన్ల చొప్పున ఇస్తే.. ఆరోగ్యం కుదుటపడే అవకాశముందని వైద్యులు భావిస్తున్నారు.

పేదోడి కోసం ఓ ముఖ్యమంత్రి ఇంతలా పరితపిస్తారా..

"ఈ రోజే తొలి ఇంజెక్షన్ ఇచ్చారు. మా పాపకు ప్రాణం దానం చేసిన సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. ఆ రోజు కాన్వాయ్‌లో సీఎం జగనన్న మమ్మల్ని చూసి ఆగడం.. మా పాప అనారోగ్యం గురించి తక్షణమే స్పందించి కలెక్టర్‌కు చెప్పడం, ఇప్పుడు రూ.లక్షల విలువైన వైద్యం అందించడం చూస్తుంటే.. ఓ సీఎం ఇంతలా ఓ పేదవాడి కోసం తపిస్తారా.. అని ఆశ్చర్యమేస్తోంది. మా బిడ్డను ఆదుకుని మాపాలిట దైవంలా నిలిచిన జగనన్నకు చేతులెత్తి దండాలు పెడుతున్నాం." – తల్లిదండ్రులు రాంబాబు, నాగలక్ష్మి



కలల కొలువు సులువే..

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పించేందుకు 2.15 లక్షల మందిని గుర్తించారు. అలా గుర్తించిన వారితో పాటు మరికొంత మంది అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవడంతో ఆ సంఖ్య 2,45,700కు చేరింది. అయితే ఆయా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు తొలి విడతలో 1.25 లక్షల మందిని గుర్తించి శిక్షణను చేపట్టింది. ఇందులో భాగంగా ఆన్‌లైన్ సంస్థల ద్వారా ఆన్‌లైన్ రీస్కిల్లింగ్, సర్టిఫికేషన్ కోర్సులకు ప్రాధాన్యం ఇస్తోంది. ఐటీ తదితర విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇప్పించడం వల్ల వారికి మరింత మేలు చేకూరనుంది. మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, గూగుల్ వంటి సంస్థల నుంచి అందే ఈ సర్టిఫికేషన్ కోర్సులకు అంతర్జాతీయంగా కూడా మంచి గుర్తింపు ఉండడంతో విద్యార్థులు కోరుకున్న కొలువులను సులువుగా దక్కించుకోగలుగుతారు.

ఇంటర్న్‌షిప్‌లకు పరిశ్రమలతో అనుసంధానం

ఓవైపు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసిన ప్రభుత్వం.. మరో వైపు రాష్ట్రంలోని అన్ని కళాశాలలను వివిధ పరిశ్రమలు, ఐటీ సంస్థలు, ప్రముఖ వాణిజ్య సంస్థలతో సహా కోర్సులతో సంబంధమున్న 27,119 సంస్థలతో అనుసంధానించింది. విద్యార్థులు తమ కోర్సును బట్టి ఈ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం కల్పించింది. ఇందుకు ఉన్నత విద్యా మండలి ద్వారా ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేయించింది. అంతేకాకుండా జిల్లాల్లో ఆయా సంస్థలతో సమన్వయం చేసేందుకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలను, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆయా విభాగాల ముఖ్య కార్యదర్శులతో కమిటీలను ఏర్పాటు చేసింది. ఇంటర్న్‌షిప్ కోసం రాష్ట్రంలోని మైక్రో స్థాయి నుంచి మెగా పరిశ్రమల వరకు ఉన్న వాటిని ఉన్నత విద్యా మండలి ఎంపిక చేసింది. ఇందులో తయారీ, సేవా రంగాల్లో శిక్షణ ఇవ్వనుంది. శిక్షణ సమయంలో మంచి పనితీరు కనబరిచే వారికి ఆ కంపెనీలే ఉద్యోగాలు ఇచ్చేలా చూస్తోంది. తయారీ సంస్థల్లో మైక్రో విభాగంలో 11,510, స్మాల్ 10,169, మీడియం 569, లార్జ్ 1,191, మెగా విభాగంలో 144 సంస్థలను గుర్తించారు. సేవల రంగంలో మైక్రో విభాగంలో 1,378, స్మాల్ 1,757, మీడియం 149, లార్జ్ 227, మెగా విభాగంలో 25 సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉండేలా ఏర్పాట్లు చేశారు.

పెరుగుతున్న డిమాండ్


ముఖ్యంగా కోరుకున్న ఉద్యోగాలను దక్కించుకోవడానికి విద్యార్థులు ఆన్‌లైన్ కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంజనీరింగ్, మెడికల్, బీఏ, బీఎస్సీ, బీబీఏ, లా, జీమ్యాట్, ఎంబీఏ, సీఏ వంటి కోర్సులతో పాటు సివిల్ సర్వీసెస్, బ్యాంకు ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాల కోసం అభ్యర్థులు ఆన్‌లైన్ కోర్సులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే వివిధ రెగ్యులర్ కోర్సులను ఆన్‌లైన్ ద్వారా అందించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రభుత్వ, అనుమతి పొందిన యూనివర్సిటీల ద్వారా అందిస్తున్న కోర్సులకు గుర్తింపు కూడా ఇచ్చింది. ప్రైవేట్ ఎడ్యుటెక్ సంస్థలు అందిస్తున్న కోర్సులకు కూడా గుర్తింపు వస్తే వీటిని అభ్యసించే వారి సంఖ్య మరింత పెరుగుతుంది. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 2021 నాటికి సగటు వార్షిక వృద్ధి రేటు 33.6 శాతంగా ఉందని అధ్యయన సంస్థలు పేర్కొంటున్నాయి. ఆన్‌లైన్ కోర్సులను అభ్యసించే వారి సంఖ్య రానున్న కాలంలో 2.5 కోట్ల నుంచి 4.63 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నాయి.



రాష్ట్రంలో ఆన్‌లైన్ శిక్షణ ఇలా..

డొమైన్	అభ్యర్థుల గుర్తింపు	దరఖాస్తులు	ప్రాథమిక ఎంపిక
సేల్స్‌ఫోర్స్ డెవలపర్	22,000	25,000	22,000
సేల్స్‌ఫోర్స్ అడ్మిన్	13,000	15,000	13,000
మైక్రోసాఫ్ట్ అజూర్	25,000	25,000	25,000
ఫుల్ స్టాక్ (డాట్ నెట్)	10,000	9,000	6,500
ఫుల్ స్టాక్ (పైథాన్)	10,000	7,000	5,000
హెచ్ఆర్	10,000	3,200	1,500
జీఎఫ్ఎస్ఐ ఎనలిస్ట్	10,000	2,500	1,000
బిజినెస్ డెవలప్‌మెంట్	10,000	4,500	2,000
మెడికల్ స్క్రైబ్	5,000	2,000	1,000
వీఎం వేర్	10,000	9,000	8,000
గూగుల్ ఆండ్రాయిడ్	10,000	7,000	5,500
ఏడబ్ల్యూఎస్ క్లౌడ్	10,000	8,000	6,000
నెట్‌వర్కింగ్	10,000	8,500	5,000
క్లౌడ్ నెట్‌వర్కింగ్	10,000	7,000	4,500
డేటా ఎనలిటిక్స్	10,000	8,000	7,000
ఏఐ ఎంఎల్	10,000	5,000	2,000
సైబర్ సెక్యూరిటీ	10,000	6,500	3,000
ఆర్పీఏ	5,000	3,500	500
ఇతర కోర్సులు	15,000	9,000	6,500


JioMart.com
JioMart
FESTIVE READY SALE
3 నుండి 4 అక్టోబర్
ఉచిత హోమ్ డెలివరీ
కనీస ఆర్డర్ లేదు
హోమ్ మరియు కిచెన్‌పై అద్భుతమైన ఆఫర్లతో ఇంటికి తెచ్చుకోండి పండుగ ఉత్సాహాన్ని,
ఒక గొప్ప సేల్. వేడుకలకు కారణాలు అనంతం
బ్లాక్‌బస్టర్ డీల్స్
వండర్‌షెఫ్ 4 Pcs కుక్‌వేర్ సెట్ ₹4000 @₹ 1,299
డబల్ బెడ్‌షీట్స్ ₹1399 @₹ 199
నీలం స్టెయిన్‌లెస్ స్టీల్ 3 pc కుక్కర్ సెట్ (2,3,5L) ₹5990 @₹ 1,999
సెల్లో ఒపాల్ వేర్ డిన్నర్ సెట్ మొదలు ₹765 @₹ 649
కిచెన్ క్రాఫ్ట్ 5 pcs కాపర్ బాటమ్ హండి సెట్ ₹1499 @₹ 399
డఫెల్ ట్రాలీ ఆరంభ ₹2599 @₹ 399
హోమ్ & కిచెన్
బెస్ట్ డీల్స్‌ని 80% వరకు తగ్గింపుకే సొంతం చేసుకోండి
కోర్టినా కర్టెన్ 2 గల ప్యాక్ మొదలు ₹899 @₹ 159
బాత్ టవల్స్ మొదలు ₹799 @₹ 99
సెల్లో ఓపల్‌వేర్ కప్ & సాసర్ ₹775 @₹ 399
రితు హ్యాండీ చాపర్ 450 Ml ₹250 @₹ 99
లైఫ్‌లాంగ్ 3L ప్రెజర్ కుక్కర్ ₹1100 @₹ 399
మాక్‌లైట్ అప్పం పాత్ర 12 గుంటలు మూతతో ₹695 @₹199
క్లాసిక్ ఎస్సెన్షియల్స్ స్టెయిన్‌లెస్ స్టీల్ డిన్నర్ సెట్ 32 Pcs ₹3389 @₹ 1,499
గ్లాస్‌వేర్ ఓషన్ | ట్రియో | లుమినార్క్‌లో టాప్ బ్రాండ్స్ 40% వరకు తగ్గింపు
ఇల్లు ఆఫీస్ కుర్చీలు ₹9999 @₹ 2,999
ఫావరిటో సెట్ 12 కంటెయినర్ల గలది ₹1499 @₹ 149
హోజెల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కంటైనర్ సెట్ 4 ₹1449 @₹ 299
నిర్లాన్ కుక్‌వేర్ రేంజ్ మొదలు ₹599 @₹ 199
తల్లి & శిశువు సంరక్షణ
80% వరకు ఆదా
వావ్‌పెర్ ఫ్రెష్ ప్యాంట్ స్టైల్ డైపర్ ₹1598 @₹ 781
మదర్‌కేర్ క్విక్ అబ్సార్బ్ ప్యాంట్స్ ₹899 @₹ 449
మైలో కేర్ క్లెన్సింగ్ బేబీ వైప్స్‌తో ₹539 @₹ 190
జాన్సన్స్ బేబీ లోషన్ 200 ml ₹175 @₹ 145
లువ్‌లప్ బ్లాక్ బ్లూ సన్‌షైన్ స్ట్రోలర్ ₹5299 @₹ 3,799
పర్యావరణానికి అనుకూలమైన చెక్క బొమ్మలు మొదలు ₹650 @₹ 225
AXIS BANK
dil se open celebrations
10% CASHBACK with Credit & Debit Cards
3rd to 5th Oct 2022
10% Cashback. Min. Txn 1500/- Max Cashback 500/-
SCAN THE QR CODE TO DOWNLOAD THE APP NOW
Terms & Conditions Apply. Offer valid till stocks last and all offers are subject to change without prior intimation/notice. The pictures/photographs of the products shown are for representation purposes only. MRP of all products are inclusive of all taxes. All offers are valid till 4th October 2022. All disputes are subject to the exclusive jurisdiction of the courts in Mumbai only.
SAATCHI & SAATCHI



"సుఖపడే సంసారాలన్నీ ఒకలాగే ఉంటాయి. సుఖం లేని సంసారాలకు మాత్రం దేని బాధలు దానివి.
- లియో టాల్‌స్టాయ్

సాక్షి
సోమవారం, అక్టోబర్, 3

సాహితీ శరత్తు

ప్రాచీన కవులు మొదలుకొని నవీన కవుల వరకు శరదృతు వర్ణన చేయని కవులు సాహితీలోకంలో అరుదు. వర్షకాలం నిష్క్రమించి, కరిమబ్బులు తొలగిన స్వచ్ఛగగనంలో రాత్రివేళ కనిపించే చందమామ కురిపించే వెన్నెల సోనల జడిలో మనసు తడిసి మురిసిన కవులు నిలువెల్లా పులకించి పుంఖాను పుంఖాలుగా పద్యాలు రాశారు. 'శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులం/ జారు తరంబులయ్యె వికసన్నవ కైరవ గంధ బంధురో/ దార సమీర సౌరభము దాల్చి సుధాంశు వికీర్యమాణ క/ ర్పూర పరాగ పాండు రుచి పూరము లంబరపూరితంబులై'- భారతంలో నన్నయ చివరి పద్యం ఇది. వెన్నెల ధగధగలతో నిండిన శారద రాత్రులు నక్షత్రాల పట్ల దొంగల య్యాయని ఈ పద్యంలో చమత్కరించాడాయన. వెన్నెల వెలుగుల్లో నక్షత్రాలు అంత స్పష్టంగా కనిపించవు కదా! కర్పూరపు పొడిలా వెన్నెల కురుస్తోందని, వికసించిన కలువల సుగంధాన్ని మోసుకుపోయే చల్లగాలితో, పూల పరాగంతో ఆకాశం వెలిగిపోతోందంటూ శరద్రాత్రులను కళ్లకు కట్టాడాయన.

శరదృతువును 'న భూతో న భవిష్యతి' అనే రీతిలో వర్ణించిన కవి ఆంధ్రభోజుడు కృష్ణదేవ రాయలు. ఆయన కావ్యం 'ఆముక్త మాల్యద'లో శరదృతువును వర్ణించే పద్యాలు అనేకం ఉన్నాయి. వాటిలో మచ్చుకొకటి చూద్దాం. 'గగనలక్ష్మి నిజోరు నక్షత్రమాలి/ కలు, వియన్నది జలముల గడుగ బిసుక/ నెఱయు కుంకుడు బండుల నుఱువులనగ/ బలపలని పాండురాంబుద పంక్తులమరె'- గగనలక్ష్మి తన ఇరవైఏడు నక్షత్రాల ముత్యాల సరాలను ఆకాశగంగలో కుంకుడురసంతో కడుగుతోందట. ఆ కుంకుడు నురుగులా ఉన్నాయట శరదాకాశంలో తేలియాడే తెలిమబ్బులు. ఇంతటి వర్ణన ప్రాచీన సంస్కృత సాహిత్యంలో సైతం ఎక్కడా కనిపించదు.

రుతువర్ణనలోనూ వికటకవి తెనాలి రామకృష్ణుడి పద్ధతే వేరు! 'పాండురంగ మాహాత్మ్యము'లో తెనాలివారి శరదృతు వర్ణనకు ఒక మచ్చుతునక- 'కలుగకుండిన నేమి కడిమి పువ్వుల తావి/ ననిచిన మరువమెంతటికి నోప?/ దొదవకుండిన నేమి మదకేకి నటనంబు/ చాలదె యంచల సంభ్రమంబు?/ మెరవకుండిననేమి మెరుగుల పొలప మే/ తన్మాత్రములె శాలిధళధళములు?/ నుడియకుండిన నేమి సోనవానల పెల్లు/ గజదాన వృష్టికి గడమ కలదె?/ కారుకాలాన కలిగిన గౌరవంబు/ చొకమై తోచె శరదృతు సౌష్ఠవమున/ నురిలి తొల్లిటి యధికారి యోసరిలిన/ వెనుక యధికారి యవికావె విభవకళలు?'. వర్షకాలంలోని కడిమిపూల పరిమళం లేదుగాని, శరత్తులో మరువం సుగంధం ఉంది కదా! నెమళ్ల నాట్యం లేకపోతేనేం హంసల సంరంభముంది కదా? మెరుపులు మెరవకపోతేనేం శాలిధాన్యాల తళతళలున్నాయి కదా! చిరుజల్లులు కురవకపోతేనేం ఏనుగులు మదజలాలను వర్షిస్తున్నాయి కదా! వర్షాకాలంలో దొరికేవి శరత్తులో మరింత చౌకగా దొరుకుతున్నాయి. శరత్తు తన ధర్మాలతో పాటు వర్షాకాల ధర్మాలనూ చూపుతోంది. ఒక అధికారి వైదొలగాక వచ్చే అధికారికి పాత అధికారి వైభవం దక్కినట్లే, శరత్తుకు వర్షరుతు వైభవమూ దక్కిందని చమత్కరించడం తెనాలి రామకృష్ణుడికే చెల్లింది.

నవీనుల్లో చూసుకుంటే, 'ఓ సఖీ! ఓ సుహాసినీ! ఓ శరద్వి/భావరీ నర్తకీ! కవిభావనా వి/లాసినీ! నిత్యసైరంధ్రి! ఓ సమస్త/ లోక మోహినీ! ఓ స్వప్నలోకరాజ్ఞి!' అంటూ శరదృతువును అపూర్వంగా సంబోధించారు 'గౌతమీ కోకిల' వేదుల సత్యనారాయణశాస్త్రి. ఆరు రుతువుల్లోనూ అత్యంత ఆహ్లాదకరమైనది శరదృతువు. వర్షాలు తగ్గుముఖం పట్టి, నిర్మలాకాశం కనిపిస్తుంది. నేల మీద చిత్తడి తగ్గుతుంది. వాతావరణం సమశీతలంగా ఉంటుంది. ఉక్కపోతా ఉండదు, వణికించే చలీ ఉండదు. పనిపాటలకు మాత్రమే కాదు, విహార విలాసాలకూ కాలం అనుకూలంగా ఉంటుంది.

'పెరిగిన శాలిసస్యముల బెంపువహించిన భూతలంబులన్/ సరసతృణాభితృప్తమయి, స్వస్థములై తగు గోకులంబులన్/ వరకలహంస సారసరవంబులకుం బ్రతిపల్కు సీమలం/ బరగుచు నెందు జూచినను భవ్యములయ్యెను నేడు క్షేత్రముల్'- అంటూ కాళిదాసు 'ఋతు సంహారం'లోని శరద్వర్ణనను తిరుమల కృష్ణదేశికాచార్యులు తెలుగులోకి అనువదించారు. ఇక 'ఋతుఘోష'లో శేషేంద్ర 'ముల్లోకములు ఏలు ముద్దుహరిణాంకుడు/ విరజాజి తీవలకు విరహిణీ జీవులకు/ తరిపి వెన్నెల పాలు త్రాగించుచున్నాడు' అని శరత్ చంద్రుడి విలాసాన్ని వర్ణించారు.

నింగీ నేలా ఆహ్లాదభరితంగా ఉండే అద్భుతమైన రుతువు ఇది. ఈ ఆహ్లాదభరితమైన రుతువులోనే శరన్నవరాత్రులు జరుపుకోవడం ఆనవాయితీ. మన సంస్కృతిలో వసంత నవరాత్రుల కంటే శరన్నవరాత్రులకే ప్రాశస్త్యం ఎక్కువ. శరన్నవరాత్రుల్లో దేశం నలుమూలలా ఘనంగా దేవీపూజలు చేస్తారు. విజయదశమి దసరా పండుగగా ఆబాల గోపాలానికీ ప్రీతిపాత్ర మైన పండుగ. ఒకప్పుడు దసరా పండుగ రోజుల్లో పిల్లల సందడి ఎక్కువగా ఉండేది. గురువుల వెంట పిల్లలు విల్లంబులు పట్టుకుని ఇంటింటికీ వెళ్లేవారు. 'ఏదయా మీ దయా మామీద లేదు/ ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు... అయ్యవారికి చాలు ఐదు వరహాలు/ పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు' అంటూ పద్యాలు పాడేవారు. ఇంటివారు ఇచ్చే కానుకలు తీసుకుని సంతోషంగా కేరింతలు కొడుతూ వెళ్లేవారు. అదొక ముచ్చట. నాలుగైదు దశాబ్దాల కిందటి వరకు తెలుగునాట ఊరూరా సజీవంగా ఉన్న ఈ సంస్కృతి ఇప్పుడు కనుమరుగైపోయింది. భూతాపం పెరుగుతున్న నేపథ్యంలో ఇటీవలి కాలంలో ప్రకృతి కొంత గతి తప్పుతోంది. అలాగని ప్రకృతి తన రుతుధర్మాన్ని నెరవేర్చు కోవడాన్ని మానుకోలేదు. అందుకే మనం ఇంకా శరత్తుల సౌందర్య సౌరభాలను ఎంతో కొంత ఆస్వాదించగలుగుతున్నాం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు.
ఆశ్వయుజ మాసం, తిథి: శు.అష్టమి సా.4.06 వరకు, తదుపరి నవమి
నక్షత్రం: పూర్వాషాఢ రా.12.50 వరకు, తదుపరి ఉత్తరాషాఢ
వర్జ్యం: ప.11.24 నుండి 12.54 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.13 నుండి 1.02 వరకు, తదుపరి ప.2.35 నుండి 3.24 వరకు, **అమృతఘడియలు:** రా.8.21 నుండి 9.50 వరకు, దుర్గాష్టమి, బతుకమ్మ పండగ.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

అబద్ధాలే... రామోజీకి నిత్యావసరం!

నిత్యం అబద్ధాలాడటం... రామోజీరావుకు నిత్యావసరం!!. చంద్రబాబు నాయుడు ఐదేళ్లూ ఏమీ చేయకపోయినా... అదో గుప్తుల కాలం నాటి స్వర్ణయుగంలా రోజూ కీర్తిస్తే జనాన్ని కొంతయినా నమ్మించగలమనేది ఆయన దింపుడు కళ్లం ఆశ. నిత్యావసరాల్లో కోత... అంటూ ఆదివారంనాడు ఆయన చేసిన ఆక్రందనలూ అందులో భాగమే. ఎందుకంటే రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు దిగిపోయేనాటికి ఉన్న రేషన్ కార్డులు 1.39 కోట్లు. ఇప్పుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఉన్నవి 1.45 కోట్లు. అంటే... ఏకంగా 6 లక్షల కుటుంబాలు పెరిగినట్లు. ఈ నిజాన్ని రామోజీరావు చెప్పరుగాక చెప్పరు. ఇక చంద్రబాబు ఏలిన ఐదేళ్లలోనూ కందిపప్పు, పంచదారపై నాటి ప్రభుత్వం పెట్టిన మొత్తం ఖర్చు రూ.568 కోట్లు. కానీ వై.ఎస్.జగన్ హయాంలో ఈ మూడేళ్లలోనే కందిపప్పు, పంచదార రేషన్ డిపోల్లో ఇవ్వటానికి ప్రభుత్వం చేసిన వ్యయం ఏకంగా రూ.1,891 కోట్లు. ఈ రెండు లెక్కలూ చాలవూ... ఎవరి హయాంలో ఏం జరిగిందో కళ్లకు కట్టడానికి? కాకపోతే ఈ వాస్తవాలను 'ఈనాడు' కావాలనే చెప్పదు. పైపెచ్చు కందిపప్పు, పంచదారలో ప్రభుత్వం కోతపెడుతోందని రాస్తూ... చంద్రబాబు హయాంలో ప్రతినెలా ప్రతి కార్డుకూ కిలోలకు కిలోలు పంపిణీ చేశారనే గ్రాఫిక్స్ చూపించడానికి పడరాని పాట్లు పడుతోంది. ఈ ముసుగులు తొలగిస్తూ... నిజానిజాలేంటో చెప్పే కథనమిది!.

బాబు ఐదేళ్లలో కందిపప్పు, పంచదార సబ్సిడీకి రూ.568 కోట్లు

- ఈ ప్రభుత్వం మూడేళ్లలోనే వీటి సబ్సిడీకి పెట్టింది రూ.1,891 కోట్లు
- ఎన్నికల ముందు బాబు ఇచ్చిన తాయిలాలకూ అద్భుత ప్రచారం
- ఒకటి రెండు నెలలు పంపిణీ చేసినా.. అదే సూపరంటూ డప్పులు
- పిచ్చి రాతలతో నానాటికీ దిగజారిపోతున్న 'ఈనాడు'



రాష్ట్రంలో 2014 నుంచీ ప్రజా పంపిణీ వ్యవస్థ కింద పామాయిల్ కేటాయింపులే లేవన్నది నిజం. 2020 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు సబ్సిడీ కందిపప్పు ధర రూ.67కే స్థిరంగా అందిస్తున్నారని, ఎక్కడా పెంచలేదన్నది నిజం. కానీ వీటిని 'ఈనాడు' చెప్పదు. అయినా చంద్రబాబు హయాంలో పండగ కానుకలు ఎందుకిచ్చారో మీకు తెలియదా రామోజీరావు గారూ? పీడీఎస్ డబ్బుల్ని హెరిటేజ్ లాంటి కంపెనీలకు దోచిపెట్టడానికి కాదా? ఎలాంటి నిబంధనలూ లేకుండా... టెండర్ల ఊసే లేకుండా ఇష్టం వచ్చిన ధరలకు ప్రభుత్వానికి సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టులు మింగింది మీరందరూ కాదా? అసలు పేదలకు నాణ్యమైన సరుకులు ఇచ్చేందుకు ఏనాడైనా ప్రయత్నించారా? అప్పట్లో బియ్యాన్ని తీసుకున్నా తినగలిగే పరిస్థితి ఉండేదా? ఇప్పుడు మధ్యస్థ సన్నరకం బియ్యాన్ని తీసుకుని ఖర్చుకు వెరవకుండా మరింత నాణ్యంగా సార్టెక్స్ చేసి అందిస్తుండటం నిజం కాదా? అప్పట్లో ఇన్ని అక్రమాలు జరిగినా ప్రశ్నించలేదెందుకు? పైపెచ్చు ఇప్పుడు ఇళ్లవద్దకే రేషన్ సరఫరా చేస్తున్న అద్భుతమైన వ్యవస్థపై కూడా... ఇంటి ముంగిటకు రాకుండా వీధి మలుపుల్లో ఉంటున్నారనే విమర్శలా? మరీ ఇంతలా దిగజారిపోతున్నారెందుకు రామోజీరావు గారూ? సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా నెలకొన్న పండగ వాతావరణం బాబుకు ఎదురవబోయే ఓటమిని ముందే చూపిస్తుంటే తట్టుకోలేకపోతున్నారా?

ఇవీ... చంద్రబాబు లెక్కలు

టీడీపీ ప్రభుత్వం హయాంలో రాగులు, జొన్నలు, గోదుమ పిండి, ఉప్పు పంపిణీ చేయటం మొదలెట్టిందే చివర్లో. 'ఈనాడు' దృష్టిలో అది సూపర్. 1.39 కోట్ల కార్డుల్లో కేవలం 1 శాతానికే వీటినిచ్చినా... అబ్బో అంటున్నారు రామోజీ. ఎన్నికల భయంతో ప్రజలను మభ్యపెట్టేందుకు చివరి సంవత్సరంలో పంపిణీ చేశారీ చిరు ధాన్యాల్ని. గతంలో నెలకు 14 వేల టన్నుల గోధుమ పిండి అవసరం ఉంటే 900 టన్నులు తెచ్చి కొద్ది మందికే పంపిణీ చేశారు. ఇక్కడి ప్రజలకు బియ్యమే ఇష్టం. కార్మికులు, కూలి కుటుంబాలకు గోధుమ పిండితో రొట్టెలు చేసుకునే తీరిక ఉండదు. దీంతో గోధుమ

టీడీపీ హయాంలో			
సంవత్సరం	సబ్సిడీ భారం (రూ.కోట్లు)		
	బియ్యం	కందిపప్పు	పంచదార
2014-15	1760	-	53
2015-16	2778	3	22
2016-17	2530	11	50
మూడేళ్లలో	7068	14	125
ఐదేళ్లలో	12377	254	314

వైఎస్సార్‌సీపీ హయాంలో...			
సంవత్సరం	సబ్సిడీ భారం (రూ.కోట్లు)		
	బియ్యం	కందిపప్పు	పంచదార
2019-20	3289	473	186
2020-21	4191	372	241
2021-22	4899	505	114
మూడేళ్లలో	12379	1350	541

ఏది నిజం?

పిండి తీసుకోవడానికి ఇష్టపడకపోవడంతో నిల్వలు పాడైపోతున్న కారణంగా పంపిణీ నిలిచిపోయింది. రాగులు, జొన్నల విషయంలోనూ ఇదే జరిగింది. 2018-19 మధ్య 25,034 టన్నుల రాగులు, 15,635 టన్నుల జొన్నలను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి కార్డుదారులకు సరఫరా చేశారు. వీటిని బయటి మార్కెట్ నుంచి కొనటంతో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ నిలిపివేసింది. వీటి పరిమాణానికి సమానమైన బియ్యంపై సైతం సబ్సిడీ ఇవ్వలేదు. ఈ భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడింది. వీటిని తీసుకునేందుకెవరూ ఆసక్తి చూపించకపోవడంతో మధ్యలోనే ఆగిపోతే.. దీనిక్కూడా 'ఈనాడు' మసి పూస్తూనే ఉంది. 2020లో కేంద్రం 1838 టన్నుల గోధుమలు మాత్రమే సరఫరా చేసేది. వాటిని పిండిగా చేసి రేషన్ దుకాణాలకు చేర్చేందుకు ఖర్చు అధికంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఆటా' సరఫరాలను నిలిపివేసింది.

అన్నీ... ఎన్నికల ముందే

ఇక గత ప్రభుత్వం ఐదేళ్లలో 93 వేల టన్నుల కందిపప్పు, 3.16 లక్షల పంచదారను మాత్రమే పంపిణీ చేస్తే... వై.ఎస్.జగన్ ప్రభుత్వం మూడేళ్లలో 2.76 లక్షల టన్నుల కందిపప్పును, 2.14 లక్షల టన్నుల పంచదారను అందించింది. వాస్తవానికి టీడీపీ ప్రభుత్వం జూన్ 2014 సెప్టెంబర్ నుంచి 2015 జూన్ వరకు కందిపప్పు గురించి పట్టించుకోనే లేదు. నవంబర్ 2016 నుంచి ఫిబ్రవరి 2018 వరకు గిరిజన ప్రాంతాల్లో మాత్రమే కిలో రూ.40 చొప్పున పంపిణీ చేసింది. 2017-18లో రాష్ట్రంలో ఎక్కడా పంపిణీ చేయలేదు. ఎన్నికలు వస్తున్నాయనగా మార్చి 2018 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కార్డుదారులకు రెండు కిలోల కందిపప్పు పేరిట పంచి మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. పంచదార పరిస్థితీ అంతే. నెలకు సగటున 7724 టన్నులు అవసరం కాగా, కేంద్రం కేవలం 908 టన్నులకే రాయితీ ఇస్తోంది. మిగిలినదంతా రాష్ట్రం బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి... సబ్సిడీని భరిస్తోంది.

పైపెచ్చు బాబు హయాంలో ధరల్లో విపరీతమైన హెచ్చుతగ్గులుండేవి. ఆగస్టు 2015 నుంచి ఫిబ్రవరి 2017 వరకు కార్డుకు కిలో చొప్పున కందిపప్పు ఇచ్చి... ధర రూ.50 నుంచి రూ.120 మధ్యన విక్రయించారు. 2015 డిసెంబర్లో రూ.90కి విక్రయిస్తే... 2016 జూలై నుంచి 2017 ఫిబ్రవరి మధ్య రూ.120కి పెంచేశారు. 2018లో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.63 ఉన్నప్పుడు కేవలం రూ.23 రాయితీ ఇచ్చారు. ఇప్పుడు ఓపెన్ మార్కెట్‌లో రూ.115 ఉంటే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.48 సబ్సిడీ ఇస్తూ రూ.67కే అందిస్తోంది. మార్కెట్ ఒడిదుడుకులు, కోవిడ్ సంక్షోభం, ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసరాల రేట్లు అమాంతం పెరిగాయి. ఇదే నేరమైనట్లు... ధరలు పెంచేశారంటూ 'ఈనాడు' గుండెలు బాదుకోవటం చూస్తే చిత్రంగానే అనిపిస్తుంది.

ఇంటింటికీ రేషన్‌పైనా నిందలా?

'తోచీ తోచనమ్మ' తరహాలో రామోజీరావుకు దేనిపై విమర్శలు చేయాలో తెలియటం లేదన్నది ఆయన కథనాన్ని చూస్తే అర్థమవుతుంది. ఎందుకంటే ఇంటింటికీ రేషన్ అందించటంలో ఏపీని యావద్దేశం ఆదర్శంగా తీసుకుంటోంది.

తగ్గిన బియ్యం అక్రమ రవాణా..

బాబు హయాంలో రేషన్ బియ్యం తినే వారు చాలా తక్కువ. ముక్కిపోవటం... పురుగులు పట్టడం... రాళ్లు, నూకలు ఎక్కువగా ఉండటంతో పాటు గింజలు రంగు మారటం వంటివి అప్పట్లో అత్యంత సహజం. దీనిని కూడా బాబు బినామీలు తమ దళారులతో ప్రజల దగ్గర నుంచి పదీపరకా పెట్టి కొనేసేవారు. అక్రమంగా తరలించి ప్రజాధనాన్ని దోచేసేవారు. కానీ ఇప్పుడిస్తున్న సార్టెక్స్ బియ్యం నిరుపేదల కడుపు నింపుతోంది. అందుకే గతంలో కంటే రేషన్ బియ్యం అక్రమ రవాణా తగ్గింది. టీడీపీ ఐదేళ్ల పాలనలో 117.45 లక్షల టన్నులు బియ్యం సరఫరా చేస్తే ఈ మూడేళ్లలోనే జగన్ ప్రభుత్వం 85.27లక్షల టన్నులు పేదలకు ఇచ్చింది. బియ్యం సార్టెక్స్‌కే కిలోకు రూపాయి చొప్పున నెలకు రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నారు. బాబు ఐదేళ్ల కాలంలో బియ్యం సబ్సిడీపై చేసిన ఖర్చు రూ.12,377 కోట్లయితే జగన్ ప్రభుత్వం కిలో రూపాయి చొప్పున నాణ్యమైన బియ్యమిస్తూ ఈ మూడేళ్లలోనే రూ.12,379 కోట్లు సబ్సిడీకి వెచ్చించింది. పాతాళంలోకి పడిపోయిన బాబును ఎలాగైనా పైకి లాగాలని చూస్తున్న రామోజీకి ఇవేమీ కనిపించట్లేదు!

'ఈనాడు' మాత్రం పసలేని విమర్శలు చేస్తూనే ఉంది. బాబు హయాంలో రేషన్ సరుకుల కోసం యుద్ధాలే చేయాల్సి వచ్చేది. డిపోల్లో సర్వర్లు ఎప్పుడు పని చేస్తాయో తెలీక రోజంతా కూలి మానేసి క్యూలో పడిగాపులు పడేవారు. ఒక్కోసారి రేషన్ తీసుకోకుండానే ఇళ్లకెళ్లేవారు. వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి మరీ ఘోరం. కానీ ఈ నిజాలను ఇప్పటికీ 'ఈనాడు' చెప్పదు. పైపెచ్చు అప్పట్లో ఒకరోజు సెలవు పెట్టుకుని డిపోలకు వెళ్లేవారని, ఇపుడు ఇళ్ల వద్దకు ఎప్పుడొస్తాయో తెలియక తంటాలు పడుతున్నారని రాయటంలోనే ఆ పత్రిక ఎంత నీచానికి దిగజారుతున్నదో అర్థమవుతుంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయంతో... ఇపుడు 9,260 వాహనాల్లో లబ్ధిదారులకు ఇళ్లవద్దే రేషన్ అందుతోంది. ఈ మొబైల్ వాహనాలతో ఉపాధి పొందుతున్న ఆపరేటర్లకు నెలకు సుమారు రూ.25 కోట్లు ప్రభుత్వమే చెల్లిస్తోంది. కార్డుదారుల సమక్షంలో ఇంటి దగ్గరే సంచులు తెరచి, కచ్చితమైన తూకంతో ఇస్తుండటంతో కొలతలపై ఫిర్యాదుల్లేవు. వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయడంతో అక్రమ రవాణా లేదు. ఇప్పుడు రేషన్ తీసుకునేవారు 87 శాతం నుంచి 92 శాతానికి పెరిగారు. వాహనం వచ్చినప్పుడు ఇంట్లో సభ్యులు లేకపోతే సాయంత్రం సచివాలయం వద్ద రేషన్ వాహనాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా ఎండీయూ వాహనం నుంచి బియ్యం పొందే సౌలభ్యాన్ని కల్పించారు. ఇవన్నీ 'ఈనాడు' చెప్పని నిజాలే మరి!

19 నెలల ఉచిత బియ్యం

కరోనా విపత్కర పరిస్థితుల్లో ఏప్రిల్ 2020లో పేదల కోసం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) కింద కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పప్పు ధాన్యాల పంపిణీని ప్రారంభించింది. ఒక్కో లబ్ధిదారుడికి 5 కేజీల నాన్‌సార్టెక్స్ బియ్యాన్ని అందించింది. అయితే కేంద్రం కేవలం జాతీయ ఆహార భద్రత (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కార్డులకు మాత్రమే దీనిని వర్తింప జేసింది. రాష్ట్రంలో 1.45 కోట్ల కార్డులు ఉంటే.. 88 లక్షల ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డులకు మాత్రమే బియ్యం సరఫరా చేసింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఆరు దశల్లో అంటే 25 నెలల పాటు ఈ పథకం కొనసాగగా కేంద్రంతో సమానంగా ఐదు దశల వరకు 19 నెలల పాటు రాష్ట్ర కార్డులకు కూడా ప్రభుత్వం సొంత ఖర్చులతో బియ్యాన్ని అందించింది. ఇందు కోసం అదనంగా దాదాపు రూ.5700 కోట్ల వరకు ఖర్చు చేసింది. దీనికి తోడు పీఎంజీకేఏవై కింద శనగలు, కందిపప్పు పంపిణీకి రూ.1729 కోట్లు ఖర్చు చేసింది. ఆరవ విడతలో ప్రభుత్వం వద్ద సరిపడినన్ని నాన్ సార్టెక్స్ బియ్యం అందుబాటులో లేకపోవడంతో పంపిణీ ఆలస్యమై కేవలం చివరి రెండు నెలలు ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డులకు మాత్రమే.. ఎంపిక చేసిన జిల్లాల్లో పంపిణీ చేశారు. ఇకనైనా ఈ వాస్తవాలు రాయండి రామోజీరావు గారూ!!

అవును... చరిత్ర వక్రీకరణ మహానేరం!

స్పందన



కస్తూరి రాకా సుధాకర రావు

'చరిత్ర వక్రీకరణ మహానేరం' పేరిట సెప్టెంబర్ 22 నాటి మల్లెపల్లి లక్ష్మయ్య వ్యాసాన్ని చదివిన తరువాత వక్రీకరణ వాస్తవంగా ఎక్కడ, ఎలా మొదలౌతుందో అర్థమైంది. దేశ విభజనానంతరం సంస్థానాల విలీనం విషయంలో ఒక అబద్ధం ప్రచారమౌతోంది. సంస్థానాధీశులకు భారత్‌లో కలిసేందుకు, లేదా పాకిస్తాన్‌లో కలిసేందుకు, లేదా స్వతంత్రంగా ఉండేందుకు బ్రిటిషర్లు అధికారాన్ని కల్పించారనేది అబద్ధం. బ్రిటిష్ ప్రభుత్వం వారికి భారత్ లేదా పాకిస్తాన్‌లో విలీనమయ్యే అవకాశాన్ని మాత్రమే కల్పించింది. స్వతంత్రంగా ఉండేలా మూడో ఆప్షన్ లేదు. అలా ఉన్నట్టయితే దయతో తదనుగుణమైన బ్రిటిష్ ప్రభుత్వ డాక్యుమెంట్లను చూపించాలి (ఏ ఆధారమూ చూపని కొన్ని ఇంగ్లీషు పుస్తకాలను కోట్ చేస్తే సరిపోదని సవినయ మనవి.).

బ్రిటిషర్లు విలీనానికి మతంతో కూడా ముడిపెట్టలేదు. ప్రిన్సిపుల్ ఆఫ్ కంటిగ్యుటీ (సామీప్యతా సూత్రం) అంటే భారత్ సమీపంగా ఉంటే భారత్‌లో, పాకిస్తాన్ సమీపంలో ఉంటే పాకిస్తాన్‌లో ఉండేలా నిర్ణయం తీసుకోవచ్చు. దీని ప్రకారం హిందూ జనాభా అధికంగా ఉండి, హిందూ రాజు ఉన్న రాజస్తాన్‌లోని అమర్ కోట్ సంస్థానం పాకిస్తాన్‌లో చేరింది. కశ్మీర్ తప్ప మిగతా సంస్థానాధీశులు వారు కోరుకున్నా పాకిస్తాన్‌లో విలీనం కాలేరు. కాబట్టి భారతదేశం లోపల ఉండే హైదరాబాద్ స్వతంత్రంగా ఉండే ఆప్షన్ లేనే లేదన్నది స్పష్టం. మౌంట్ బాటన్ స్వయంగా ఈ విషయాన్ని నిజాంకి, ఆయన ప్రతినిధులైన వాల్టర్ మాంక్టన్, నవాబ్ ఆఫ్ ఛత్తారీలకు పలుసార్లు స్పష్టం చేశాడన్నది చారిత్రక వాస్తవం. నిజాం చేసుకున్న యథాతథస్థితి ఒప్పందం (స్టాండ్ స్టిల్ ఒప్పందం) కూడా స్వతంత్రంగా ఉండేందుకు కాదు. విలీనాన్ని ఒక సంవత్సరం జాప్యం చేసేందుకే.

పాకిస్తాన్ అన్న ఆలోచనను బ్రిటిషర్ల సహకారంతో 1930వ దశకంలో సృష్టించిన చౌధురీ రహమత్ అలీ భారత్‌లో మూడు ముస్లిందేశాలు ఉండాలని ప్రతిపాదించాడన్నది మరిచిపోరాదు. మొదటిది పాకిస్తాన్. రెండవది నేటి బంగ్లాదేశ్. దానిని బంగిస్తాన్ అన్నాడు. మూడవది ఉస్మానిస్తాన్. అంటే హైదరాబాద్. ఉస్మానిస్తాన్ ఆలోచన వెనుక దాగున్న మతోన్మాద సూత్రాన్ని మరిచిపోరాదు. పాశ్చాత్య కూటమిలో చేరకూడదన్న భారత నేతల నిబద్ధతాపూర్వకమైన నిర్ణయం వల్లే బ్రిటిషర్లు భారత్‌ను దిగ్బంధనం చేసేందుకు పశ్చిమాన పాకిస్తాన్, తూర్పున తూర్పు పాకిస్తాన్ (తరువాత బంగ్లాదేశ్), ఉత్తరాన ముస్లిం జనాధిక్య జమ్మూ కశ్మీర్ సంస్థానం, దక్షిణాన ఉస్మానిస్తాన్ ఏర్పాటయ్యేలా ప్రయత్నించారు. హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉండాలన్న నిజాం కుట్రలకు ఫ్రాన్స్, అమెరికా, కొలంబియా, కెనడా, సిరియా, బెల్జియం, అర్జెంటీనా వంటి పాశ్చాత్య కూటమి దేశాలు అందుకే సమర్థించాయి. రష్యా, చైనా, యుక్రేన్ వంటి కమ్యూనిస్టు దేశాలు భారత అలీన విధానాన్ని సమర్థించి, ఈ సామ్రాజ్యవాద యత్నానికి పురిట్లో సంధికొట్టాయి.

లక్ష్మయ్య సర్వసాధారణ కమ్యూనిస్టులందరిలాగానే జన్నారెడ్డి ప్రతాపరెడ్డి, విసునూరు రామచంద్రారెడ్డిలను ప్రస్తావించారు. కానీ జటప్రోలు, రెంటచింతల, గద్వాల, కొల్లాపూర్, వనపర్తి, పాల్వంచ, సంస్థాన్ నారాయణపూర్ వంటి ఉప సంస్థానాల్లో విసునూరు, మానుకోటల్లో లాగా ఎందుకు తిరుగుబాటు రాలేదో ప్రస్తావించలేదు. ఆదిలా



బాద్, నిజామాబాద్, జహీరాబాద్, మహబూబ్ నగర్ వంటి తెలంగాణ జిల్లాల్లో, ఆనాడు హైదరాబాద్ సంస్థానంలో అంతర్భాగంగా ఉన్న మరాఠ్వాడా ప్రాంతాలైన బీడ్, పర్భనీ, నాందేడ్, లాతూర్, ఉస్మానాబాద్‌లలో, కళ్యాణ కర్ణాటక లోని బీదర్, రాయచూర్, గుల్బర్గాలలో సంస్థానాధీశులు లేరా? కొంత నల్గొండ, కొంత వరంగల్, కాసింత రంగారెడ్డి జిల్లాకి మాత్రమే ప్రధానంగా పరిమితమైన కమ్యూనిస్టుల పోరాటం ఈ మరాఠ్వాడా, హైదరాబాద్ కర్ణాటక ప్రాంతాల్లో ఎందుకు విస్తరించలేదు?

మల్లెపల్లి లక్ష్మయ్య కన్వీనియంట్‌గా ప్రస్తావించని మరో విషయం ఉంది. ఘనత వహించిన నిజాం ప్రభువు 1943లో కమ్యూనిస్టులపై నిషేధాన్ని ఎందుకు ఎత్తివేశారు? దాశరథి రంగాచార్య తన 'జీవన యానం'లో, వందేమాతరం రామచంద్రరావు తన 'హైదరాబాద్‌పై పోలీసు చర్య'లో సెప్టెంబర్ 17 తరువాత రజాకార్ల ఆయుధాలన్నీ కమ్యూనిస్టుల చేతికి చేరాయని రాశారు. కమ్యూనిస్టులు దీనిని ఎందుకు ఖండించరు? సెప్టెంబర్ 17, 1948 తరువాత 1951 వరకూ కమ్యూనిస్టులు ఎవరిపై సాయుధ పోరాటం చేశారు? లేని నిజాంపైనా? ఉన్న భారత ప్రభుత్వం పైనా? భారత సేనలు అన్న పదానికి బదులు 'యూనియన్ సేనలు' అనే పదాన్ని ఉపయోగించి భారత వ్యతిరేక పోరాటానికి ఎందుకు రంగులద్దుతున్నారు?

రావి నారాయణ రెడ్డి ఈ సాయుధ పోరాటాన్ని వ్యతిరేకించారు. ప్రజలు భారత ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నా దానిపై పోరాటం చేయడం సరైనది కాదని చెప్పారు. సుందరయ్య-బసవపున్నయ్య-చండ్ర రాజేశ్వర త్రయం దానిని తోసిపుచ్చారు. ఈ మొత్తం ఉదంతాన్ని చాపకిందకి తోసి, సగం చరిత్ర చెప్పడానికి కారణమేమిటి? హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉండాలన్నది కమ్యూనిస్టుల లక్ష్యం. 1948-1951 వరకూ భారత్‌పై కమ్యూనిస్టులు పోరాడి, భారత ప్రభుత్వం పంపిన రాయబారి ద్వారకానాథ్ కాచ్రూను కలవడానికి నిరాకరించి, ఆ తరువాత 1952లో ఎలాంటి గ్యారంటీలూ పొందకుండానే, ఏమీ సాధించకుండానే మూడేళ్ల రక్తసిక్త పోరాటం ఆపి, ఎన్నికల్లో పాల్గొని తగుదునమ్మా అంటూ ఎంపీలు అయ్యారు.

మరో అవాస్తవం సుందర్ లాల్ కమిటీ గురించి. దానిని భారత ప్రభుత్వం కానీ, కాంగ్రెస్ పార్టీ కానీ, నిజాం ప్రభువు కానీ నియమించలేదు. అది నెహ్రూ వ్యక్తిగతంగా పంపిన సుహృద్భావ ప్రతినిధి బృందం. పండిత్ సుందర్ లాల్, కాజీ మహ్మద్ అబ్దుల్ గఫార్‌లతో కూడిన ఈ బృందం ముస్లింలను కలిసి, భారత ప్రభుత్వం వారిని ఇబ్బంది పెట్టబోదని నమ్మకం కలిగించింది.

వాస్తవానికి హైదరాబాద్ సంస్థాన చరిత్రను మూడు వేర్వేరు ముక్కలుగా చదువుతున్నాం. కర్ణాటకలోని మూడు జిల్లాలు, మరాఠ్వాడాలోని జిల్లాల చరిత్రను తెలంగాణ చరిత్రతో కలిపి చదివితేనే సమగ్రత వస్తుంది. లేని పక్షంలో గుడ్డివాళ్లు ఏనుగుని వర్ణించినట్టు చదవడం జరుగుతుంది. అలా చేసినంత కాలమూ రెండు మూడు జిల్లాల చరిత్రనే మొత్తం 82 వేల చ.కి.మీ. వైశాల్యమున్న, కోటికి పైగా జనాభా ఉన్న, 17 జిల్లాలున్న సువిస్తృత సంస్థాన చరిత్రగా లక్ష్మయ్య గారు భ్రమించినట్టు భ్రమించడం జరుగుతుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మార్పును ఆహ్వానించాలి

ప్రకృతి నిరంతరం పరిణామశీలం. మార్పుకి లోనవుతూనే ఉంటుంది. జగము అంటేనే కదులుతూ ఉండేది అని అర్థం కదా! ప్రకృతిలో భాగమైన మనిషి కూడా మారటం సహజం. మారకపోతే చైతన్యాన్ని కోల్పోయి శిలాజంగా అయిపోవటం తప్పదు. మారని డైనోసారస్ వంటి జాతులు కాలగర్భంలో కలిసిపోయాయి. కనుక మార్పు అన్న దానిని సహజంగా ఆమోదించటం సుఖమైన పద్ధతి. అయితే ఆ మార్పు వల్ల ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎదుగుతున్నామా? దిగజారి అధఃపాతాళానికి వెడుతున్నామా? అన్నది మన చేతుల్లోనే ఉంది. ఉదాహరణకి ఈ మధ్య అందరికీ ఇల్లు వదలి బయటికి వచ్చే అవకాశం లేకపోయింది. కొందరు ఆ మార్పు తట్టుకోలేకపోయారు. చికాకుపడ్డారు, శారీరక, మానసిక ఆరోగ్యాలు పాడు చేసుకున్నారు. మరికొందరు ఎన్నాళ్లుగానో తీరిక లేక వాయిదా వేసిన పనులన్నీ పూర్తి చేసుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరచుకున్నారు.

జ్యోతిర్మయం

ఎక్కువ మంది సర్దుకోలేక పోయే విషయాలు రెండు. ఒకటి తమకి వయసు పైబడుతోంది అనే అంశం. రెండోది ఉద్యోగ విరమణ. రుతువులు మారినప్పుడు వాటికి అనుగుణంగా ఆహార వ్యవహారాలని మనుషులే కాదు, జంతువులు కూడా సర్దుబాటు చేసుకోవటం గమనించవచ్చు. వయసు పెరుగుతున్న కొద్దీ అనుభవం ఎక్కువ అవుతుంది. ఆపలేని ఆ క్రమపరిణామాన్ని ఆమోదించి ఆస్వాదించటం సంతోషాన్ని ఇస్తుంది. కొంతమంది వృద్ధాప్యాన్ని ఒక అవకాశంగా తీసుకుని సుఖపడతారు. నెఱసిన జుట్టు బస్సుల్లో సీటుని ఇప్పిస్తుంది. మందలిస్తే పెద్దమనిషిలే అని ఊరుకుంటారు. ఇష్టం ఉన్నా, లేకపోయినా ప్రతి చోట ప్రాధాన్యం ఇస్తారు. వయసు దాచుకోటం ఎందుకు? ఉద్యోగ విరమణ ఎప్పుడు అనేది చేరిన రోజు నుండి తెలిసినదే! దాన్ని ఆనందంగా అనుభవిస్తే సరిపోతుంది. ఉరుకులు పరుగులు ఉండవు. దిగులు పడితే కుంగిపోవటం జరుగుతుంది. మార్పుని అనుకూలంగా మలచుకోవటం మన చేతుల్లోనే, చేతల్లోనే ఉంది.

– డాక్టర్ ఎస్. అనంతలక్ష్మి

మనవాళ్లే సంసార ప్రియులు!



దేశ వ్యాప్తంగా జనాభాలో 45.2 శాతం మంది పెళ్లయిన వారు

అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 52.4 శాతం..

సాక్షి, అమరావతి : దేశంలోని మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వైవాహిక జీవితం, బంధాలు, బంధుత్వాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటోంది. ఇందుకు నిదర్శనం.. పెళ్లయిన వారు ఎక్కువగా ఉన్న రాష్ట్రం దేశవ్యాప్తంగా ఏపీ కావడమే. దేశంలో వివాహ వయస్సు దాటిన వారిలో పెళ్లయిన వారు 45.2% ఉండగా.. ఏపీలోనే అత్యధికంగా 52.4 % మంది ఉండగా, పెళ్లి కాని వారు మాత్రం 42.9 % ఉన్నారు. ఈ వివరాలను ఇటీవల కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన శ్యాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) స్టాటిస్టికల్ రిపోర్ట్–2020 తెలియజేస్తోంది. మరోవైపు దేశ వ్యాప్తంగా పెళ్లయిన వారు 45.2 శాతం, పెళ్లి కాని వారు 51.6, పెళ్లయి కూడా వివిధ కారణాలతో ఒంటరిగా ఉంటున్న వారు 3.2 % మంది ఉన్నారు. తెలంగాణలో పెళ్లయిన వారు 48.6, పెళ్లి కాని వారు 47.4 శాతం ఉన్నారు.

పెళ్లి కాని ప్రసాద్‌ల నెలవు బిహార్!

పెళ్లి కాని వారు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా బిహార్ నిలిచింది. ఈ రాష్ట్రంలో పెళ్లికాని వారు 59.3, పెళ్లయిన వారు 39.1, విడాకులు తీసుకోవడం, భాగస్వామి మరణించడం, ఇతర కారణాలతో ఒంటరిగా ఉన్న వారు 1.6 %గా ఉన్నారు. బిహార్ తర్వాత అత్యధికంగా పెళ్లి కాని వారు ఉత్తరప్రదేశ్ (57.2 %)లో ఉన్నారు. దేశంతో పాటు, రాష్ట్రంలోను పెళ్లి కాని వారిలో ఎక్కువగా పురుషులే ఉంటున్నారు. దేశంలో పెళ్లి కాని పురుషులు 56.7, స్త్రీలు 46.2 %గా ఉన్నారు. రాష్ట్రంలో పురుషులు 48.3, స్త్రీలు 37.5 % మంది ఉన్నారు. దేశంలోనే అత్యధికంగా బిహార్‌లో పెళ్లికాని పురుషులు 63.5 శాతం ఉన్నారు. అత్యధికంగా పెళ్లి కాని స్త్రీలు ఉన్న రాష్ట్రంగా కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ నిలిచింది. ఇక్కడ పెళ్లి కాని స్త్రీలు 54.5 % ఉన్నారు. తెలంగాణలో పెళ్లి కాని వారు 47.4 % ఉండగా.. వీరిలో పురుషుల వాటా 53.1 %గా ఉంది.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

ప్రైవేటు జూనియర్ కళాశాలలకు ఇంటర్మీడియెట్ బోర్డు హెచ్చరిక

సాక్షి, అమరావతి: దసరా సెలవుల్లో ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహించరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబు హెచ్చరించారు. ఈ నెల 9వ తేదీ వరకు దసరా సెలవులుంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని యాజమాన్యాలకు ఇంతకు ముందే అకడమిక్ క్యాలెండర్ ప్రకటించామని తెలిపారు. ఈ అంశంపై రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

రైళ్ల సమాచారం మరింత పక్కాగా..

- అందుబాటులోకి ఆర్టీఐఎస్
- ఇస్రోతో కలసి రూపొందించిన రైల్వే శాఖ

సాక్షి, అమరావతి: ప్రయాణిస్తోన్న రైళ్ల సమాచారం మరింత పక్కాగా తెలుసుకునేందుకు ఆధునిక సమాచార వ్యవస్థను రైల్వే శాఖ ప్రవేశపెడుతోంది. అందుకోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)తో కలసి 'రియల్ టైమ్ ట్రైన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఆర్‌టీఐఎస్)'ను రూపొందించింది. దాన్ని రైల్వే కంట్రోల్ ఆఫీస్ అప్లికేషన్ (సీవోఏ)తో అనుసంధానించింది. ప్రస్తుతం జీపీఎస్ విధానం ద్వారా ప్రయాణిస్తోన్న రైళ్ల సమాచారాన్ని రైల్వే శాఖ తెలుసుకుంటోంది. జీపీఎస్ విధానంలోని కొన్ని లోపాలను అధిగమించడానికి ఇస్రో సహకారంతో రైల్వే శాఖ ఆర్‌టీఐఎస్‌ను రూపొందించింది. ఈ ఆర్‌టీఐఎస్‌ను దేశంలో దూర ప్రాంతాలకు ప్రయాణించే అన్ని రైళ్లలో దశల వారీగా ప్రవేశపెట్టనుంది. తొలి దశలో దేశంలో 21 రైల్వే ఎలక్ట్రిక్ లోకో షెడ్‌ల పరిధిలోని 2,000 రైళ్లలో ఆర్‌టీఐఎస్‌ను ప్రవేశపెట్టింది.

● తెలంగాణ

హైదరాబాద్‌లో భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- దసరా రోజున ఉత్సవాలు, ఊరేగింపులపై గ్రెనేడ్ దాడులకు స్కెచ్
- నగరానికి చెందిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతల హత్యలకూ పన్నాగం
- ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన సిట్ పోలీసులు
- 4 గ్రెనేడ్లు, రూ. 5.41 లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ రోజున హైదరాబాద్‌లో భారీ విధ్వంసానికి పాకిస్తాన్ కేంద్రంగా జరిగిన ఉగ్ర కుట్రను కేంద్ర నిఘా వర్గాల సమాచారంతో నగర పోలీసులు భగ్నం చేశారు. లష్కరే తోయిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది ఫర్హాతుల్లా ఘోరీ ఆదేశాలతో నగరంలో దసరా ఉత్సవాలు, ఊరేగింపుల్లో విధ్వంసాలు సృష్టించడంతోపాటు నగరానికి చెందిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతల్ని హతమార్చాలనుకున్న ముగ్గురు ముష్కరులను ఆదివారం అరెస్టు చేశారు. ఫర్హాతుల్లా ఘోరీ ప్రధాన అనుచరుడైన ముసారాంబాగ్‌వాసి మహ్మద్ అబ్దుల్ జాహెద్, ఐసిస్ ఉగ్రవాది, హుమాయున్‌నగర్‌లోని రాయల్ కాలనీకి చెందిన మాజ్ హసన్ ఫారూఖ్, సైదాబాద్ పరిధిలోని అక్బర్‌బాగ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సమీదుద్దీన్ అలియాస్ అబ్దుల్ సమీలను అరెస్టు చేశారు. వారి నుంచి 4 హ్యాండ్ గ్రెనేడ్లు, రూ. 5.41 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై అసాంఘిక కార్యకలాపాల నిరోధక చట్టంలోని 18, 18 (బీ), 20 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

ప్రధాన అనుచరుడి ద్వారా కుట్ర...

అబ్దుల్ జాహెద్ 2004లో ఘోరీ ఆదేశాలతో బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి హత్యకు జరిగిన కుట్రలో పాలుపంచుకున్నాడు. అప్పట్లో పేలుడు పదార్థాలను దాచి ఉంచిన కేసులో అరెస్టయి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అలాగే 2005 అక్టోబర్ 12న సరిగ్గా దసరా రోజునే హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన మానవబాంబు (బంగ్లాదేశీ డాలిన్) దాడి కేసులోనూ అరెస్టయి 2017 వరకు జైల్లో ఉన్నాడు. అయితే ఈ రెండు కేసులూ సరైన సాక్ష్యాధారాలు లేక కోర్టులో వీగిపోవడంతో విడుదలైన జాహెద్.. సోషల్ మీడియా యాప్స్ ద్వారా ఘోరీతో నిరంతరం టచ్‌లోనే ఉన్నాడు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతోపాటు నగరంలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో మరోసారి హైదరాబాద్‌లో ఉగ్రదాడులు జరపాలన్న లష్కరే తోయిబా ఆదేశాలతో ఘోరీ జాహెద్‌ను రంగంలోకి దించాడు. ఈ ఆపరేషన్‌కు అవసరమైన నగదును ఘోరీ హవాలా రూపంలో పంపాడు. పాక్‌లో తయారైన నాలుగు హ్యాండ్ గ్రెనేడ్స్‌ను తన నెట్‌వర్క్ సాయంతో హైదరాబాద్‌కు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ 6 చోట్ల రెక్కీలు కూడా చేయించాడు.

క్లుప్తంగా...

రూ.1,476 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ: విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న నారింజ పండ్ల ముసుగులో అక్రమంగా తరలిస్తున్న మాదక ద్రవ్యాలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు శనివారం ముంబైలో స్వాధీనం చేసుకున్నారు. 198 కిలోల స్ఫటిక మెథాంఫెటామైన్, 9 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నామని, ఈ డ్రగ్స్ విలువ రూ.1,476 కోట్లు ఉంటుందని తెలిపారు. ముంబైలోని వసీ ప్రాంతంలో అనుమానంతో వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో నారింజ పండ్ల బాక్సుల్లో భద్రపర్చిన మాదక ద్రవ్యాలు లభ్యమయ్యాయని ప్రకటించారు. అక్రమార్కులు దక్షిణాఫ్రికా నుంచి నారింజ పండ్లను దిగుమతి చేసుకున్నట్లు కస్టమ్స్ అనుమతులు పొందారని అధికారులు గుర్తించారు. డ్రగ్స్‌ను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే దానిపై డీఆర్ఐ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో డీకే సోదరులకు ఈడీ సమన్లు

బనశంకరి: నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, ఆయన సోదరుడు, బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆదివారం సమన్లు జారీ చేసింది. ఈ నెల 7వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. నేషనల్ హెరాల్డ్ కేసులో విచారణకు పిలిచారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను కొనుగోలు చేసిన యంగ్ ఇండియా ట్రస్ట్‌కు డీకే సోదరులు చెక్ ఇచ్చినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈడీ సమన్లపై శివకుమార్ స్పందించారు. ఈడీకి తనపై చాలా ప్రేమ ఉందని, అందుకే పదేపదే సమన్లు పంపిస్తోందని అన్నారు. ఈ నెల 7వ తేదీన రాహుల్ గాంధీతో కలిసి భారత్ జోడో యాత్రలో తాను తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉందని, విచారణకు హాజరు కావడానికి మరో గడువు ఇవ్వాలని కోరుతూ ఈడీకి మెయిల్ చేశామని చెప్పారు.

మూసేవాలా హత్య కేసులో నిందితుడు పరార్

చండీగఢ్: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో నిందితుడు దీపక్ టినూ పంజాబ్ పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకున్నాడు. శనివారం రాత్రి పరారైన టినూ కోసం రాజస్తాన్, హరియాణాల్లో గాలింపు చేపట్టినట్లు మన్సా జిల్లా పోలీసులు చెప్పారు. గోయింద్‌వాల్ సాహిబ్ జైలులో ఉన్న టినూను మరో కేసులో వారెంట్‌పై తీసుకురాగా తప్పించుకుపోయాడన్నారు. ఘటనకు బాధ్యుడైన ఇన్‌చార్జిని అధికారులు డిస్మిస్ చేయడంతోపాటు అరెస్ట్ చేశారు. మే 29వ తేదీన మూసేవాలాను కొందరు దుండగులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టయిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయికి టినూ సన్నిహితుడు. హింసాత్మక చర్యలకు పాల్పడిన టినూపై గతంలో పలు కేసులున్నాయి. 2017లోనూ ఇతడు హరియాణా పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకుని, కొన్ని నెలల తర్వాత బెంగళూరులో దొరికిపోయాడు.

కశ్మీర్‌లో ఉగ్ర దాడి.. పోలీసు వీరమరణం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఆదివారం ఉగ్రవాదులు జరిపిన దాడిలో పోలీసు అధికారి ఒకరు నేలకొరగగా, సీఆర్‌పీఎఫ్ జవాను గాయపడ్డారు. ఈ ఘటన పుల్వామా జిల్లా పింగ్లానా ప్రాంతంలో తనిఖీల సమయంలో చోటుచేసుకుంది. వీరమరణం పొందిన పోలీసును స్పెషల్ పోలీస్ విభాగానికి చెందిన జావిద్ అహ్మద్ దార్‌గా గుర్తించారు. క్షతగాత్రుడైన జవానును ఆస్పత్రికి తరలించారు. ఘటన నేపథ్యంలో అదనపు బలగాలను రంగంలోకి దించి, పారిపోయిన ఉగ్రవాదుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఉగ్రదాడిని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, రాజకీయ పార్టీలు ఖండించాయి. మరోఘటన.. షోపియాన్ జిల్లా బస్కుచాన్ ప్రాంతంలో చేపట్టిన కార్డన్ సెర్చ్ బృందంపై ఉగ్రవాదులు కాల్పులకు దిగారు. ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాకు చెందిన షోపియాన్ జిల్లా నౌపోరా వాసి అహ్మద్ భట్ హతమయ్యాడు.

గుజరాత్ మళ్లీ బీజేపీదే

అహ్మదాబాద్: గుజరాత్‌లో అధికార పీఠాన్ని మళ్లీ బీజేపీ దక్కించుకోనుందని ఏబీపీ న్యూస్–సీ ఓటర్ ఒపీనియన్ పోల్ ఆదివారం వెల్లడించింది. గుజరాత్‌లో మొత్తం 182 అసెంబ్లీ స్థానాలుండగా, ఈ సంవత్సరం ఆఖర్లో జరిగే ఎన్నికల్లో బీజేపీకి 135–143 సీట్లు వస్తాయని ఒపీనియన్ పోల్ తెలియజేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ గణనీయమైన ఓట్లు సాధించే అవకాశం ఉన్నప్పటికీ ఒకటి నుంచి రెండు సీట్లకే పరిమితం అవుతుందని పేర్కొంది. ప్రతిపక్ష కాంగ్రెస్ 36–44 స్థానాలు గెలుచుకోనుందని వివరించింది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ పట్ల ఓటర్లు సానుకూలత వ్యక్తం చేస్తున్నారని, ఆయన మరోసారి సీఎం కావాలని కోరుకుంటున్నారని ఒపీనియన్ పోల్‌లో తేలింది.

అరవింద్ కేజ్రీవాల్ పైకి నీళ్ల సీసా విసిరివేత

రాజ్‌కోట్: ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై గుర్తుతెలియని వ్యక్తి ప్లాస్టిక్ వాటర్ బాటిల్ విసిరాడు. అది ఆయనకు తగలకుండా, తలపై నుంచి వెళ్లి ముందుపడింది. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. నగరంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా గర్బా వేడుకలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. నడుస్తూ అభివాదం చేస్తుండగా, ఇంతలో వెనుక నుంచి ప్లాస్టిక్ నీళ్ల సీసా దూసుకొచ్చింది. అది కేజ్రీవాల్ తల పైభాగం నుంచి ముందుకు వెళ్లింది. ఈ దృశ్యాలు సీసీ టీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ఆప్ మీడియా కో–ఆర్డినేటర్ తెలిపారు.

మైదానంలో విషాద క్రీడ

ఇండోనేషియా స్టేడియంలో తొక్కిసలాట
- ఇద్దరు పోలీసులు సహా 125 మంది బలి
- మరో 11 మంది పరిస్థితి విషమం
- స్టేడియంలో ఓడిన జట్టు మద్దతుదారుల వీరంగం
- భాష్పవాయువు ప్రయోగించిన పోలీసులు
- తప్పించుకొనే క్రమంలో అభిమానుల మధ్య తొక్కిసలాట


మలాంగ్ ఆస్పత్రిలో మృతదేహాలు


తొక్కిసలాట సందర్భంగా టియర్‌గ్యాస్ ప్రయోగిస్తున్న పోలీసులు

మలాంగ్(ఇండోనేషియా): ప్రపంచ క్రీడా చరిత్రలో మరో దారుణ సంఘటన చోటుచేసుకుంది. సాకర్ స్టేడియంలో తొక్కిసలాట జరిగి ఇద్దరు పోలీసులు సహా 125 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఓడిపోయిన జట్టు మద్దతుదారులు క్రీడాస్ఫూర్తిని మర్చిపోయి ఆగ్రహావేశాలతో ఘర్షణకు దిగడం రణరంగానికి దారితీసింది. ఇండోనేషియాలో తూర్పు జావా ప్రావిన్స్‌లోని మలాంగ్ సిటీలో కంజురుహాన్ స్టేడియంలో శనివారం ఈ దారుణం జరిగింది. ఇప్పటిదాకా 125 మంది మృత్యువాత పడ్డారు. తొక్కిసలాటలో మరో 100 మందికిపైగా ప్రేక్షకులు గాయాలపాలై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో 11 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

భాష్పవాయువు ప్రయోగంతో అలజడి
కంజురుహాన్ స్టేడియంలో తూర్పు జావాకు చెందిన అరెమా ఎఫ్ఎస్ జట్టు, సురబయాకు చెందిన పెర్సిబయా జట్టుకు మధ్య శనివారం సాయంత్రం ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహించారు. 32,000 మంది ప్రేక్షకులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. వీరంతా అతిథ్య జట్టు అరెమా ఎఫ్ఎస్ మద్దతుదారులే. పెర్సిబయా జట్టు చేతిలో అరెమా జట్టు 3–2 తేడాలో ఓటమి పాలయ్యింది. ఈ పరాజయాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. క్రీడాకారులపై, సాకర్ అధికారులపై నీళ్ల సీసాలు, చేతిలో ఉన్న వస్తువులు విసిరారు. దాదాపు 3,000 మంది బారికేడ్లు దాటుకొని ప్రధాన మైదానంలోకి ప్రవేశించారు. అరెమా జట్టు మేనేజ్‌మెంట్‌తో ఘర్షణకు దిగారు. సొంత గడ్డపై 23 ఏళ్లుగా విజయాలు సాధిస్తున్న అరెమా టీమ్ ఇప్పుడెందుకు ఓడిపోయిందో చెప్పాలంటూ నిలదీశారు. అరుపులు కేకలతో హోరెత్తించారు. మరికొందరు స్టేడియం బయటకువెళ్లి, అక్కడున్న పోలీసు వాహనాలను ధ్వంసం చేసి, నిప్పుపెట్టారు. పోలీసులపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. పరిస్థితి చెయ్యి దాటిపోతుండడంతో అల్లరి మూకను చెదరగొట్టడానికి పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. భాష్పవాయువు గోళాలు స్టేడియంలోకి సైతం దూసుకెళ్లాయి. స్టాండ్స్‌లో కూర్చున్న అభిమానులు భయాందోళనకు గురయ్యారు. బాష్పవాయువును తప్పించుకోవడానికి అందరూ ఒక్కసారిగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో తొక్కిసలాట మొదలయ్యింది. ఒకరిపై ఒకరు పడిపోవడంతో ఊపిరాడని పరిస్థితి. స్టేడియంలోనే 34 మంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. ఆసుపత్రులకు తరలిస్తుండగా కొందరు, చికిత్స పొందుతూ మరికొందరు మృతిచెందారు. మృతుల్లో చిన్నపిల్లలు కూడా ఉన్నారని అధికారులు చెప్పారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఘటనతో ఇండోనేషియా సాకర్ అసోసియేషన్ ప్రీమియర్ సాకర్ లీగ్ లిగా–1ను నిరవధికంగా వాయిదా వేశారు.

ఇదే చివరి విషాదం కావాలి: జోకో విడోడో
ఫుట్‌బాల్ స్టేడియంలో తొక్కిసలాట జరగడం, 125 మంది మరణించడం పట్ల ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం టీవీలో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సంఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఇదే చివరి క్రీడా విషాదం కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు జరగకూడదని కోరుకుంటున్నట్లు వివరించారు. ప్రజలంతా క్రీడాస్ఫూర్తిని పాటించాలని, మానవత్వం, సోదర భావాన్ని కలిగి ఉండాలని కోరారు. మొత్తం ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని కీడ్రలు, యువజన శాఖ మంత్రికి, సంబంధిత అధికారులకు జోకో విడోడో ఆదేశాలు జారీ చేశారు.

ఇండోనేషియా సాకర్ ప్రతిష్టకు మచ్చ
జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సాకర్ మ్యాచ్‌లకు తాము సన్నద్ధం అవుతున్న తరుణంలో స్టేడియంలో అభిమానులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఇండోనేషియా క్రీడలు, యువజన శాఖ మంత్రి జైనుదిన్ అమాలీ చెప్పారు. ఈ ఘటన తమ దేశ సాకర్ క్రీడా ప్రతిష్టను మసకబార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది మే 20 నుంచి జూన్ 11 వరకు జరిగే ఫీఫా యూ–20 ప్రపంచ కప్‌నకు ఇండోనేషియా అతిథ్యం ఇవ్వబోతోంది. ఇందు కోసం ఏర్పాట్లు సైతం ప్రారంభించింది. నిజానికి ప్రపంచ సాకర్ క్రీడా సమాఖ్య 'ఫిఫా' నిబంధనల ప్రకారం స్టేడియంలో బాష్పవాయువు ప్రయోగించకూడదు. దేశీయంగా జరిగే క్రీడలపై ఫిఫా నియంత్రణ లేకపోవడం కొన్నిసార్లు పరిస్థితి అదుపు తప్పుతోంది.

ఆట చూసేందుకు వచ్చి అనంత లోకాలకు..

ప్రపంచ క్రీడాలో చరిత్రలో ఇప్పటిదాకా ఎన్నో విషాదాలు చోటుచేసుకున్నాయి. మైదానాలు రక్తసిక్తమయ్యాయి. ఆట చూసి ఆనందించేందుకు వచ్చిన అభిమానులు విగతజీవులయ్యారు. ఎంతోమంది క్షతగాత్రులుగా మారారు. విషాదాలు కొన్ని..

1979 డిసెంబర్ 3: అమెరికాలోని సిన్సినాటీలో రివర్‌ఫ్రంట్ మైదానంలో తొక్కిసలాట జరిగింది. 11 మంది మృతి చెందారు.

1980 జనవరి 20: కొలంబియాలోని సిన్సిలెజె పట్టణంలో బుల్‌ఫైట్ కోసం తాత్కాలికంగా కర్రలతో నిర్మించిన నాలుగు అంతస్తుల స్టేడియం కూలిపోయింది. ఈ ఘటనలో 200 మంది బలయ్యారు.

1988 మార్చి 13: నేపాల్‌లోని ఖాట్మాండు స్టేడియంలో సాకర్ మ్యాచ్ జరుగుతుండగా అకస్మాత్తుగా వడగళ్ల వాన మొదలయ్యింది. స్టేడియంలో తొక్కిసలాట జరిగి 93 మంది చనిపోయారు.

1989 ఏప్రిల్ 15: ఇంగ్లాండ్‌లోని షెఫీల్డ్‌లో హిల్స్‌బరో స్టేడియంలో అభిమానుల నడుమ ఘర్షణ జరిగింది. 97 మంది మరణించారు.

1996 అక్టోబర్ 16: గ్వాటిమాలాలోని గ్వాటిమాలా సిటీలో సాకర్ ప్రపంచ కప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో గ్వాటిమాలా, కోస్టారికా అభిమానుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. 84 మంది విగత జీవులుగా మారారు.

2001 మే 9: ఘనా రాజధాని అక్రాలో స్టేడియంలో ఘర్షణ, అనంతరం తొక్కిసలాట. 120 మందికిపైగా ప్రేక్షకులు బలయ్యారు.

బహిరంగ చర్చకు సిద్ధం

- కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థుల మధ్య సుహృద్భావ పోటీకి, పార్టీకి ఇది ఎంతో మంచిది
- శశిథరూర్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఘన చరిత గల కాంగ్రెస్ పార్టీకి తదుపరి అధ్యక్షులు ఎవరనే అంశంలో ఇరు అభ్యర్థుల మధ్య ప్రజాక్షేత్రంలో బహిరంగ చర్చాసమరానికి తాను సిద్ధమని కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల అభ్యర్థి శశిథరూర్ తన మనసులో మాట బయటపెట్టారు. ఇటీవల తీవ్ర ఉత్కంఠ రేపిన బ్రిటన్ కన్జర్వేటివ్ పార్టీ సారథి, దేశ ప్రధాని రేసులో రిషి సునాక్, లిజ్ ట్రస్ నేరుగా పలుమార్లు చర్చావేదికలపై బలాబలాలు ప్రదర్శించిన నేపథ్యంలో అదే మాదిరి పోటీని థరూర్ కోరుకోవడం విశేషం. ఆదివారం థరూర్ పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖాముఖిలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.. ' సమర్థవంతమైన నాయకుడిగా నన్ను నేను ఎప్పుడో రుజువు చేసుకున్నా. దాదాపు మూడు దశాబ్దాలు ఐక్యరాజ్యసమితిలో కీలకమైన పలు పదవుల్లో బాధ్యతలు నెరవేర్చా. భారత్‌లో రాజకీయ ప్రస్థానానికొస్తే.. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌కు వ్యవస్థాపక అధ్యక్షుడిని. మొదలుపెట్టిన ఐదేళ్లలోనే 20 రాష్ట్రాల్లో పదివేల మందికిపైగా ఇందులో క్రియాశీలక సభ్యులయ్యారు. అధ్యక్ష ఎన్నికల పోలింగ్‌కు కేవలం రెండున్నర వారాల వ్యవధి ఉంది. ఇంత తక్కువ టైమ్‌లో అందరు 9,000 మంది ప్రతినిధులను కలవడం కష్టం. అదే అభ్యర్థుల బహిరంగ చర్చలు జరిగితే ఎవరి సత్తా ఏమిటో ఇట్టే తెలుస్తుంది' అని అన్నారు.

పోటీ అక్కర్లేదన్నా.. పట్టుబట్టాడు

మల్లిఖార్జున ఖర్గే వెల్లడి



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో అందరి ఆమోదంతో ఒకే అభ్యర్థి ఉంటే బాగుంటుందని, ఎన్నిక ఏకగ్రీవం కావాలని అభిలషించానని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లిఖార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలో తన నివాసంలో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో ఖర్గే పలు విషయాలు మీడియాతో పంచుకున్నారు. 'సర్వామోదంతో, పోటీ లేకుండా ఒక్కరినే పార్టీ అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టాలని నా ప్రతిపాదన. అదే విషయాన్ని శశిథరూర్‌కు చెప్పా. నాతో ఆయన విబేధించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నిక మంచిది అని థరూర్ వాదించారు. తానూ బరిలో దిగుతానని చెప్పారు' అని ఖర్గే మీడియాకు వెల్లడించారు. 'ఒక వేళ పార్టీ చీఫ్‌గా ఎన్నికైతే గాంధీల కుటుంబం ఇచ్చే అమూల్యమైన సలహాలను పరిగణనలోకి తీసుకుంటా. నేనేమీ గాంధీలు బలపరిచిన అధికారిక అభ్యర్థిని కాదు. ఇప్పుడు పార్టీలో జీ–23 అంటూ ఎలాంటి అసంతృప్త నేతల కూటమి లేదు. అందరం కాంగ్రెస్ నాయకులమే. ఆర్ఎస్ఎస్–బీజేపీని సమష్టిగా ఎదుర్కొంటాం 'అని ఖర్గే స్పష్టంచేశారు. 'నేను పార్టీలో ఎవరిపైనో పోటీకి దిగలేదు. పార్టీని మరింత బలోపేతం చేయడంలో భాగమే ఈ పోటీ. పార్టీలో సమూల మార్పులు ఉన్నపళాన జరగవు' అని ఖర్గే అభిప్రాయపడ్డారు. పార్టీపై గాంధీలు గుత్తాధిపత్యం చేస్తారనే బీజేపీ ఆరోపణను ఖర్గే తిప్పికొట్టారు. 'కాంగ్రెస్‌లో ఎన్నికల ప్రాధికార వ్యవస్థ ఉంది. ఓటింగ్ హక్కులున్నాయి. బీజేపీలో అలాంటిదేమీ లేదు. బీజేపీలో ఎన్నికలు జరిగాయా? జేపీ నడ్డాను ఎన్నుకున్నదెవరు? ఆ పార్టీలో డెలిగేట్స్ ఎంతమంది?' అని ఖర్గే ప్రశ్నించారు. థరూర్ బహిరంగ చర్చ ప్రతిపాదనను తిరస్కరించారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

చైనా కమ్యూనిస్ట్ పార్టీకి జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్: రాబోయే కాలంలో అతిపెద్ద పోరాటాలకు, ఊహించని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు కమ్యూనిస్ట్ పార్టీ ఇప్పటినుంచే సంసిద్ధంగా ఉండాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా వ్యవహరించాలని సూచించారు. చైనా నేషనల్ డే సందర్భంగా ఖిషీ పత్రికలో జిన్‌పింగ్ ఈ మేరకు ఓ వ్యాసం రాశారు. సవాళ్లను ప్రభావవంతంగా అధిగమించే దిశగా ప్రజలను ముందుకు నడిపించాలని పేర్కొన్నారు. అధికార కమ్యూనిస్ట్ పార్టీ కీలక సదస్సు ఈ నెల 16న జరగనుంది. జిన్‌పింగ్ పదవీ కాలాన్ని వరుసగా మూడోసారి మరో ఐదేళ్లపాటు పొడిగించే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే మావో జెడాంగ్ తర్వాత పదేళ్లకుపైగా అధికారంలో ఉన్న నాయకుడిగా జిన్‌పింగ్ రికార్డు సృష్టిస్తారు.



గాంధీజీ, శాస్త్రిలకు ప్రముఖుల నివాళి


రాజ్‌ఘాట్‌లో నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము


పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నివాళి కార్యక్రమంలో ఓం బిర్లా, మోదీ, రాజ్‌నాథ్, సోనియా తదితరులు

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిలకు ప్రధాని మోదీ నివాళులర్పించారు. ఇద్దరు నేతల జయంతిని పురస్కరించుకుని ప్రధాని ఆదివారం వారి సమాధులున్న రాజ్‌ఘాట్, విజయ్‌ఘాట్‌లను సందర్శించి పుష్పాంజలి ఘటించారు. ప్రతి ఒక్కరూ ఖాదీ, హస్తకళల ఉత్పత్తులను కొనుగోలు చేసి గాంధీజీకి నివాళులర్పించాలని ప్రధాని ప్రజలను కోరారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేళ గాంధీ జయంతి మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. బాపు సిద్ధాంతాలను అన్ని వేళలా ఆచరించాలి'అని ట్వీట్ చేశారు. లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరత, స్థిరమైన నిర్ణయాలు తీసుకోగల శక్తి దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. 'కీలకమైన సమయంలో శాస్త్రి నాయకత్వ పటిమ దేశ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తున్నాను' అని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. శాస్త్రి జీవన ప్రయాణం, సాధించిన విజయాలపై 'ప్రధానమంత్రి సంగ్రహాలయ'లో ఉంచిన కొన్ని చిత్రాలను ప్రధాని షేర్ చేశారు. గాంధీజీకి కాంగ్రెస్ నేత రాహుల్ ట్విట్టర్ ద్వారా నివాళులర్పించారు. 'అన్యాయానికి వ్యతిరేకంగా దేశాన్ని ఏకం చేసిన గాంధీజీ మాదిరిగా దేశాన్ని ఐక్యంగా ఉంచుతామంటూ ప్రతిన బూనుదాం. సత్యం, అహింసా మార్గంలో నడవాలని ఆయన మనకు నేర్పించారు. ప్రేమ, కరుణ, సామరస్యం, మానవత్వం అర్థాన్ని బాపు వివరించారు' అని ట్వీట్ చేశారు.

ఐసీయూలో ములాయం

క్షీణించిన యూపీ మాజీ సీఎం ఆరోగ్యం

గురుగ్రామ్/లక్నో: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్(82)ను ఆదివారం గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రి ఐసీయూలో చేర్చారు. ఆగస్ట్ 22వ తేదీ నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో మేదాంతకు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆంకాలజీ నిపుణులు నితిన్ సూద్, సుశీల్ కటారియా ఆయనకు చికిత్స అందిస్తున్నారన్నారు. ములాయం సోదరుడు శివపాల్ యాదవ్ పక్కనే ఉన్నారని చెప్పారు. ప్రధాని మోదీ అఖిలేశ్‌తో ఫోన్‌లో మాట్లాడి ములాయం ఆరోగ్యం గురించి తెల్సుకున్నారు. జూలైలో కూడా ఒకసారి ములాయం ఆస్పత్రిలో చేరారు.

8% గృహాలకు వారంలో ఒక్క రోజే నీరు

- 74% గృహాలకు వారమంతా సరఫరా
- జల్‌శక్తి శాఖ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 8% గృహాలకు వారంలో కేవలం ఒక్కరోజు నీరు సరఫరా అవుతుండగా, 74% మందికి వారమంతా అందుతున్నట్లు కేంద్రం జల్‌శక్తి శాఖ అధ్యయనంలో వెల్లడైంది. మరో 4% గృహాలకు వారంలో ఐదారు రోజులు, 14% మందికి కనీసం మూడు, నాలుగు రోజులు నీరు అందుతోందని ఆదివారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. మొత్తమ్మీద సరాసరిన రోజుకు మూడు గంటలు చొప్పున నీరు సరఫరా అవుతున్నట్లు వివరించింది. తమ ఇళ్లలోని కుళాయిల ద్వారా అందే నీటితో రోజువారీ అవసరాల్లో 80% వరకు తీరుతున్నట్లు ప్రతి ఐదుగురిలో నలుగురు తెలిపినట్లు నివేదిక పేర్కొంది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, యూపీల్లో కుళాయి కనెక్షన్లు లేని గృహాలు అత్యధికంగా ఉన్నట్లు తెలిపింది. కనీసం ఆరు రాష్ట్రాల్లోని 30%పైగా గృహాలకు గత వారం రోజులుగా కుళాయి నీరు కాలేదని వెల్లడైంది. 'హర్ ఘర్ జల్' పథకం అమలవుతున్న 91% గృహాల్లోని కుళాయిలు సర్వే చేపట్టిన రోజు పనిచేస్తున్నట్లు గుర్తించారు (జాతీయ స్థాయిలో ఇది 86%). 91% గృహాలకు 88% గృహాలకు అవసరాలకు సరిపోను (రోజుకు ప్రతి వ్యక్తికి 55 లీటర్లకు మించి) నీరు అందుతుండగా, 84% ఇళ్లకు రోజూ సరఫరా అవుతోంది. 90% గృహాలకు కుళాయిల ద్వారా మంచినీరు అందుతోంది.

ఐశ్వర్యం వస్తుందని..
బాలుడి నరబలి

న్యూఢిల్లీ: మూఢనమ్మకం అభంశుభం తెలియని ఓ ఆరేళ్ల చిన్నారి ప్రాణం తీసింది. సంపద వస్తుందనే అంధ విశ్వాసంతో మానవత్వం మరిచి పసివాడిని నరబలి ఇచ్చారు. దేశ రాజధానిలో ఈ ఘోరం చోటుచేసుకుంది. బిహార్‌కు చెందిన అజయ్ కుమార్, అమర్ కుమార్ దక్షిణ ఢిల్లీ లోధి కాలనీలోని మురికివాడలో ఉంటున్నారు. అక్కడే యూపీకి చెందిన బాధిత బాలుడి కుటుంబం ఉంటోంది. వీరంతా భవన నిర్మాణ కార్మికులు. అజయ్, అమర్ శనివారం రాత్రి తమ గుడిసెలో పాటలు పాడుతూ పూజలు మొదలుపెట్టారు. అది చూసేందుకు బాలుడు వెళ్లాడు. పూజలు ముగిశాక అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు. కానీ, తన కుమారుడు ఎంతకీ రాకపోయేసరికి వెతుక్కుంటూ తండ్రి వెళ్లాడు. ఆ గుడిసెలో నుంచి రక్తం చారికలుగా ప్రవహిస్తూ కనిపించింది. లోపల మంచం కింద తన కొడుకు విగతజీవిగా పడి ఉండటంతో హతాశుడయ్యాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బు వస్తుందనే మూఢ నమ్మకంతోనే తమ వద్దకు వచ్చిన బాలుడి తలపై మోది, చాకుతో గొంతుకోసి చంపినట్లు అజయ్, అమర్ పోలీసుల విచారణలో వెల్లడించారు.

వందోసారి రక్తదానం

గోవా బ్లడ్‌మ్యాన్ ఘనత



పణజీ: ప్రమాదంలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వ్యక్తికి రక్తమిచ్చి సాయపడిన సుదేశ్ ఆ తర్వాతా ఆ పరంపరను కొనసాగించారు. అనుకోకుండా మొదలైన రక్తదాన వ్రతం ఇటీవల శతకం పూర్తిచేసుకుంది. గోవా బ్లడ్‌మ్యాన్‌గా పేరు తెచ్చుకున్న ఆయన పూర్తి పేరు సుదేశ్ రమాకాంత్ నర్వేకర్. 51 ఏళ్ల వయసున్న సుదేశ్ 18 ఏళ్ల వయసులో తొలిసారి రక్తదానం చేసి తోటి వ్యక్తికి సాయపడితే వచ్చే ఆత్మ సంతృప్తికి ఫిదా అయ్యాడు. అప్పటి నుంచి గత 33 సంవత్సరాలుగా ఆపదలో ఉన్న వారికి సాయంగా రక్తదానం చేస్తూనే ఉన్నాడు. దక్షిణ గోవాలోని పండాలో నివసించే సుదేశ్ ఇటీవల వందోసారి రక్తదానం చేసిన సందర్భంగా ఆయనను పీటీఐ పలకరించింది. ' టీనేజీలో ఉన్నపుడు ఒక యాక్సిడెంట్‌లో రక్తమోడుతున్న వ్యక్తికి బ్లడ్ ఇచ్చాకే తెలిసింది ఆపత్కాలంలో సాయపడటం ఎంత ముఖ్యమో. అందుకే నాకు తోచినంతలో ఇలా ఆపదలో ఉన్న వారికి సాయమందిస్తున్నా. భారత్‌లో వంద సార్లు రక్తదానం చేయడం అరుదు అని ఈమధ్యే తెలిసింది' అని ఇండియన్ రెడ్ క్రాస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న సుదేశ్ అన్నారు. ' మొదట్లో ఏడాదికి రెండు సార్లు డొనేషన్ చేసేవాడిని. తర్వాత శిబిరాలు పెరిగేకొద్దీ ఎక్కువసార్లు ఇవ్వడం స్టార్ట్‌చేశా. బెంగళూరు, పుణె, హుబ్లీ, బెళగామ్‌సహా పొరుగు రాష్ట్రాల్లోనూ రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేశా. మూడేళ్ల క్రితం పది మంది స్నేహితులతో కలిసి సార్థక్ ఎన్‌జీవోను ప్రారంభించా. గోవా అంతటా క్యాంప్‌లు నిర్వహించాం. ఇప్పుడు వైద్యులతో కలిసి 30 మంది బృందంగా ఏర్పడి ఎన్‌జీవో సేవ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాం. ఒక్క గోవా మెడికల్ కాలేజీలోనే 90సార్లు క్యాంప్‌లు పెట్టాం. గోవా విషయానికొస్తే మహిళలు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలకు వచ్చి బ్లడ్ డొనేట్ చేస్తున్నారు' అని సుదేశ్ చెప్పారు.

వల్లెవేయడం తేలికే..ఆచరణ కష్టం

గాంధీజీ ఆశయాలపై రాహుల్


బదనవాలులో ఖాదీ గ్రామోద్యోగ్ కేంద్రంలో మగ్గాన్ని పరిశీలిస్తున్న రాహుల్

మైసూరు: గాంధీజీ ఆశయాలను వల్లెవేయడం అధికారంలో ఉన్న వారికి తేలికే కానీ, వాటిని అనుసరించడం కష్టమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ఆయన ఆదివారం మైసూరు సమీపంలోని బదనవాలు గ్రామంలోని ఖాదీ గ్రామోద్యోగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రాన్ని గాంధీజీ 1927, 1932 సంవత్సరాల్లో సందర్శించడం విశేషం. ఈ సందర్భంగా జరిగిన గాంధీజీ జయంతి వేడుకల్లో రాహుల్ పాల్గొన్నారు. ఆ కేంద్రంలో చేనేత ఉత్పత్తులను పరిశీలించి, మహిళా కార్మికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. గాంధీజీని పొట్టనబెట్టుకున్న సిద్ధాంతంతోనే గడిచిన ఎనిమిదేళ్లుగా దేశంలో అసమానతలు, విభేదాలను వ్యాపింప జేస్తున్నారంటూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లనుద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న హింస, అసత్య రాజకీయాలకు వ్యతిరేకంగా అహింస, స్వరాజ్య భావనను పెంచేందుకే జోడో యాత్ర చేపట్టామన్నారు. బదనవాలు గ్రామంలో వీరశైవ, దళితులతో కలిసి రాహుల్ భోజనం చేశారు. ప్రముఖ శ్రీ నంజుండేశ్వర (శ్రీకంఠేశ్వర) ఆలయంలో పూజలు చేశారు. తర్వాత పాదయాత్ర మైసూరు ప్యాలెస్ మైదానం ఎదురుగా ఉన్న వస్తు ప్రదర్శన ఆవరణకు చేరుకుంది.

ఆరున యాత్రలో సోనియా
కర్ణాటకలో కొనసాగుతున్న భారత్ జోడో యాత్రలో ఈనెల ఆరో తేదీన సోనియా గాంధీ పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో యాత్ర 511 కిలోమీటర్ల పొడవునా 21 రోజులపాటు కొనసాగనుంది. వైద్య పరీక్షల నిమిత్తం విదేశాలకు వెళ్లి వచ్చిన సోనియా తొలిసారిగా యాత్రలో పాలుపంచుకోనున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలకు వెళ్తున్న కర్ణాటకగుండా ప్రస్తుతం యాత్ర కొనసాగుతుండటం గమనార్హం. బీజేపీపాలిత రాష్ట్రం గుండా యాత్ర కొనసాగడం ఇదే తొలిసారి.

శ్రీవారి సేవలో సీజేఐ దంపతులు


గజరాజు నుంచి ఆశీర్వచనం తీసుకుంటున్న జస్టిస్ యుయు లలిత్

తిరుమల: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు. లలిత్ ఆదివారం ఉదయం సతీ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయం వద్ద టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం సీజేఐకు తీర్థప్రసాదాలు, 2023 టీటీడీ క్యాలెండర్, డైరీలను చైర్మన్ అందజేశారు. సాయంత్రం సీజేఐ హనుమంత వాహన సేవలో పాల్గొన్నారు. కళా బృందాలతో కలిసి సీజేఐ సతీమణి కోలాటం ఆడారు. అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ, తమిళనాడు హైకోర్టుల సీజేలు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ టి.రాజా పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌పై దాడికి టీడీపీ కార్యకర్త యత్నం


మూర్తికి సంక్షేమ వివరాలతో కూడిన కరపత్రికను అందజేస్తున్న విప్ కాపు

గుమ్మఘట్ట: అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్ట మండలం భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ) గ్రామంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిపై టీడీపీ కార్యకర్త బెస్త మూర్తి దాడికి యత్నించారు. కాపు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామానికి వెళ్లారు. ఈ మూడేళ్లలో ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధిచేకూరిందన్న వివరాలతో బ్రోచర్లను లబ్ధిదారులకు అందించారు. బెస్త మూర్తి కుటుంబానికి అమ్మఒడి పథకం ద్వారా రూ.29 వేలు, రైతుభరోసా రూ.27 వేలు, సున్నావడ్డీ పథకం ద్వారా రూ.4,619, వైఎస్సార్ ఆసరా కింద రూ.20,562 లబ్ధి చేకూరిందనే విషయాన్ని వివరిస్తుండగా మూర్తి దురుసుగా మాట్లాడాడు. అక్కడే ఉన్న ఎస్ఐ సునీత జోక్యం చేసుకుని వారిస్తున్నా రెచ్చిపోయాడు. ప్రభుత్వ విప్‌ను అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు చేతిని నలిపి, గోరు గుచ్చడంతో రక్త గాయమైంది. ముందస్తు ప్రణాళిక ప్రకారమే మూర్తి ఈ దాడికి యత్నించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.12 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

- 161 కేజీల గంజాయితో నలుగురి అరెస్ట్
- రాజమండ్రి నుంచి రాజస్థాన్ తరలింపునకు యత్నం


గంజాయి వివరాలను వివరిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై చంద్రశేఖర్

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): ఏలూరు జిల్లా జీలుగుమిల్లి అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద రూ.12 లక్షల విలువైన 161 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ బి.వెంకటేశ్వరరావు విలేకరులకు ఆదివారం వివరాలు వెల్లడించారు. ఆయన మాటల్లో.. గంజాయి తరలింపుపై జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మకు అందిన సమాచారం మేరకు పోలవరం డీఎస్పీ కె.లతాకుమారి, జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా జీలుగుమిల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో జంగారెడ్డిగూడెం వైపు నుంచి అశ్వారావుపేట వైపు తెలంగాణ ప్రాంతానికి వెళ్తున్న కారులో ఒక బస్తా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అలాగే దాని వెనుక వస్తున్న లారీని కూడా తనిఖీ చేయగా, అందులో ఐదు బస్తాల గంజాయి లభ్యమైంది. రెండింటిలోనూ కలిపి సుమారు రూ.12 లక్షల విలువ చేసే 161 కేజీల 200 గ్రాముల గంజాయిని ఆరు బస్తాల్లో స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, రాజమండ్రి నుంచి కొవ్వూరు, జంగారెడ్డిగూడెం మీదుగా రాజస్థాన్‌కు రవాణా చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది డేవిడ్ రాజు, కె.అశోక్ కుమార్, కె.సుధాకర్, డి.లక్ష్మణ్, ఈ.కిషోర్, ఎం.ప్రవీణ్‌కు రివార్డు కోసం సీఐ వెంకటేశ్వరరావు సిఫార్సు చేశారు.

కారు దూసుకెళ్లి ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు • కారు నడిపిన మెడికో.. పరారీ
- పోలీసుల అదుపులో ఇద్దరు


మృతి చెందిన నంబూరి వీరబాబు

తణుకు: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మెడికో నడుపుతున్న కారు జనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు.. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన నంబూరి వీరబాబు (65) ఆదివారం కుటుంబసభ్యులు, మరికొందరితో కలిసి వచ్చి తణుకులో వీరభద్రస్వామికి పూజలు చేసి తిరిగి బయలుదేరారు. వీరికి ముందు స్థానికంగా నివాసం ఉంటున్న శీల శ్రీను పానకాల కావిడితోను, ఆయన వెంట కుమార్తె శీల నాగసత్యదుర్గాభవాని నడుస్తున్నారు. అదే సమయంలో వెనుకనుంచి వేగంగా వచ్చిన కారు వీరిపైకి దూసుకొచ్చి సమీపంలో పార్కు గోడను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో నంబూరి వీరబాబు, శీల శ్రీను, శీల భవాని తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తరువాత ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వీరబాబు మృతిచెందారు. శ్రీను, భవాని చికిత్స పొందుతున్నారు.

ఆటవిడుపుగా..

తణుకుకు చెందిన గుడ్ల ఎగుమతి వ్యాపారి సబీర్ హుస్సేన్ కారులో అతడి కుమారుడు సయ్యాన్ హుస్సేన్, తాడేపల్లిగూడేనికి చెందిన వడ్డి సాయిపవన్‌ఫణీంద్ర, వేల్పూరు గ్రామానికి చెందిన ఆముదాలపల్లి శశికిరణ్ ఉన్నారు. కారు నడుపుతున్న సయ్యాన్ హుస్సేన్ ప్రమాదం జరిగిన వెంటనే పరారయ్యాడు. సాయిపవన్‌ఫణీంద్ర, శశికిరణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెన్నైలో మెడిసిన్ చదువుతున్న సయ్యాన్ హుస్సేన్ సెలవులు కావడంతో ఇంటికి వచ్చాడు. స్నేహితులతో కలిసి కారులో వెళుతూ ఆటవిడుపుగా సెల్ఫీలు తీసుకుంటూ నడపటంతో కారు అదుపుతప్పి జనాలపైకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన వెంటనే ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కారు నడిపిన సయ్యాన్ హుస్సేన్‌ను అదుపులోకి తీసుకోకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నల్లమల వన్యప్రాణులకు ప్లాస్టిక్ ముప్పు

- ప్లాస్టిక్ రహితంగా చేసేందుకు కృషి
- వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ సేవక్‌ల నియామకం
- యాత్రికుల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు

ప్లాస్టిక్ వ్యర్థాలు తినడంతో వాటి ప్రవర్తన, శరీరాల్లో మార్పులు



సాక్షి, అమరావతి: నల్లమల అడవుల్లోని వన్యప్రాణులు ప్లాస్టిక్ ప్రభావానికి గురవుతున్నాయి. ప్లాస్టిక్ కారణంగా ఈ అటవీ ప్రాంతంలోని జంతువుల ప్రవర్తనలో మార్పులు వస్తున్నట్లు అటవీ శాఖ అధ్యయనంలో తేలింది. వాటి శరీరాల్లోను మార్పులు వస్తున్నట్లు స్పష్టమైంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో శ్రీశైలంలో ఉన్న బయోడైవర్సిటీ రీసెర్చ్ సెంటర్ నల్లమల అడవుల్లో పర్యావరణం, జీవావరణానికి సంబంధించిన అంశాలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తోంది. విస్తీర్ణంలో దేశంలోనే అతి పెద్దదైన నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాంతం (నల్లమల అడవులు) పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు వంటి అనేక జంతువులకు ఆలవాలం. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీశైలానికి వెళ్లే మార్గం ఈ అడవిలోంచే ఉంది. లక్షలమంది యాత్రికులు వచ్చే ప్రాంతం కావడంతో ఇక్కడ ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. కొందరు యాత్రికులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తూ ప్లాస్టిక్ పెట్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లు వంటి వాటిని అటవీ ప్రాంతంలో రోడ్డు వెంబడి పడేస్తున్నారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు ఆకర్షిస్తుండడంతో వన్యప్రాణులు రోడ్డుపైకి వచ్చి ప్రమాదాల పాలవుతున్నాయి. తెలియకుండా ప్లాస్టిక్‌ను తింటున్న అడవి జంతువులకు అనారోగ్యాలు వస్తున్నాయి. వన్యప్రాణుల శరీరంలో బయో-అక్యుమ్యులేషన్, బయో-మాగ్నిఫికేషన్ జరిగి ప్లాస్టిక్ కెమికల్స్ ఎక్కువగా పోగుపడుతున్నాయి. దీంతో అడవి జంతువుల సహజ ప్రవర్తనలో మార్పులు వస్తున్నాయి. వాటి శరీర హార్మోన్లలో మార్పులు వచ్చి అనారోగ్యాలకు గురవుతున్నాయి. ఆకలి తగ్గిపోవడంతో తినడం తగ్గి శక్తిహీనం అవుతున్నాయి. వాటి ఆహారపు అలవాట్లలోను తేడాలు కనిపిస్తున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు ప్రయత్నం

ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్)కు చెందిన అటవీ బృందం సాంకేతిక, శాస్త్రీయ పద్ధతుల ద్వారా నల్లమలలోని విభిన్నమైన పర్యావరణ వ్యవస్థను కాపాడేందుకు ప్రయత్నిస్తోంది. నల్లమల పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడమే అత్యంత కీలకమైన అంశం కావడంతో అక్కడి పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి 'మన ఎన్ఎస్‌టీఆర్-క్లీన్ అండ్ గ్రీన్ ఎన్ఎస్‌టీఆర్' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తోంది. స్థానికంగా ఉండే చెంచు గిరిజనులను ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేయడానికి స్వచ్ఛ సేవక్‌లుగా నియమించింది. తద్వారా వారికి ఉపాధి కల్పించడంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలను సమర్థంగా నిర్వహిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వేరు చేయించడంతోపాటు ప్రామాణిక పద్ధతుల్లో వాటిని రీసైక్లింగ్ చేస్తోంది. ప్రతి స్వచ్ఛ సేవక్‌కు అడవిలో జనసంచారం ఉండేచోట కొంత ప్రాంతాన్ని కేటాయించి ఆ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసే బాధ్యతను అప్పగించింది. ఘాట్‌రోడ్డు పక్కన చెత్తకుండీలు ఏర్పాటు చేసి యాత్రికులు ప్లాస్టిక్ వ్యర్థాలను వాటిలో వేసేలా సూచికలు పెట్టింది. ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న నష్టాలను తెలిపేలా పలుచోట్ల హోర్డింగ్‌లు ఏర్పాటు చేసింది. ఈ చర్యల ద్వారా అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వల్ల సమస్యలు రాకుండా చేసేందుకు అటవీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.


నల్లమలను ప్లాస్టిక్ ఫ్రీ చేద్దాం

నల్లమలను ప్లాస్టిక్ ఫ్రీ ప్రాంతంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. స్వచ్ఛ సేవక్‌ల ద్వారా ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లను ఏరివేయించి రీసైక్లింగ్‌కు పంపుతున్నాం. ప్లాస్టిక్ అడవి జంతువులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్లాస్టిక్‌ను శ్రీశైలం ప్రాంతానికి తీసుకురాకూడదు. యాత్రికులు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచుకోవాలి.

– వై.శ్రీనివాసరెడ్డి, ఫీల్డ్ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్, శ్రీశైలం

స్వర్ణ రథంపై సప్తగిరీశుడు..!

మూడు వాహన సేవల్లో దర్శనమిచ్చిన మలయప్ప


గజ వాహనంపై ఊరేగుతున్న తిరుమలేశుడు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలలో ఆదివారం స్వర్ణ రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు స్వర్ణ రథంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు స్వర్ణ రథోత్సవం ఊరేగింపు అశేష భక్తజన గోవింద నామస్మరణల మధ్య సాగింది. ఈ స్వర్ణ రథం 32 అడుగుల ఎత్తు, 30 టన్నుల బరువు ఉంటుంది. ఈ తరహాలో రథం మన దేశంలో మరెక్కడా లేకపోవడం విశేషం. ఈ రథాన్ని 74 కిలోల మేలిమి బంగారంతో 18 ఇంచుల మందంతో కూడిన 2,900 కిలోల రాగి పై 9 సార్లు తాపడం చేశారు. వెండి రథం కొయ్యకు సరికొత్త హంగులతోనే ఈ స్వర్ణ రథాన్ని తయారు చేశారు. రథం తయారీకి టీటీడీ రూ.30 కోట్లు ఖర్చు చేసింది. 2013లో తొలిసారిగా ఊరేగించారు.

ఉదయం భక్తశిఖామణిపై శ్రీరామచంద్రుడు

రాత్రి గజరాజుపై రారాజు దర్శనం ఇవ్వగా ఉదయం శ్రీరామచంద్రుని రూపంలో మలయప్పస్వామి తన భక్తశిఖామణి హనుమంతుని వాహనంగా మలుచుకుని ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్బాణాలు చేతపట్టిన శ్రీరామచంద్రుడిని ఆంజనేయుడు తన భుజంపై ఉంచుకుని ఆలయ పురవీధుల్లో అశేష భక్త జనులకు కనువిందు చేశారు. రాత్రి గజ వాహనంపై శ్రీనివాసుడు ఊరేగారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ముగ్ధమనోహరుడైన శ్రీనివాసుడు గజ వాహనంపై ఆశీనుడై రాజసంగా మాడ వీధులలో భక్తులను కనువిందు చేశారు. వాహన సేవల్లో పెద్ద జీయంగార్, చిన్నజీయంగార్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయు.లలిత్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు పాల్గొన్నారు. శ్రీవారి గరుడ వాహన సేవ భక్తుల సహకారంతో విజయవంతమైందని ఈవో ధర్మారెడ్డి తెలిపారు.

సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి లైన్ ఆల్వార్ ట్యాంక్ వద్దకు చేరుకుంది. సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం అర్ధరాత్రి వరకు 81,318 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 38,464 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.2.94 కోట్లు వేశారు. టీటీడీలో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అన్ని రకాల ప్రత్యేక దర్శనాలు రద్దు చేసిన అనంతరం స్వామి వారిని సామాన్య భక్తులు ఈ సంఖ్యలో దర్శించుకోవడం ఇదే ప్రథమం.

చదువుల తల్లి సరస్వతిగా జగన్మాత

- భారీగా దర్శనానికి తరలివచ్చిన భక్తులు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం జగన్మాత కనకదుర్గమ్మ శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. త్రిశక్తి స్వరూపిణి నిజ స్వరూపాన్ని సాక్షాత్కరింపజేస్తూ శ్వేత దండ, కమండలం ధరించి అభయ ముద్రలో శ్రీ సరస్వతీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రానికి శరన్నవరాత్రుల్లో ఎంతో విశిష్టత ఉంది. అందుకే చదువుల తల్లిగా కొలువుదీరిన దుర్గమ్మను రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. శనివారం రాత్రికే క్యూలైన్లు నిండిపోయాయి. అమ్మవారి దర్శనం ఆదివారం తెల్లవారు జామున 1.10 గంటల నుంచే ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు 2.30 లక్షల మంది దర్శనం చేసుకున్నట్లు దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ప్రత్యేక కుంకుమార్చనలు, పిల్లలకు అక్షరాభ్యాసాలు జరిగాయి. అమ్మవారి నగరోత్సవం కనుల పండువగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో కూచిపూడి కళాకారులు తమ నాట్య విన్యాసాలతో అలరించారు.

నేడు దుర్గాదేవిగా అమ్మవారి దర్శనం

కాగా, సోమవారం దుర్గాదేవిగా కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు. లోక కంటకుడైన దుర్గమాసురిడిని వధించిన అమ్మవారు దుర్గాదేవిగా ఇంద్రకీలాద్రిపై ఆవిర్భవించారు. 'దుర్గే దుర్గతి నాశని' అనే వాక్యం భక్తులకు శుభాలను కలుగజేస్తుంది. శరన్నవరాత్రులందు దుర్గాదేవిని అర్చించడం వల్ల దుర్గతులను పోగొట్టి సద్గతులను ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం.

అమ్మవారిని దర్శించుకున్న డీజీపీ

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాల్లో భాగంగా సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న బెజవాడ కనకదుర్గమ్మను డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపైకి చేరుకున్న ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికి అమ్మవారి సన్నిధికి తీసుకువెళ్లారు. అక్కడ అర్చకస్వాములు అమ్మవారికి పూజలు చేయించారు. ఆశీర్వాద మండపంలో వేద పండితులు డీజీపీకి ఆశీస్సులందించారు.

కాళరాత్రి అలంకారంలో భ్రామరి



శ్రీశైలం టెంపుల్: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడోరోజు ఆదివారం శ్రీశైలంలో భ్రమరాంబాదేవి కాళరాత్రి స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిని గజ వాహనంపై అలంకరించారు. విశేష అర్చనలు అనంతరం అలంకృత కాళరాత్రి అమ్మవారిని, గజవాహనాధీసులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ ఉత్సవం నిర్వహించారు. అనంతరం గజవాహనంపై కొలువుదీరిన స్వామి అమ్మవార్లు, కాళరాత్రిదేవికి వైభవంగా గ్రామోత్సవాన్ని జరిపించారు.

శాప్ ఓపెన్ ప్రైజ్‌మనీ టోర్నీ


- సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా శాప్ క్రీడాపోటీల నిర్వహణ
- కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఓపెన్ మీట్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఓపెన్ ప్రైజ్‌మనీ టోర్నీకి శ్రీకారం చుట్టింది. క్రీడలకు విశేష ప్రచారం కల్పించడంతోపాటు అవగాహన పెంచేలా టోర్నీని చేపడుతోంది. పురుషులకు వాలీబాల్, బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్, కబడ్డీ పోటీలను, మహిళలకు కబడ్డీ పోటీలను నిర్వహించనుంది. ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు కూడా మంజూరవడంతో పోటీల నిర్వహణపై దృష్టిసారించింది. మూడు క్రీడాంశాల్లోను నాకౌట్ పద్ధతిని అనుసరించనుంది. నవంబర్ చివరి నాటికి జిల్లాస్థాయిలో పోటీలు పూర్తిచేసి, డిసెంబర్ మొదటి వారంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. ఫైనల్స్‌ను మాత్రం సీఎం జగన్ పుట్టిన రోజైన డిసెంబర్ 21న అట్టహాసంగా నిర్వహించనుంది.

మూడు ప్రాంతాల్లో.. నాలుగు చోట్ల పోటీలు

సీఎం జగన్ పుట్టిన రోజుకు మూడు ప్రాంతాల్లో క్రీడా పండుగ నిర్వహించేలా శాప్ కసరత్తు చేస్తోంది. నెల్లూరులో బ్యాడ్మింటన్, తిరుపతిలో వాలీబాల్, విజయనగరంలో పురుషుల కబడ్డీ, కడపలో మహిళల కబడ్డీ పోటీలకు వేదికలను ప్రతిపాదించింది. ఇప్పటికే 26 జిల్లాల క్రీడాప్రాధికార సంస్థల అధికారులకు ఆదేశాలు జారీచేసింది. త్వరలోనే పోటీల షెడ్యూల్ విడుదల చేయనుంది. ఈ టోర్నీలో విజేతలకు భారీగా నగదు బహుమతులు ఇవ్వనున్నారు.

రూ.కోటితో ధనలక్ష్మీదేవి



పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రూ.1,11,11,116 కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీదేవిగా ఆదివారం అలంకరించారు. ఉదయం సరస్వతీదేవిగా, మధ్యాహ్నం ధనలక్ష్మీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

– పాలకొల్లు సెంట్రల్

'బాబు అండ్ కోది కుల ఉగ్రవాదం'

తాడికొండ : బాపూజీ స్ఫూర్తితో అహింసా మార్గంలో బహుజన హక్కులు సాధించి.. అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చి తీరతామని బహుజన పరిరక్షణ సమితి నేతలు చెప్పారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 735వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ మూడు రాజధానులను ఏర్పాటు చేస్తే సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారన్న అక్కసుతో బాబు అండ్ కో కుల ఉగ్రవాదంతో వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్లమెంట్‌లో ప్రసంగించిన కడప విద్యార్థిని రూప

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిని


మిద్దె రూప

వైవీయూ: భారతదేశ పార్లమెంట్‌లో వైఎస్సార్ జిల్లా కడప విద్యార్థిని మిద్దె రూప మహాత్మాగాంధీ గురించి ఆంగ్లంలో ఉపన్యసించింది. ఆదివారం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకల్లో భాగంగా పార్లమెంట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిని ఈమె కావడం విశేషం. దేశవ్యాప్తంగా 15 మంది విద్యార్థులు పార్లమెంట్‌లో ప్రసంగించేందుకు ఎంపికకాగా వీరిలో రూప ఒకరు. కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ(హెచ్‌ఈపీ) చదివి, ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా కూడా సేవలందించారు.

వికేంద్రీకరణకే మా మద్దతు


మునగపాకలో మానవహారం

రాష్ట్ర భవిష్యత్తు బంగారు బాట పట్టాలంటే మూడు రాజధానులతో కూడిన వికేంద్రీకరణకే మా మద్దతు అంటూ అనకాపల్లి జిల్లా మునగపాకలో ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం మానవహారం నిర్వహించారు. వికేంద్రీకరణతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు.

–మునగపాక

ఘనంగా 'సచివాలయ' వ్యవస్థ ఆవిర్భావ వేడుకలు



విజయవాడలో కేక్ కట్ చేస్తున్న ఉద్యోగులు

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్)/కడప కార్పొరేషన్: గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఆవిర్భావ వేడుకలు ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలోని ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తొలుత గాంధీజీ జయంతి సందర్భంగా మహాత్ముడి చిత్ర పటానికి నివాళులర్పించారు. సచివాలయ ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్ చిత్ర పటాలు చేబూని సెల్యూట్ సీఎం సార్.. అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా జానీపాషా కేక్ కట్ చేసి మాట్లాడుతూ.. సీఎం జగన్ గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారని కొనియాడారు. సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఫెడరేషన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సేవా కార్యక్రమాలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, నిత్యావసర వస్తువులు పంపిణీచేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.హరీంద్ర, విజయవాడ నగర అధ్యక్షుడు స్టాలిన్ చక్రవర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీశైలంలో పెరుగుతున్న నీటిమట్టం

నాగార్జునసాగర్ 6 గేట్ల నుంచి నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్/విజయపురిసౌత్: కొద్ది రోజులుగా కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి భారీగా వరద జలాలు వచ్చి చేరుతున్నాయి. దీంతో జలాశయం నీటిమట్టం పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి 1,78,498 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. శనివారం నుంచి ఆదివారం వరకు కుడిగట్టు కేంద్రంలో 12.259, ఎడమగట్టు కేంద్రంలో 14.242 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 55,811 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా ఏడు వేల క్యూసెక్కులు, హంద్రీ–నీవా సుజలస్రవంతికి 1,350 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. డ్యామ్ పరిసర ప్రాంతాల్లో 14 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం జలాశయంలో 883.20 అడుగుల మట్టంలో 205.6627 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ జలాశయానికి 88,314 క్యూసెక్కుల నీరు వస్తోంది. జలాశయం ఆరుగేట్ల ద్వారా 48,414, విద్యుదుత్పాదనతో 28,745.. మొత్తం 77,159 క్యూసెక్కులు కృష్ణానదిలోకి వదులుతున్నారు. కుడి, ఎడమకాలువలకు కలిపి 8,755 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయంలో 589.70 అడుగుల మట్టంలో 311.1486 టీఎంసీల నీరు ఉంది.

రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



వెంకయ్య నాయుడుకు స్వాగతం పలుకుతున్న మంత్రి కాకాణి

రేణిగుంట: ప్రజా ప్రతినిధులు క్రమశిక్షణ, హుందాగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. ఉప రాష్ట్రపతిగా పదవీకాలం ముగిశాక తొలిసారి ఆయన స్వగ్రామం నెల్లూరుకు వెళుతున్న నేపథ్యంలో బీజేపీ నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకుని స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్‌లో ఆయనను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కలిసి శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఆయన విమానాశ్రయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎన్నికైన వారు ప్రతిపక్షాలను గౌరవించాలని, ప్రతిపక్షాలు కూడా అర్థవంతమైన చర్చలతో పాలకపక్ష లోపాలను ఎత్తి చూపాలని సూచించారు. ఆయన వెంట మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు ఉన్నారు.

టీడీపీ, వైఎస్సార్‌సీపీ దొందూదొందే

బీజేపీ ఏపీ సహ ఇన్‌చార్జి సునీల్ దేవధర్

ఒంగోలు: అవినీతిలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ దొందూదొందే అని బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి సునీల్ దేవధర్ విమర్శించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం రాత్రి బీజేపీ నిర్వహించిన ప్రజాపోరు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. హిందూ ఆలయాలను దారుణంగా ధ్వంసం చేసి తిరిగి ఒక్క గుడి కూడా కట్టని చంద్రబాబుకు హిందువుల మనోభావాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ప్రకాశం జిల్లా అభివృద్ధికి ఆరు ప్రాజెక్టులకు రూ.76 వేల కోట్లు కేంద్రం కేటాయిస్తే కనీసం భూమి కూడా చూపడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, జనసేన కూటమికి పట్టంకట్టాలని కోరారు. పుష్ప సినిమాలోని డైలాగులు మాట్లాడుతూ బీజేపీ అంటే పుష్పం అనుకున్నారా కాదు.. పవర్ అంటూ తెలుగులో ప్రసంగం ముగించారు.

రబీ విత్తనాలకు రిజిస్ట్రేషన్లు షురూ

ఆర్బీకేల్లో రైతుల వివరాల నమోదు.. తొలుత కర్నూలు, నంద్యాలలో పంపిణీ

- 15 నుంచి రాష్ట్రమంతా పంపిణీకి ఏర్పాట్లు
- మొత్తం 2.23 లక్షల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం



కర్నూలు జిల్లా తర్తూర్ ఆర్బీకేకు చేరిన శనగ విత్తనాలు

సాక్షి, అమరావతి: రబీ విత్తనాల పంపిణీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలను సీజన్‌కు ముందే రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్బీకే) సిద్ధంచేశారు. వీటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా ఇప్పటికే ప్రారంభించారు. కర్నూలు, నంద్యాల ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్‌తో పాటు శనగ, చిరుధాన్యాల విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ రెండు జిల్లాల్లో 1,600 క్వింటాళ్ల శనగ విత్తనాలను సిద్ధంచేశారు. మిగిలిన జిల్లాల్లో 15వ తేదీ నుంచి అన్ని రకాల విత్తనాలు పంపిణీ చేస్తారు. రబీలో 58.67 లక్షల ఎకరాల్లో సాగు చేయాల ని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానంగా 20.78 లక్షల ఎకరాల్లో వరి, 10.43 లక్షల ఎకరాల్లో శనగ, 9.22 లక్షల ఎకరాల్లో మినుము, ఐదు లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 2.54 లక్షల ఎకరాల్లో జొన్న, 2.52 లక్షల ఎకరాల్లో పెసలు, 2.43 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగుచేయనున్నారు.

ల్యాబుల్లో పరీక్షలు.. సర్టిఫైడ్ విత్తనాలు

ఇక ఈ సీజన్ కోసం మొత్తం 2,22,960 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంచేశారు. వీటిలో ప్రధానంగా శనగ 1,26,656 క్వింటాళ్లు, వేరుశనగ 48,122, వరి 20,134, మినుము 19,693, పెసలు 6,477, ఉలవలు 513, నువ్వులు 464, కందులు 87, చిరుధాన్యాలు 264, అలసందలు (కౌపీ) 14 క్వింటాళ్లతో పాటు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు 5, పిల్లిపెసర 8, జనుము 523 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంచేశారు. వరి, వేరుశనగ, చిరుధాన్యాలతో పాటు 60 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలను రైతుల నుంచి సేకరించి ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌లో పరీక్షించి ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లుచేస్తున్నారు.

రైతన్నలకు రాయితీలు..

రబీ సీజన్‌లో పచ్చిరొట్ట, చిరుధాన్యాలు, ఉలవలు 50శాతం, వేరుశనగ, నువ్వుల విత్తనాలను 40 శాతం, మినుము, పెసలు, కందులు, అలసందలు విత్తనాలను 30 శాతం, శనగలు 25 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తారు. వరి ఆహార భద్రత పథకం వర్తించే జిల్లాల్లో క్వింటాల్‌కు రూ.1,000 చొప్పున, వర్తించని జిల్లాల్లో రూ.500చొప్పున విత్తనాలపై సబ్సిడీ ఇవ్వనున్నారు. సబ్సిడీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.50.79 కోట్లు భరించనుంది.

నాణ్యత ధ్రువీకరించాకే పంపిణీ

రబీ సీజన్‌కు సరిపడా సర్టిఫై చేసిన విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీకి ఏర్పాట్లుచేశాం. రైతుల ద్వారా సేకరించిన విత్తనాలతో పాటు ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ప్రైవేట్ కంపెనీల నుంచి సేకరించి అగ్రి ల్యాబ్‌లలో నాణ్యత ధ్రువీకరించిన తర్వాత రైతులకు అందించేలా ఏర్పాట్లుచేశాం.

– గెడ్డం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ సీడ్స్

మహిళలను గౌరవించే సంస్కారం టీడీపీకి లేదు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, విశాఖపట్నం/దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): మహిళలను గౌరవించే సంస్కారం టీడీపీ నేతలకు లేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కుటుంబసభ్యులపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. దుష్ప్రచారాలు చేస్తూ కుటిల రాజకీయాలకు పాల్పడితే తగిన బుద్ధి చెబుతామన్నారు. ఆదివారం విశాఖలో మంత్రి రజిని మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో మహిళలను విపరీతంగా వేధించారని చెప్పారు. మహిళా అధికారులపై దాడి చేశారని గుర్తు చేశారు. మహిళలను అగౌరవపరిచేలా పోస్టులు చేస్తున్న ఐటీడీపీ కో కన్వీనర్ చింతకాయల విజయ్‌కు సీఐడీ నోటీసులివ్వడంలో తప్పులేదన్నారు. మహాత్మాగాంధీ ఆశయాల సాధనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. విశాఖలో జీవీఎంసీ నిర్వహించిన గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి ఉత్సవాల్లో మంత్రి పాల్గొని నివాళి అర్పించారు.

విజయ్ వెనుక ఉంటే బాబుకూ జైలు

- మహిళల మాన, ప్రాణాలతో చెలగాటమాడే వారికి అండగా ఉంటారా?
- పేపర్ ఉంది కదా అని తప్పుడు వార్తలు రాస్తే ఎలా?
- నేను అవినీతికి పాల్పడ్డానని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తా
- లేదంటే ఈనాడు చైర్మన్ పదవికి రాజీనామా చేస్తారా రామోజీ?
- మంత్రి జోగి రమేష్ ధ్వజం

సాక్షి, అమరావతి: టీడీపీ అధికారిక సోషల్ మీడియా వెబ్‌సైట్ ఐ టీడీపీలో మహిళలను కించపరిచేలా పెట్టిన పోస్టింగ్‌లను ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రోత్సహిస్తున్నట్లుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. వాటి వెనుక చంద్రబాబు ఉన్నట్లయితే.. చింతకాయల విజయ్‌తో పాటు ఆయన కూడా జైలుకు పోవడం ఖాయమని తేల్చి చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐ టీడీపీ వెబ్‌సైట్‌ను పర్యవేక్షించే చింతకాయల విజయ్ అరాచకవాది అని అభివర్ణించారు. మహిళల మాన, ప్రాణాలకు సంబంధించి వెబ్‌సైట్‌లో పోస్టింగ్‌లు పెడితే.. విచారణ నిమిత్తం ఏపీ సీఐడీ పోలీసులు హైదరాబాద్‌లోని చింతకాయల విజయ్ నివాసానికి వెళితే దాన్ని భూతద్దంలో చూపిస్తున్నారని మండిపడ్డారు. దొంగ, తప్పుడు పనులు చేసేవాళ్ల ఇళ్లకు పోలీసులు వెళ్లరా.. అని చంద్రబాబు, రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 నాయుడులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ ఇంకా ఏమన్నారంటే..



తప్పు చేయకుంటే ఎందుకు పారిపోయాడు?

- చింతకాయల విజయ్ తప్పు చేయకుంటే సీఐడీ పోలీసులను చూసి ఎందుకు గోడదూకి పారిపోయాడు? తప్పు చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేయడం తప్పా? సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో పనిచేస్తున్న మేము ఏనాడు దుర్మార్గపు క్రీడకు ఒడిగట్టం.
- ఇలాంటి అరాచకవాదుల్ని మీ అఫీషియల్ వెబ్‌సైట్ ఐ టీడీపీలో పెట్టుకుని అన్యాయమైన పోస్టింగ్‌లు పెట్టించవచ్చా బాబూ? తప్పు చేసిన వ్యక్తిని సమర్థిస్తూ ఎల్లో పత్రికల్లో ఫ్రంట్ పేజీలో వార్తలు ప్రచురించుకోవడం కంటే దుర్మార్గం మరొకటి ఉంటుందా? మీకు కూడా కూతుర్లు, కోడళ్లు ఉన్నారు కదా? చింతకాయల విజయ్ తప్పు చేయలేదని భావిస్తే, మీడియా ముందుకు రమ్మనండి.
- అక్రమ కట్టడాన్ని కూల్చి వేసేందుకు పొక్లెయిన్ తీసుకువస్తే చింతకాయల విజయ్ తండ్రి అయ్యన్నపాత్రుడు గోడ దూకి పారిపోతాడు. తండ్రీ కొడుకులు అదే బాపతు. ఇలాంటి వాళ్లకు చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్ సపోర్టు చేయడం సిగ్గుచేటు. చంద్రబాబు నోరు తెరిస్తే బూతులే. ఇప్పటికీ భాష మార్చుకోరు.
- 'గృహ నిర్మాణ శాఖలో వసూలు రాజా' అనే వార్తను ఈనాడులో ప్రచురించారు. పేపరు ఉంది కదా అని, ఏది పడితే అది రాయడం కాదు. వాస్తవాలను నిరూపించే దమ్ము రామోజీరావుకు ఉందా? నిరూపిస్తే నా మంత్రి పదవిని రాజీనామా చేస్తా.. లేదంటే ఈనాడు చైర్మన్ పదవికి మీరు రాజీనామా చేస్తారా? అని జోగి రమేష్ అన్నారు.

మహిళల మానప్రాణాలతో చెలగాటమా?

మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: టీడీపీ నేతలు తమకు ఈ రాష్ట్రంలో రాజ్యాంగం వర్తించదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. వారికి కొమ్ముకాస్తున్న పచ్చ మీడియా వ్యవహారశైలి కూడా అలాగే ఉందన్నారు. చింతకాయల విజయ్ సోషల్ మీడియా అరాచకవాది.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మేరుగు నాగార్జున ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'మహిళల మానప్రాణాలపై ఇష్టం వచ్చినట్లుగా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయటం కరెక్టేనా? ఇంత సిగ్గుమాలిన పనులు చేసే వ్యక్తిని రామోజీరావు ఎందుకు వెనకేసుకొస్తున్నారు? ఇలాంటి దారుణమైన వ్యాఖ్యలు చేసినందుకు మా పార్టీ వాళ్లకు కూడా ఒళ్లు మండి అయ్యన్నపాత్రుడి కుటుంబంలోని మహిళలనో, నారా భువనేశ్వరినో, బ్రాహ్మణినో, లేకపోతే రామోజీరావు కోడలినో, మనవరాలినో ఇలాంటి వ్యాఖ్యలే చేస్తే వారికెలా ఉంటుంది? అప్పుడు కూడా... అలాంటి కామెంట్లు చేసిన వారిని ఈనాడు ఇలాగే సమర్థిస్తుందా?' అని ప్రశ్నించారు. సీఐడీ వారు విజయ్ కోసం వెళితే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. 'ఒక మహిళ మీద అభ్యంతరకర పోస్టులు పెట్టడాన్ని వీరు సమర్థిస్తారా? ఐటీడీపీ అనే దానిలో ఈ విజయ్ దారుణమైన పోస్టులు పెట్టాడు. మహిళల శీలాన్ని అవమానించేలా, ప్రజలు అసహ్యించుకునేలా విజయ్ పోస్టులు ఉంటున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల ధన, మానాలను దోచుకున్న వ్యక్తులు ఈ టీడీపీ వాళ్లు. టీడీపీ అధికార వెబ్‌సైట్ ఐటీడీపీ ద్వారా పోస్టులు పెట్టారు. అందుకే విచారణ కోసం పోలీసులు పిలిచారు. అదేమైనా తప్పా? ఇలాంటి వ్యక్తులను ఎల్లో మీడియా ఎందుకు వెనుకేసుకుని వస్తోంది?. చింతకాయల విజయ్ చేసే ఘోరమైన ఇతర వ్యాపారాలను చంద్రబాబు, లోకేశ్ సమర్థిస్తున్నారు. వీరంతా రాష్ట్రాన్ని ఏం చేయదలుచుకున్నారు? అని మంత్రి ప్రశ్నించారు. 'దేశంలో ఎవరూ చేయని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెచ్చిన సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారు. చింతకాయల విజయ్ కంటే ఎక్కువగా మేం మాట్లాడతాం. తిడతాం. కానీ మాకు సంస్కారం ఉండబట్టి అలా చేయడం లేదు. టీడీపీ వారికి సిగ్గు అనేది లేదు. చింతకాయల విజయ్ అనే వ్యక్తిపై చట్టం తనపని తాను చేసుకుంటుంది. మహిళలపై సీఐడీ దౌర్జన్యం అంటూ తప్పుడు మాటలు మాట్లాడటం సరికాదు' అని అన్నారు.

మాకు విచక్షణ ఉంది ...

చంద్రబాబు భార్య మీద, కోడలి మీద, రామోజీరావు భార్య మీద, కోడలి మీద, మనవరాళ్ల మీద రాధాకృష్ణ కూతురు మీద.. ఇలా వారి ఇళ్లలో ఉన్న మహిళల మీద ఏనాడూ తాము ఇటువంటి విమర్శలకు దిగడం లేదని మంత్రి స్పష్టంచేశారు. 'మా పార్టీ ప్రజలకు చేసిన మంచిని, మేలును నమ్ముకున్న పార్టీనే తప్ప దిగజారుడు ప్రచారాన్ని నమ్ముకోలేదు. ఇంత నిగ్రహంగా మా నాయకత్వం, మేము ఉన్నా ఎవరో ఒకరు సహనం కోల్పోయి ప్రతిస్పందనగా పోస్టింగ్ పెడితే, నానా యాగీ చేస్తున్నారు. చింతకాయల విజయ్‌కు నోటీసు ఇస్తే, ఆయన తండ్రి అయ్యన్నపాత్రుడు ఇష్టం వచ్చినట్లు తిట్టారు. మేమూ తిట్టగలం. కానీ మాకు సంస్కారం ఉంది. అయ్యన్నపాత్రుడు నోరు అదుపులో పెట్టుకోవాలి. ఒళ్లు దగ్గర పెట్టుకుని వ్యవహరించాలి. విజయ్ శిక్షార్హుడు' అని అన్నారు. టీడీపీ నేతలకు నిజంగా సిగ్గు ఉంటే చింతకాయల విజయ్‌ను సమర్థించకూడదన్నారు.

తెలంగాణ మంత్రి వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ధ్వజం

రాజమహేంద్రవరం రూరల్: తెలంగాణ మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యలు ఆయన అహంకారానికి, అహంభావానికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం బొమ్మూరు బాలాజీపేట సెంటర్‌లో ఏర్పాటు చేసిన గొందేశి పూర్ణచంద్రారెడ్డి విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏపీ ఉద్యోగులపై తెలంగాణ మంత్రి చేసిన వ్యాఖ్యలపై సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించారని, దీనిపై తెలంగాణ మంత్రి 'మాతో పెట్టుకుంటే ఏదైనా చేస్తాం' అంటూ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సజ్జల నీతి కలిగిన నాయకుడని, వైఎస్సార్ కుటుంబాన్ని అభిమానించే వ్యక్తి అని, వైఎస్ జగన్ కష్టపడే ప్రతిచోటా ఆయన ఉంటారని తెలిపారు. రాష్ట్ర విభజనలో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన మున్నూరు కాపులను బీసీల్లో చేర్చి ఆదుకున్న విశాల హృదయం సీఎం జగన్మోహన్‌రెడ్డిదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనపై దురహంకార వ్యాఖ్యలు సరైనవి కావని, తెలుగువారిగా విడిపోయినా మనసులు విరిగిపోయినట్టు వ్యాఖ్యలు ఉండకూడదని హితవు పలికారు. తెలంగాణ నుంచి ఆంధ్రాకు వలసలు వస్తున్నారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలోకి కుప్పం టీడీపీ నేతలు

- మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన 50 కుటుంబాలు
- వచ్చే ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్

తిరుపతి మంగళం: వచ్చే ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇటీవల కుప్పం వచ్చి వెళ్లాక నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు తండోపతండాలుగా వస్తున్నారని తెలిపారు. ఆదివారం తిరుపతిలోని మంత్రి కార్యాలయంలో కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లె మండలం కొడతనపల్లి గ్రామ పంచాయతీకి చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరామని టీడీపీ నాయకులు తెలిపారు. గత 30 ఏళ్లుగా టీడీపీ జెండా మోశామని, అయినా ఏనాడూ ఇన్ని సంక్షేమ పథకాలు పొందలేదని వివరించారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాకే కుప్పం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నా మరో 30 ఏళ్లకు కూడా కుప్పంలో ఇంత అభివృద్ధి జరగదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌తోనే కుప్పం ప్రజలు నడుస్తారని చెప్పారు. ఇన్నేళ్లు కళ్లు మూసుకుపోయి టీడీపీకి పని చేశామని, చేసిన తప్పులు తెలుసుకున్నామని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో వరుసగా టీడీపీకి ఎదురు దెబ్బలు తగులుతున్నాయన్నారు. మునిసిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడంతో చంద్రబాబు కంచుకోట బద్దలయిందని చెప్పారు. కుప్పంలో భరత్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ 14 ఏళ్ల పాటు చంద్రబాబు సీఎంగా ఉన్నా కుప్పం అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.

పేర్నాటి విజయానికి కృషి చేయాలి: పెద్దిరెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: వైఎస్సార్‌సీపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలో ఆదివారం చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించారు. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పేరును ప్రకటించారు. అనుకున్న సమయానికి ఓటర్ల నమోదు పూర్తి చేయాలని చెప్పారు. ఓటర్ కార్డ్‌కు ఆధార్‌ని అనుసంధానం ద్వారా దొంగ ఓట్లకు చెక్ పెట్టవచ్చని చెప్పారు. కుప్పంలో దొంగ ఓట్లు తొలగించడానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ భరత్‌కు సూచించారు. డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, మంత్రి ఆర్కే రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి, ఆదిమూలం, అరణి శ్రీనివాసులు, వరప్రసాద్, ఎంఎస్.బాబు, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి పాల్గొన్నారు.

6 నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం

సచివాలయాల్లో బుకింగ్‌కు అవకాశం

సాక్షి, అమరావతి : సదరం ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ఈ నెల ఆరో తేదీ నుంచి స్లాట్ బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు స్లాట్‌లు అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి రాష్ట్ర వ్యాప్తంగా 171 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు.

ఏ జిల్లాలోనైనా అవకాశం

గతంలో ఏ జిల్లాకు చెందిన వారు ఆ జిల్లాలోని ఆస్పత్రుల్లోనే స్లాట్ బుక్ చేసుకుని స్క్రీనింగ్‌కు హాజరుకావాల్సి ఉండేది. విద్య, ఉపాధి, కుటుంబ అవసరాల నిమిత్తం ఇతర జిల్లాల్లో నివసించే ప్రజలు సదరం సర్టిఫికెట్ పొందడానికి సొంత జిల్లాకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం రాష్ట్రంలోని ఏ జిల్లాలో అయినా సదరం స్క్రీనింగ్‌కు హాజరై సర్టిఫికెట్‌లు పొందడానికి ప్రభుత్వం గత జూలై నుంచి అవకాశం కల్పించింది.

సులభంగా... అధికంగా...

అదే విధంగా గత ప్రభుత్వ హయాంలో కేవలం 56 ఆస్పత్రుల్లోనే సదరం క్యాంపులు నిర్వహించారు. స్లాట్‌లు కూడా తక్కువగా ఉండేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సదరం స్లాట్ బుకింగ్ నుంచి సర్టిఫికెట్ల జారీ వరకు సులభంగా పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే స్లాట్ బుకింగ్‌లకు అవకాశం కల్పించింది. సదరం పరీక్షలు నిర్వహించే ఆస్పత్రుల సంఖ్యను 171కు పెంచింది. దీంతో టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం సులభంగా సదరం సేవలు ప్రజలకు లభిస్తున్నాయి. ఈ క్రమంలో సర్టిఫికెట్‌ల జారీ సంఖ్య కూడా పెరిగింది. టీడీపీ ప్రభుత్వంలో ఏడాదికి 25 వేల నుంచి 30వేల వరకు మాత్రమే సర్టిఫికెట్‌లు జారీ చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2019–20లో 77,385 సర్టిఫికెట్‌లు, 2020–21లో 70,570 సర్టిఫికెట్‌లు, 2021–22లో 91,225 సర్టిఫికెట్‌లు జారీ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 36వేలకు పైగా సర్టిఫికెట్‌లు మంజూరు చేశారు.

గంజాయి పట్టుకున్నా నిందలేనా?

అక్రమ రవాణాకు మూడేళ్లుగా అడ్డుకట్ట: విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యల ఫలితంగా పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వైఎస్సార్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి తెలిపారు. గంజాయిని పట్టుకుంటే ఎల్లో మీడియా స్వాగతించకుండా ప్రభుత్వంపై బురద చల్లడం ఏమిటని ప్రశ్నించారు. ఇంత భారీగా గంజాయిని పట్టుకోవడం రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయంగా వైఎస్సార్‌సీపీ వ్యతిరేక శక్తులకు కనపడడం లేదా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

- దేశవ్యాప్తంగా 2021లో పట్టుబడ్డ 7,49,761 కిలోల గంజాయిలో ఏపీలో దొరికింది 2,00,588 కిలోలు. రెండో స్థానంలో ఉన్న ఒడిశాలో 1,71,713 కిలోలు లభ్యమైంది. నిఘా సంస్థలు స్వాధీనం చేసుకున్న గంజాయిలో సగం వరకూ రెండు రాష్ట్రాల్లోనే పట్టుబడిందన్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో వార్షిక నివేదికలో ఇటీవల ఈమేరకు సమాచారం ఇచ్చింది.
- గంజాయి భారీ విస్తీర్ణంలో సాగయ్యే కేరళ, తమిళనాడులో ఏడెనిమిదేళ్ల క్రితం ప్రతికూల పరిస్థితులతో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు విస్తరించింది. 2015–19 మధ్య టీడీపీ సర్కారు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల గంజాయి విచ్చలవిడిగా సాగైంది. విశాఖ ఏజెన్సీ, పక్కనే ఉన్న ఒడిశా అటవీ, పర్వత ప్రాంతాలు దశాబ్దాలుగా గంజాయి సాగుకు ఆలవాలంగా మారాయి.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపింది. ఫలితంగా, 2021లో భారీ మొత్తాల్లో గంజాయి లభ్యమైంది. సరైన దారులు లేకపోవడం, అమాయకులైన గిరిజనులను స్మగ్లర్లు మోసగించడం లాంటి పరిస్థితులను అధిగమించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశాం. ఎన్సీబీ వార్షిక నివేదిక 2021లో రెండు పాయింట్లను పట్టుకుని టీడీపీ అనుకూల ప్రచారసాధనాలు రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తే ప్రజలు విశ్వసించరు. స్వాధీనం చేసుకున్న గంజాయి పరిమాణమే సర్కారు పనితీరుకు గీటురాయి.

నేటి నుంచి ఆస్ట్రేలియాలో ఐసీఐడీ కాంగ్రెస్

- అడిలైడ్‌లో 10వ తేదీ వరకు సమావేశాలు
- హాజరవుతున్న మంత్రి అంబటి బృందం
- వచ్చే ఏడాది విశాఖలో ఐసీఐడీ 25వ కాంగ్రెస్

సాక్షి, అమరావతి: ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో సోమవారం (నేటి) నుంచి ఈనెల 10వ తేదీ వరకు జరగనున్న ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) కాంగ్రెస్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పాల్గొనేందుకు జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలోని బృందం ఆదివారం బయలుదేరివెళ్లింది. అడిలైడ్‌లో జరిగే ఐసీఐడీ 24వ కాంగ్రెస్, 73వ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఐఈసీ)లో ఈ బృందం పాల్గొననుంది. అంతర్జాతీయంగా అత్యంత ప్రతిష్టాత్మక ఐసీఐడీ 25వ కాంగ్రెస్, 74వ ఐఈసీ సమావేశాలను వచ్చే ఏడాది నవంబర్ 6 నుంచి 13 వరకు విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. అడిలైడ్‌లో జరిగే సమావేశాల్లో 78 దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారు. ప్రపంచానికి జలభద్రత చేకూర్చడం, తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగుకు దోహదం చేసే అత్యాధునిక నీటిపారుదల విధానాలపై ఈ సమావేశాల్లో చర్చిస్తారు. అత్యాధునిక నీటిపారుదల విధానాలను ప్రదర్శిస్తారు. వాటిని అందిపుచ్చుకుని నీటి వనరులను మరింత సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా అత్యధిక విస్తీర్ణంలో ఆయకట్టుకు నీరందించి, రాష్ట్రాన్ని సుభిక్షం చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దస్‌పల్లా భూములకు రాజకీయ రంగు పులమొద్దు

- మీడియా కథనాలు సరికాదు: రాణి కమలాదేవి, దిగ్విజయ్‌దేవ్ భంజ్
- అవి మా భూములేనని కోర్టులన్నీ స్పష్టం చేశాయి
- భూముల అభివృద్ధికి అస్యూర్ డెవలపర్స్‌తో ఒప్పందం
- విజయసాయిరెడ్డి, ఆయన కుటుంబానికి సంబంధం లేదు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ దస్‌పల్లా భూములకు రాజకీయ రంగు పులమొద్దని ఆ భూముల యజమాని రాణి కమలాదేవి, ఆమె కుమారుడు దిగ్విజయ్‌దేవ్‌భంజ్ సూచించారు. దస్‌పల్లా భూములపై కొన్ని మీడియాల్లో వస్తున్న కథనాలపై కలత చెందుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు వారు ఆదివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. దస్‌పల్లా భూములను వివిధ న్యాయస్థానాల నుంచి సుప్రీంకోర్టు సైతం ప్రైవేట్ భూములుగా ప్రకటించినట్లు గుర్తు చేశారు. 2015లో ఏపీ అడ్వకేట్ జనరల్ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాల్సి ఉంటుందని, అదే విషయాన్ని ప్రభుత్వం ద్వారా జిల్లా కలెక్టర్‌కు తెలియజేసిందన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు సెక్షన్ 22 (ఏ) కింద నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. 2016లో ఈ నోటిఫికేషన్‌ను కోర్టులో సవాలు చేయగా ప్రతివాదుల వాదనలో వాస్తవం లేదంటూ కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. 2009, 2011, 2012లో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రివ్యూ, క్యూరేటివ్ పిటిషన్లను కూడా డివిజన్ బెంచ్ కొట్టివేసిందన్నారు. కొన్ని స్వార్థశక్తుల కారణంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ చాలాకాలంగా నిలిచిపోయిందన్నారు. దస్‌పల్లా కుటుంబం 1959 నుంచి తమ భూముల్లో కొన్నిటిని థర్డ్ పార్టీలకు విక్రయించిందన్నారు. దస్‌పల్లా కుటుంబానికి చెందిన కొనుగోలుదారులు, దస్‌పల్లా కుటుంబ సభ్యులు కలిసి మిగిలిన భూమిని నిషేధిత రిజిస్టర్ నుంచి డీ నోటిఫై చేయాలని అవిశ్రాంతంగా ఉద్యమిస్తున్నారని తెలిపారు. దస్‌పల్లా కుటుంబ సభ్యులు, కొనుగోలుదారులు భూముల అభివృద్ధి కోసం అస్యూర్ డెవలపర్స్‌తో ఇష్టపూర్వకంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారని, ఎవరి ఒత్తిడీ లేదని స్పష్టంచేశారు. దస్‌పల్లా కుటుంబానికి, కొనుగోలుదారులకు ఏ రాజకీయ పార్టీతోనూ, విజయసాయిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులతో ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవని తెలిపారు. తమలో ఎవరినీ రాజకీయ నాయకులు సంప్రదించలేదని స్పష్టం చేశారు.

సైకోలా అయ్యన్న తీరు

- వైఎస్సార్ కుటుంబాన్ని దూషిస్తే సహించం: డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు
- తప్పు చేయకుంటే సీఐడీ విచారణను ఎదుర్కోవాలి



దేవరాపల్లి: టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు సైకో చేష్టలు మానుకుని నోరు అదుపులో పెట్టుకోవాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సూచించారు. వైఎస్సార్ కుటుంబంపై పిచ్చి ప్రేలాపనలను సహించబోమని హెచ్చరించారు. తారువలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ కుటుంబ సభ్యులపై ఐ టీడీపీ ద్వారా దుష్ప్రచారానికి పాల్పడటంపై సీఐడీ అధికారులు చింతకాయల విజయ్‌కు 41 ఏ నోటీస్ ఇవ్వడానికి వెళ్తే అయ్యన్న అనుచిత వాఖ్యలు చేయటాన్ని ఖండించారు. తప్పు చేయకుంటే సీఐడీ విచారణను ఎదుర్కోవాలన్నారు. నర్సీపట్నంలో యువకుడి చేతిలో ఓటమి చెందడంతో మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

ఇంటింటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్ద ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరువేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.


తిరుపతి జిల్లా బసవయ్యపాలెంలో సంక్షేమ పథకాల గురించి స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


శ్రీ సత్యసాయి జిల్లా జానకంపల్లిలో మహిళకు సంక్షేమ లబ్ధి గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


ఎన్టీఆర్ జిల్లా వేదాద్రిలో గడప గడపకు మన ప్రభుత్వంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను


అనకాపల్లి జిల్లా నాతవరం మండలం ములగపూడిలో పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్


ఏలూరు జిల్లా మండవల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు


శ్రీకాకుళం జిల్లా గిరిశిఖర గ్రామం గూడకు కాలినడకన వెళ్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి


నెల్లూరు జిల్లా దగదర్తి మండలం ఉలవపాళ్లలో మహిళకు కరపత్రం అందిస్తున్న కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

క్లుప్తంగా

కొనసాగుతున్న ఆవర్తనం

రానున్న మూడు రోజులు వానలు

సాక్షి, విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కోస్తాంధ్ర తీరంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న మూడ్రోజులు ఈ ప్రాంతంలో కొన్ని చోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది. అదే సమయంలో కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. మరోవైపు.. కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు సంభవిస్తాయని తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రెండు మూడ్రోజుల నుంచి రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక ఆదివారం కాకినాడ జిల్లా పత్తిపాడులో అత్యధికంగా 8.7 సెం.మీల వర్షపాతం నమోదైంది. చోడవరం 5.7, కొయ్యూరు 5, విశాఖ 4.6, వేపాడ 4.3, లావేరు 4.2, గూడూరు (కృష్ణా) 3.9, పైడిభీమవరంలలో 3 సెం.మీల చొప్పున వర్షం కురిసింది.

పశుపోషణకు అధిక ప్రాధాన్యం


మంత్రి వేణుగోపాలకృష్ణను సన్మానిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పశుపోషణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు ఆదివారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకే పరిమితమైన ఎడ్ల బల ప్రదర్శన పోటీలను తణుకు పట్టణంలో మంత్రి కారుమూరి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పశుపోషణతోపాటు పశు సంరక్షణకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను కారుమూరి ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

ఉప్పెనలా.. ఉక్కు సత్యాగ్రహ పాదయాత్ర


పాదయాత్రలో మాట్లాడుతున్న అమర్‌జిత్ కౌర్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్రం తీరును నిరసిస్తూ సాగరతీరంలో చేపట్టిన ఉక్కు సత్యాగ్రహ పాదయాత్రకు కార్మికులు ఉప్పెనలా కదలివచ్చారు. ఒకవైపు భారీగా వర్షం పడుతున్నా లెక్కచేయకుండా.. కార్మికులు పాదయాత్ర కొనసాగించారు. దీనికి అన్ని పార్టీలు మద్దతు పలికాయి. కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 600 రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో గాంధీ జయంతి సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో ఉక్కు సత్యాగ్రహ పాదయాత్ర జరిగింది. వైఎస్సార్ విగ్రహం నుంచి ఆర్కే బీచ్ వరకు సాగిన ఈ పాదయాత్రలో ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆరోపించారు. లాభాల్లో నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే నష్టాలు వస్తున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని.. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దీనిని అందరూ తిప్పికొట్టాలన్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

నన్నారికి నల్లమల బ్రాండ్!

- ఆదివాసీ గిరిజనుల అమ్ముల పొదిలో మరో బ్రాండ్ ఇమేజ్
- ఇప్పటికే అరకు కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతి
- నల్లమల బ్రాండ్‌తో 'నన్నారి' విక్రయాలు.. ఈ షర్బత్‌కు మార్కెట్‌లో డిమాండ్
- దీని సాగుకు శ్రీశైలం ఐటీడీఏ ప్రత్యేక కార్యాచరణ
- చెంచుల జీవనోపాధికి ఊతమిచ్చేలా శుద్ధి కేంద్రాలు
- ఏపీలోని మూడు జిల్లాల్లోని 13 కేంద్రాల్లో విక్రయాలు

(నల్లమల నుంచి సాక్షి ప్రతినిధి ఐ.ఉమామహేశ్వరరావు)


నన్నారి మొక్కల సాగును పరిశీలిస్తున్న పీవో రవీంద్రరెడ్డి


నన్నారితో షర్బత్ తయారీ

అరకు కాఫీకి అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న ఆదివాసీ గిరిజనులు ఇప్పుడు నన్నారి (షర్బత్ తయారీకి ఉపయోగించేది)పై గురిపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇప్పుడు దీనికి బ్రాండ్ ఇమేజ్ కల్పించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా శ్రీశైలంలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) నేతృత్వంలో నన్నారి (సుగంధి) ఉత్పత్తికి ఊతమిస్తోంది. ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల్లోని నల్లమల అటవీ ప్రాంతంలో 171 గూడెంలలో నివసించే 27,857 మంది చెంచుల జీవనోపాధికి ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిజానికి అక్కడి చెంచులు నల్లమల అడవిపై ఆధారపడి సంచార జీవనం సాగిస్తుంటారు. వీరికి అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంచడమే కాకుండా ఆ భూముల్లో సాగు చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. చెంచులు వ్యవసాయ ఉత్పత్తులతోపాటు అటవీ ఫలసాయమైన నన్నారి, తేనె, ఉసిరి, కుంకుడు కాయలు, మాడపాకులు, ముష్టి గింజలు, చింతపండు వంటి వాటిని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కేంద్రాలకు మద్దతు ధరకు విక్రయించి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

నన్నారి ఉత్పత్తికి ఊతం..

ఇక నన్నారి చెట్ల సాగు, ఉత్పత్తి, విక్రయాలకు శ్రీశైలం ఐటీడీఏ అనేక చర్యలు చేపడుతోంది. కర్నూలు జిల్లా డి.వనిపెంట చెంచుగూడెంలో 20 మంది చెంచు రైతులు 20 ఎకరాల్లో గత మూడేళ్లుగా నన్నారి సాగుచేస్తున్నారు. మరో 12 మంది 30 ఎకరాల మామిడి తోటల్లోను అంతర పంటగా నన్నారి సాగుచేపట్టి సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఐటీడీఏ ప్రోత్సాహంతో అనేక చెంచు కుటుంబాలు ఇళ్ల ముంగిటే ఈ మొక్కల సాగుచేస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 2వేల కుటుంబాలు ఈ సాగుతో ఉపాధి పొందుతున్నాయి. మరో వంద ఎకరాల్లో సాగుకు ఐటీడీఏ అధికారులు కార్యాచరణ చేపట్టారు. నన్నారి గడ్డలు (ముడిసరుకు) కిలో రూ.450 నుంచి రూ.600 కొనుగోలు చేసి నన్నారి షర్బత్ తయారీకి వినియోగిస్తున్నారు.

మూడు జిల్లాల్లో 13 వికాస కేంద్రాలు

నిజానికి.. గిరిజనుల వద్ద వ్యాపారులు చౌకగా కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పద్ధతికి స్వస్తి పలికి గిరిజనులే మంచి ధరకు అమ్ముకునేలా అటవీ ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే నల్లమల బ్రాండ్ పేరుతో అటవీ ఉత్పత్తులను విక్రయించాలని సంకల్పించింది. మూడు జిల్లాల్లో 13 ప్రధానమంత్రి వన్‌ధన్ వికాస కేంద్రాలు (ప్రకాశం-5, నంద్యాల-6, పల్నాడు-2) కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఒక్కో కేంద్రంలో 15 గ్రూపులు (300 మంది సభ్యులు) చొప్పున మొత్తం 13 వికాస కేంద్రాల్లో 3,900 మంది సభ్యులకు అవకాశం కల్పించారు. వీటి ద్వారా నన్నారితోపాటు వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఫలసాయాన్ని గిరిజనులు విక్రయించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ కేంద్రాలను అనుసంధానిస్తూ దోర్నాలలో ఐదు ఎకరాల్లో ట్రైబల్ పార్కు ఏర్పాటుచేసి గిరిజనుల ఉత్పత్తులను విక్రయించనున్నారు.

నన్నారితో షర్బత్ తయారీ శిక్షణ

వేసవిలో దాహార్తిని తీర్చడంతోపాటు శక్తినిచ్చే నన్నారి షర్బత్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలోనే శ్రీశైలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రస్తుతం 10 కేంద్రాల్లో వెయ్యి మందికిపైగా చెంచులకు నన్నారి శుద్ధి, షర్బత్ తయారీపై శిక్షణనిచ్చారు. అడవి నుంచి సేకరించిన నన్నారి వేర్లను ప్రాసెసింగ్ చేస్తారు. శుద్ధిచేసిన ఒక కిలో నన్నారి గడ్డలతో నీరు, పంచదార, నిమ్మ ఉప్పు, ప్రిజర్వేటివ్, కొద్దిపాటి రంగుతో 25 లీటర్ల నన్నారి పానీయం తయారవుతుంది. లీటరు షర్బత్ తయారీకి రూ.వంద అయితే దాన్ని రూ.150కి విక్రయిస్తారు.

నల్లమల బ్రాండ్‌తో విక్రయాలు

చెంచులు సేకరించే నన్నారి, తేనె, వనమూలికలతోపాటు ఇతర అటవీ ఉత్పత్తులను బ్రాండ్ నల్లమల పేరుతో విక్రయించేలా శ్రీశైలం ఐటీడీఏ పాలక మండలి ఇటీవల తీర్మానించింది. ఇప్పటికే నన్నారి షర్బత్ తయారీపై యువతకు శిక్షణనిచ్చాం. నన్నారి దుంపల (వేర్లు) శుద్ధికోసం రూ.3 లక్షల చొప్పున రెండు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేస్తున్నాం. నన్నారి సాగును ప్రోత్సహించడంతోపాటు ఉద్యానవన సాగుకు ఊతమిస్తున్నాం. ఐదువేల మామిడి మొక్కలను పంపిణీ చేశాం. తిరుపతిలోని చీనీ, నిమ్మ పరిశోధన స్థానం నుంచి స్వీట్ ఆరంజ్ (రంగపూరి రకం) 3వేల మొక్కలను పంపిణీ చేశాం. 750 ఎకరాల్లో చెంచులు మిరప పండిస్తుండటంతో చిల్లీపౌడర్ (కారం) తయారుచేసే కేంద్రాన్ని దోర్నాలలో ఏర్పాటుచేస్తున్నాం. యర్రగొండపాలెం, సున్నిపెంటలో వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్) ద్వారా యువతకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌తోపాటు ఫుడ్, గూడ్స్ ప్యాకింగ్‌పైన శిక్షణనిచ్చాం. చెంచుల అటవీ ఉత్పత్తుల ప్రాసెస్ చేసి విక్రయించేందుకు మరిన్ని యూనిట్ల ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టాం.

– బి. రవీంద్రరెడ్డి, ప్రాజెక్టు అధికారి, శ్రీశైలం ఐటీడీఏ

టీఆర్‌ఎస్సే ఇక బీఆర్‌ఎస్!

• తెలంగాణ

5న తెలంగాణ భవన్ వేదికగా కేసీఆర్ కొత్త జాతీయ పార్టీపై ప్రకటన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమితి ఇక భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెందుతోంది. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 5న మధ్యాహ్నం ఒంటి గంటా 19 నిమిషాలకు తెలంగాణ భవన్ వేదికగా కొత్త జాతీయ పార్టీ పేరును టీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రకటించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక భేటీలో ఈ మేరకు తుది నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. రాష్ట్ర మంత్రులతోపాటు టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 33 జిల్లాల అధ్యక్షులు, ఇతర కీలక నేతలతో కలిసి భోజనం చేసిన సీఎం కేసీఆర్.. అనంతరం వారితో సమావేశమయ్యారు. సుమారు గంటన్నర పాటు సాగిన ఈ భేటీలో చాలా వరకు జాతీయ రాజకీయాలు, బీజేపీ పాలన తీరు, కాంగ్రెస్ పరిస్థితి, కొత్త జాతీయ పార్టీ ఏర్పాటుకు వస్తున్న స్పందన తదితరాలపై మాట్లాడినట్టు తెలిసింది. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రావాలంటూ పలువురు మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆహ్వానించినట్టు సమాచారం.

దసరా రోజున విస్తృతస్థాయి సమావేశం

కొత్త జాతీయ పార్టీ ఏర్పాటుపై కేసీఆర్ కీలక ప్రకటన చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 5న తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ల, జిల్లా పరిషత్, డీసీసీబీ, డీసీఎంఎస్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లను ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గం, 33 జిల్లాల అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులనూ కలుపుకొని మొత్తం 283 మంది ప్రతినిధులు విస్తృతస్థాయి భేటీలో పాల్గొననున్నారు. తెలంగాణ భవన్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుండగా.. నిర్ణయించిన ముహూర్తానికి టీఆర్‌ఎస్ కొత్త జాతీయ పార్టీగా మారుతున్నట్టుగా సీఎం కేసీఆర్ ప్రకటన చేస్తారు.

డిసెంబర్‌లో.. ఢిల్లీ వేదికగా..

ఈ ఏడాది డిసెంబర్ 9న దేశ రాజధాని ఢిల్లీ వేదికగా కొత్త జాతీయ పార్టీని కేసీఆర్ పూర్తిస్థాయిలో ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఢిల్లీలో భారీ ఎత్తున ఆవిర్భావ సభ ఏర్పాటు చేసి.. కొత్త జాతీయ పార్టీతో కలిసి వచ్చే నేతలు, జాతీయ స్థాయిలో భావ సారూప్య పార్టీలకు చెందిన నేతలను ఆహ్వానిస్తారు. ఢిల్లీ బహిరంగ సభ డిసెంబర్ 9నే ఉంటుందా, లేక మరో తేదీన జరుగుతుందా అన్నదానిపై ఈ నెల 5న తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో స్పష్టత వస్తుందని టీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం టీఆర్‌ఎస్ పార్టీకి ఉన్న గులాబీ రంగు జెండా, చిహ్నం స్వల్ప మార్పులతో కొత్త జాతీయ పార్టీ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటయ్యే జాతీయ పార్టీ పేరు భారత రాష్ట్ర సమితిగా దాదాపుగా ఖరారైనా.. ఈ నెల 5వరకు సస్పెన్స్ కొనసాగే అవకాశముంది. కొత్త పార్టీ విధి విధానాలు, తదుపరి కార్యాచరణపై దసరా రోజు జరిగే సమావేశంలో కేసీఆర్ స్పష్టత ఇవ్వనున్నారు.

ప్రజలకు అందుబాటు ధరల్లో విద్యుత్

- అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


'నిరంతర విద్యుత్' ప్రచార చిత్రాన్ని విడుదల చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజలకు, భవిష్యత్ తరాలకు అందుబాటు ధరలో విద్యుత్ పుష్కలంగా ఉండేలా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం ఇంధనశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి వేగవంతమవడంతో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగిందని, ఇంకా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. 2017-18లో 50,077 మిలియన్ యూనిట్లు ఉన్న డిమాండ్ 2021-22లో 60,943 మిలియన్ యూనిట్లకు (21.6 శాతం) పెరిగిందని తెలిపారు. వచ్చే మార్చి నాటికి డిమాండ్ రోజుకు 250 మిలియన్ యూనిట్లకు చేరుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (కృష్ణపట్నం) స్టేజ్-2 (1X800 మెగావాట్లు) ఈ నెలాఖరుకు, డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లో స్టేజి-5 (1X800 మెగావాట్లు) వచ్చే మార్చి నాటికి ప్రారంభించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు.

పునరుత్పాదక విద్యుత్‌కు పెద్దపీట

డిమాండ్‌ను అందుకోవడంతోపాటు విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్రంలో ఉన్న పునరుత్పాదక ఇంధన వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు ఢోకా లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మజనార్దనరెడ్డి, నెడ్‌క్యాప్ ఎండీ ఎస్.రమణారెడ్డి, ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పీఎఫ్ఐపై నిషేధం సరికాదు

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్

సాక్షి, హైదరాబాద్: పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ), దాని ఎనిమిది అనుబంధ సంస్థలపై కేంద్రం నిషేధాన్ని సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ ఖండించింది. బీజేపీ ప్రభుత్వ ఈ వైఖరిని వ్యతిరేకించాలని అన్ని ప్రజాస్వామిక, ప్రజా సంఘాలను కోరింది. పీఎఫ్ఐపై ఐదేళ్లపాటు నిషేధం నిర్ణయం క్రూరమైనదని, ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేదని ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ హిందుత్వ ఎజెండాలో భాగంగానే పీఎఫ్ఐపై నిషేధం విధించారన్నారు. గతనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఎన్ఐఏ దేశంలోని 11 రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి, 100 మందికి పైగా అరెస్టు చేయడాన్ని, 250 మందికిపైగా పీఎఫ్ఐ కార్యకర్తలను అదుపులోకి తీసుకోవడాన్ని ఖండించారు. ముస్లిం సమాజాన్ని అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి ఇస్లామిక్ ఫోబియా పట్టుకుందని, అందుకే దేశంలో ముస్లిం సమాజం పట్ల అత్యంత కర్కశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పీఎఫ్ఐ నిషేధం కూడా ఇందులో భాగమేనని, 'ఇస్లామిక్ టెర్రర్' పేరుతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తోందని అభయ్ ధ్వజమెత్తారు.

రైతుల ముసుగులో టీడీపీ దౌర్జన్యం

- వన్‌వేలో అమరావతి రైతుల పాదయాత్ర.. పోలీసులను తోసుకుంటూ సాగిన టీడీపీ శ్రేణులు
- ద్వారకా తిరుమలలో భక్తులు, స్థానికులు తీవ్ర అసహనం


ద్వారకాతిరుమలలో సీఐ వెంకటేశ్వరరావుతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ శ్రేణులు

ద్వారకాతిరుమల: వన్‌వే రహదారిలో పాదయాత్ర చేసేందుకు అనుమతిలేదని అన్నందుకు పోలీసులతో అమరావతి రైతుల ముసుగులో ఉన్న కొందరు టీడీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. అంతటితో ఆగకుండా దౌర్జన్యంగా పోలీసులను నెట్టుకుంటూ ముందుకెళ్లారు. ద్వారకా తిరుమలలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం ఉదయం ఏం జరిగిందంటే..


అమరావతి రైతుల పాదయాత్ర సెప్టెంబర్ 30న ద్వారకాతిరుమలకు చేరుకుంది. తిరిగి స్థానిక వైష్ణవి ఫంక్షన్ హాలు వద్ద ఆదివారం ఉదయం యాత్ర ప్రారంభమైంది. అయితే, రూట్ మ్యాప్ ప్రకారం వారు అంబేడ్కర్ సెంటర్ నుంచి ఉగాది మండపం, యాదవ కల్యాణ మండపం మీదుగా రాళ్లకుంట గ్రామానికి వెళ్లాల్సి ఉంది. అయితే, స్థానిక టీడీపీ నేతలు కొందరు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి, అంబేడ్కర్ సెంటర్ నుంచి వన్‌వే రహదారి (బైపాస్) మీదుగా, గుడిసెంటర్ వైపునకు పాదయాత్ర వెళ్లాలని పట్టుబట్టారు. అయితే, ఆదివారం కావడంతో క్షేత్ర రహదారులు అప్పటికే భక్తుల వాహనాలతో నిండిపోయాయి. దీంతో వన్‌వే మార్గం గుండా పాదయాత్రకు అనుమతిలేదని భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్సై టి.సుధీర్ వారికి సూచించారు. అయినా టీడీపీ శ్రేణులు వినకుండా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో కొందరు టీడీపీ నేతలు రోడ్డుపై బైఠాయించి హైడ్రామాను సృష్టించారు. ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తింది. ఎంతచెప్పినా వినకుండా పోలీసులను తోసుకుంటూ వారు ముందుకు సాగారు.

టీడీపీ శ్రేణుల తీరుపై అసహనం

టీడీపీ నేతల తీరుతో అక్కడున్న భక్తులు, స్థానికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తంచేశారు. అమరావతి రైతుల పేరుతో చేస్తున్న పాదయాత్ర లగ్జరీ యాత్రగా ఉందని అభివర్ణించారు. యాత్ర వెంట వెళ్తున్న లగ్జరీ బస్సు, మొబైల్ టాయిలెట్లు, మంచాలు, పరుపులు వంటి వాటిని చూసి ఇది పాదయాత్రా? అని అంతా ముక్కున వేలేసుకున్నారు. మరోవైపు.. ఈ పాదయాత్ర కోసం మండల టీడీపీ నేతలు దాదాపు రూ.16 లక్షలకు పైగా ఖర్చుచేసినట్లు సమాచారం.

మౌలికవసతుల కల్పనలో రికార్డు వ్యయం

- టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.1,021 కోట్లు ఖర్చుపెట్టిన ఏపీఐఐసీ
- వైఎస్సార్‌సీపీ మూడేళ్ల పాలనలో రూ.1,058 కోట్లు
- రాష్ట్ర విభజన తర్వాత 2021-22లో అత్యధికంగా రూ.348.71 కోట్లు వ్యయం
- కొత్తగా 51 పార్కుల అభివృద్ధి కూడా..



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (ఏపీఐఐసీ) ఇంజనీరింగ్ పనుల్లో రికార్డులు సృష్టిస్తోంది. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు ఎప్పుడూ చేయని విధంగా 2021-22లో ఈ పనుల కోసం రూ.348.71 కోట్లు వ్యయం చేసింది. 2014 నుంచి 2022 వరకు రూ.2,079 కోట్లు ఖర్చుచేస్తే అందులో టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.1,021 కోట్లు ఖర్చుచేశారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ సర్కారు మూడేళ్లలో రూ.1,058 కోట్లు ఖర్చుచేశారు. అంతేకాక.. ఈ సమయంలో మొత్తం 51 పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసినట్లు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక పార్కుల్లో మౌలిక వసతులు కల్పించాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కృషిచేస్తున్నామని, అందులో భాగంగా ఇంజనీరింగ్ పనులపై అత్యధికంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. కోవిడ్‌వల్ల రెండేళ్లుగా అనుకున్న లక్ష్యాలను పూర్తిగా చేరుకోలేకపోయామని, ఈ ఏడాది గతేడాది కంటే అత్యధికంగా వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే కృష్ణపట్నం వద్ద చెన్నై-బెంగళూరు కారిడార్‌లో భాగంగా క్రిస్‌సిటీ పేరుతో 2,500 ఎకరాల్లో రూ.1,500 కోట్లతో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

'రెడీ టు బిల్డ్'పై ప్రత్యేక దృష్టి

ఇక తక్షణంఉత్పత్తి ప్రారంభించేలా రెడీ టు బిల్డ్ ఫ్యాక్టరీలకు డిమాండ్ పెరిగిందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఏపీఐఐసీ వీటి నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు గోవిందరెడ్డి తెలిపారు. కొప్పర్తి, తిరుపతి, పెద్దాపురం, విజయవాడ వంటి చోట్ల 20కిపైగా రెడీ టు బిల్డ్ ఫ్యాక్టరీలను నిర్మిస్తున్నామని, వీటివల్ల 4.80 లక్షల చదరపు అడుగులు అందుబాటులోకి వస్తోందన్నారు. కేవలం మౌలిక వసతుల కల్పనలోనే కాకుండా ఆదాయ ఆర్జనలో కూడా ఏపీఐఐసీ రికార్డులు సృష్టిస్తోంది. గడిచిన ఏడేళ్లుగా చూస్తే ఏపీఐఐసీ సగటు వార్షిక ఆదాయం రూ.590 కోట్లుగా ఉంటే 2021-22లో రూ.656 కోట్లు ఆర్జించినట్లు తెలిపారు. 50 ఏళ్ల క్రితం రూ.20 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన ఏపీఐఐసీ ఇప్పుడు రూ.వేల కోట్ల ప్రాజెక్టులను చేపడుతోందని.. ఇదే స్ఫూర్తితో రానున్న కాలంలో మరిన్ని ప్రాజెక్టులను అభివృద్ధిచేస్తామన్న ధీమాను ఆయన వ్యక్తంచేశారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,017	57,427
నిఫ్టీ ▲	276	17,094

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	10,576	▽	162
డోజోన్స్	28,726	▽	500
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,894	▲	12
డాక్స్	12,114	▲	139
షాంఘై	3,024	▽	17
నికాయ్	25,937	▽	485

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

సొంతింటికి 'జంట' దారి..!



సొంతింట్లో ఉన్నంత సంతృప్తి అద్దె ఇంట్లో లభించదు. కిరాయి ఇచ్చినంత మాత్రాన అన్ని హక్కులూ రావు. గోప్యత, ఇంటి వినియోగంలో స్వేచ్ఛ, బంధువుల రాకపోకలు ఇలా చెప్పుకుంటూ పోతే.. అద్దె ఇళ్ల విషయంలో ఎన్నో ప్రతికూల అంశాలున్నాయి. అందుకే నేటితరం పెళ్లికి ముందే లేదంటే పెళ్లయిన కొన్నాళ్లకే సొంతింటి వైపు అడుగులు వేస్తున్నారు. ఒకప్పుడు సొంతిల్లు అన్నది ఓ పెద్ద కల. కానీ, నేడు విశాలమైన (కనీస అవసరాల మేరకు) ఇల్లు అన్నది కలగా మారిందని చెప్పుకోవాల్సిందే. చదువుకునే పిల్లలు ఏకాంతం కోరుకుంటున్నారు. ఉద్యోగాలు చేసే దంపతులు వర్క్ ఫ్రమ్ హోమ్ కోసం ఇంట్లోనే తమకంటూ ప్రైవేటు స్థలం ఉండాలని భావిస్తున్నారు. కనుక మారుతున్న అవసరాల నేపథ్యంలో సొంతింటికి ప్లాన్ చేసుకునే వారు కనీసం టూ లేదా త్రీ బెడ్‌రూమ్ ఉండాలంటున్నారు..! ఇల్లు విశాలంగా ఉండాలంటే భారీ మొత్తమే సమకూర్చుకోవాలి. అటువంటి పరిస్థితుల్లో దంపతులు ఇద్దరూ కలసి ఉమ్మడిగా గృహ రుణం (జాయింట్ హోమ్ లోన్) తీసుకోవడం మంచి ఆప్షన్ అవుతుంది.
అయితే, దీనికి ఎలా సిద్ధం కావాలి..
నిబంధనలు ఎలా ఉంటాయి..
వంటివన్నీ వివరించే
కథనం ఇది..

ఉమ్మడిగా దరఖాస్తు చేసుకుంటే అధిక రుణం • చెల్లింపుల భారాన్ని పంచుకోవచ్చు
ఒకరికి ఇబ్బంది వచ్చినా, మరొకరు ఆదుకోవచ్చు • పన్ను ప్రయోజనాలకు ఇద్దరూ అర్హులే..

చిన్న కుటుంబం అనుకున్నా భార్యా భర్త, ఇద్దరు పిల్లలు ఉంటున్నారు. వీరికి తోడుగా తల్లి దండ్రులు కూడా ఉంటే ఇల్లు కాస్త విశాలంగా ఉండాల్సిందే కదా. శివ, అపూర్వ దంపతులకు సైతం ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివ తల్లిదండ్రులు అతడితోనే ఉంటున్నారు. శివ పెళ్లయిన కొత్తలో తన కున్న బడ్జెట్‌తో సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ కొనుగోలు చేశాడు. ఇటీవల కరోనా కాలంలో ఇంటి నుంచి పని చేసుకోవాల్సి వచ్చింది. కానీ, అందరూ ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితుల్లో అతడికి ఏకాంతంతో కూడిన కాస్తంత స్థలం కరువైంది. అందుకనే అతడు త్రిబుల్ బెడ్ రూమ్ ఇల్లు సమకూర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇప్పుడున్న ఒక్క పడకగది ఫ్లాట్ విక్రయించగా వచ్చే మొత్తాన్ని డౌన్ పేమెంట్ కింద జమ చేసి, మిగతా మొత్తాన్ని రుణం ద్వారా సమకూర్చుకోవాలన్నది అతడి ప్రణాళిక. ఇలా కోరుకునే వారు మన చుట్టూ ఎంతో మంది ఉన్నారు. నగరంలో త్రిబుల్ బెడ్ రూమ్ అంటే భారీ పెట్టుబడి అవసరపడుతుంది. కనుక జాయింట్ హోమ్‌లోన్ ఆప్షన్‌ను పరిశీలించొచ్చు. దీనికి ముందు జాయింట్ హోమ్‌లోని సాధక, బాధకాల గురించి అవగాహన కల్పించుకుంటే, సరైన నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుంది.

నిబంధనలు - అర్హతలు




చెల్లించే సామర్థ్యం ఉంటే ఒక్కరి పేరుమీదనే గృహ రుణాన్ని తీసుకోవచ్చు. కానీ, దంపతులు కలసి తీసుకోవడం వల్ల కొన్ని అదనపు ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీలైతే జాయింట్‌గానే చాలా మంది గృహ రుణానికి మొగ్గు చూపుతుంటారు. చాలా బ్యాంకులు సహ రుణ గ్రహీత కింద కుటుంబ సభ్యులనే అనుమతిస్తున్నాయి. ఒక వ్యక్తి తన తండ్రితో లేదంటే భార్యతో కలసి ఉమ్మడిగా రుణం తీసుకోవచ్చు. అలాగే, తండ్రి కూడా తన కుమారుడు, పెళ్లి కాని కుమార్తెతో కలసి రుణం పొందొచ్చు. ఇక ఇద్దరు సోదరీ మణులు, ఒక సోదరి ఒక సోదరుడు, వివాహిత అయిన కుమార్తెతో కలసి తండ్రి, స్నేహితులు ఉమ్మడిగా గృహ రుణం పొందడానికి అర్హత లేదు. జాయింట్ హోమ్ లోన్‌లో ప్రధాన రుణ గ్రహీత, సహ రుణ గ్రహీత ఉంటారు. సహ రుణ గ్రహీతలు రెండు రకాలు. ఎంత రుణం మంజూరు చేయాలన్న అర్హత కోసం సహ రుణ గ్రహీత ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడం ఇందులో ఒకటి. సహ రుణ గ్రహీత ఆదాయాన్ని సైతం రుణ అర్హతకు పరిగణనలోకి తీసుకోవడం రెండో రకం. ఉదాహరణకు రిటైర్ అయిన వారికి పెన్షన్ మినహా వేరే ఆదాయం ఉండదు. కనుక తల్లిదండ్రుల్లో ఒకరు ఆదాయం లేని సహ రుణ దరఖాస్తుదారుగా చేరొచ్చు. రుణానికి ఇద్దరు దరఖాస్తు చేసుకుంటుంటే, ఆ ప్రాపర్టీకి ఇద్దరూ సహ యజమానులుగా ఉండాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఒక ప్రాపర్టీకి భార్య, భర్త సహ యజమానులుగా ఉండేట్టు అయితే అప్పుడు బ్యాంకులు ఇద్దరి పేరిట జాయింట్ హోమ్ లోన్ ఇవ్వడానికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కనుక ఈ అంశాలను గుర్తు పెట్టుకోవాలి. ఇక జాయింట్ హోమ్ లోన్ అంటే ఇద్దరే తీసుకోవాలని లేదు. ముగ్గురు కూడా కలసి తీసుకోవచ్చు.

ఉమ్మడిగా రుణం తీసుకుంటే ఎక్కువ మొత్తమే లభిస్తుంది. మంచి ఖరీదైన ఇంటికి ప్లాన్ చేసుకునే దంపతులు ఇద్దరూ వేతన జీవులు లేదా సంపాదనాపరులు అయితే ఇక బ్యాంకులు పిలిచి మరీ రుణం ఇస్తాయి. ఇద్దరి ఆదాయాన్ని అర్హత కింద లెక్కలోకి తీసుకుంటాయి. కనుక అధిక మొత్తాన్ని రుణం రూపంలో అందుకోవచ్చు. దీంతో తమ కలల ఇంటిని సొంతం చేసుకోవచ్చు. ఒక్కరి పేరు మీద రుణంతో పోలిస్తే ఇద్దరి పేరిట రుణం ఇవ్వడానికి బ్యాంకులు ఎక్కువ మొగ్గు చూపుతాయి. ఎందుకంటే ఒకరి నుంచి కాకపోయినా, మరొకరి నుంచి అయినా రికవరీ చేసుకోవచ్చన్న ధీమాయే కారణం. పైగా ఇలా జాయింట్ హోమ్‌లోన్‌లో ఎగవేతలు

ప్రయోజనాలు ఎన్నో..

చాలా తక్కువ. ఒకరికి ఇబ్బందులు వచ్చినా మరొకరు చెల్లింపుల బాధ్యతను తీసుకోగలరు. అందుకే బ్యాంకులకు, రుణ గ్రహీతలకు ఇది అనుకూల ఆప్షన్ అవుతుంది. పెద్ద మొత్తం వస్తుండడంతో చెల్లించే విషయంలో ఇబ్బందులు పడాల్సిన అవసరం ఏర్పడదు. పైగా ఇంటి సౌకర్యాల విషయంలోనూ రాజీ పడాల్సిన అవసరం ఉండదు. ఇక ఉమ్మడిగా గృహ రుణం తీసుకున్నా ఆదాయపన్ను ప్రయోజనాలకు ఢోకా ఉండదు. ఎక్కువ మందికి జాయింట్ హోమ్ లోన్ విషయంలో ఎదురయ్యే సందేహం ఇదే. కనుక ఈ సందేహం అక్కర్లేదు. విడిగా ఎవరికి వారు ఆదాయపన్ను ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవాలని అనుకుంటే.. ముందుగానే ఈఎంఐలో ఎవరి వాటా ఎంతో తేల్చుకోవాలి. నిర్ణయించుకున్న ప్రకారం ప్రతి నెలా ఈఎంఐను షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. పైగా జాయింట్ హోమ్ లోన్ విషయంలో పన్ను పరంగా ఓ ప్రత్యేక వెసులుబాటు కూడా ఉందని చెప్పుకోవచ్చు. ఎలా అంటే, విడిగా ఒక్కరే గృహ రుణం తీసుకుంటే, అసలు, వడ్డీ భాగాలకు ఆదాయపన్ను ప్రయోజనం పూర్తిగా పొందలేని పరిస్థితి ఉండొచ్చు. అటువంటప్పుడు ఇరువురు కలసి తీసుకోవడం వల్ల మిగులు ప్రయోజనాన్ని వేరొకరు సొంతం చేసుకోవచ్చు. ఇందుకు అనుగుణంగా ఈఎంఐ వాటా మార్చుకుంటే సరిపోతుంది. ఇంటి రుణానికి ఒక ఆర్థిక సంవత్సరంలో చేసే వడ్డీ చెల్లింపులు రూ.2 లక్షల వరకు సెక్షన్ 24 కింద పన్ను చెల్లించక్కర్లేదు. ఇక అసలుకు చేసే చెల్లింపులు రూ.1.5 లక్షలను సెక్షన్ 80సీ కింద మినహాయించి చూపించుకోవచ్చు. ఈ పరిమితి ఎవరికి వారికే విడిగా అమలవుతుంది. చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు మహిళా రుణ గ్రహీతలకు రుణ రేటులో కొంత తగ్గింపును ఇస్తున్నాయి. ఇందుకోసం ఇద్దరు దరఖాస్తుదారుల్లో ఒకరు మహిళ అయి ఉండాలి. ప్రధాన రుణ దరఖాస్తుదారుగా లేదా సహ రుణ దరఖాస్తుదారుగా ఉండొచ్చు.



ప్రతికూలతలూ ఉన్నాయ్..

- ఇద్దరు సహ రుణ గ్రహీతల్లో ఒకరికి ఆదాయం ఉన్నట్టుండి ఆగిపోతే, మరొకరు ఆ బాధ్యత తీసుకోవచ్చు. ఇది ఒక విధంగా అనుకూలం, మరో విధంగా ప్రతికూలం అని చెప్పుకోవాలి. ఎందుకంటే ఒక్కరే తీసుకుని, ఆదాయం ఆగిపోతే డిఫాల్ట్ అవుతారు. ఈఎంఐ చెల్లించలేకపోతే రుణ చరిత్రపై నల్లటి మచ్చ పడుతుంది. ఉమ్మడిగా తీసుకుంటే ఈ ఇబ్బంది రాకుండా రెండో వారు చెల్లింపులతో ఆదుకుంటారు. దీనివల్ల ఒక్కరిపైనే మొత్తం ఈఎంఐ చెల్లింపుల భారం పడుతుందని మర్చిపోవద్దు. కాకపోతే ఇది మరీ పెద్ద ప్రతికూలత కాదనుకోండి. దురదృష్టవశాత్తూ ఇద్దరిలో ఒకరు శాశ్వతంగా సంపాదించలేని పరిస్థితులు ఎదురైతే తప్ప.. జాయింట్ హోమ్ లోన్‌లో తాత్కాలిక ఆదాయ నష్టాలను ఒక్కరే భారం మోయడం ద్వారా అధిగమించొచ్చు. కాకపోతే ఇందుకు ముందుగానే సిద్ధపడాలి.
- రుణ గ్రహీతల మధ్య విభేదాలు, స్పర్థలు తలెత్తితే సమస్య ఎదురుకావచ్చు. అప్పుడు ఇద్దరిలో ఒకరు ఈఎంఐ చెల్లించేందుకు నిరాకరించొచ్చు. దీనివల్ల క్రెడిట్ హిస్టరీ దెబ్బతింటుంది. సిబిల్ స్కోర్ పడిపోతుంది. దీంతో భవిష్యత్తులో రుణం ఇచ్చేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ముందుకు రాకపోవచ్చు. రుణ చరిత్ర దెబ్బతినకూడదని అనుకుంటే, కష్టమైనా కానీ రెండో వ్యక్తి ఈఎంఐ భారాన్ని మోయాల్సి రావచ్చు. ఇలాంటి కేసులు తక్కువే ఉంటాయి. కీడెంచి మేలెంచమన్నట్టు.. ముందే ఈ విధమైన సమస్యలకు సన్నద్ధులు కావాలి. వీలైతే జాయింట్ హోమ్ లోన్ తీసుకునే సమయంలోనే ఒక అగ్రిమెంట్ రాసుకోవడం మంచిది.
- దంపతులు కలసి గృహ రుణం తీసుకున్నారు. ఆ తర్వాత ఏదైనా కారణంతో విడిపోవాల్సి వస్తే..? అప్పుడు మిగిలిన గృహ రుణాన్ని తీర్చాల్సిన బాధ్యత ఎవరిది? ప్రాపర్టీపై ఎవరి హక్కులు ఏ మేరకు? ఇలాంటి అంశాల్లో పక్కా స్పష్టత అవసరం. ఇందుకోసం ముందే న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలి. వారి సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవడం ఎందుకైనా మంచిది. మరొకరు ఈఎంఐ భారం మోసి, చివర్లో ఇద్దరూ పంచుకోవడమా? లేక అంతటితో ముగించడమా..? ఇలా చాలా అంశాల్లో స్పష్టత తీసుకోవాల్సి ఉంటుంది. ముందే ఆయా అంశాలకు వచ్చి, న్యాయపరమైన సలహా ప్రకారం నడుచుకోవడం మంచింది.
- ఇక సహ రుణ గ్రహీతల్లో ఒకరు ఏదైనా కారణంతో మరణించినట్టయితే అప్పుడు ఏం చేయాలో ముందే ఆలోచించుకోవాలి. మిగిలిన దరఖాస్తుదారులపై రుణ ఈఎంఐ భారం పడుతుంది. ఇలా జాయింట్ హోమ్ లోన్‌లో ఏ కారణం వల్ల ఈఎంఐ చెల్లించకపోతే తీవ్ర సమస్యే. రుణం ఇచ్చిన సంస్థ ఇంటిని జప్తు చేసి వేలానికి పెడుతుంది. ఇక దంపతులు కలసి గృహ రుణం తీసుకున్న తర్వాత, వారిలో ఒకరు మరణించినట్టయితే.. మిగిలిన జీవిత భాగస్వామి మొత్తం ప్రాపర్టీలో ఒకటో వంతు వాటాకే హక్కుదారులు అవుతారు. మరో రెండు భాగాల్లో మరణించిన జీవిత భాగస్వామి తల్లిదండ్రులకు ఒక భాగం, పిల్లలకు ఒక భాగం లభిస్తుంది. ఉమ్మడిగా రుణం తీసుకునే ముందు, భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చినా అధిగమించడంపై కార్యాచరణను ముందే సిద్ధం చేసుకోవాలి.



ఎడెల్వీస్ నుంచి 2 టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్స్

ఎడెల్వీస్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ కొత్తగా మరో రెండు టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్స్‌ను ఆవిష్కరించింది. క్రిసిల్ ఐబీఎక్స్ 50:50 గిల్ట్ ప్లస్ ఎస్‌డీఎల్ ఏప్రిల్ 2037 ఇండెక్స్ ఫండ్‌తో పాటు 2027 జూన్‌లో మెచ్యూర్ అయ్యే ఫండ్ వీటిలో ఉన్నాయి. ఈ తరహా ఫండ్స్‌లో 15 ఏళ్ల సుదీర్ఘ మెచ్యూరిటీతో ఫండ్‌ను ప్రవేశపెట్టడం దేశీయంగా ఇదే ప్రథమమని సంస్థ ఎండీ రాధికా గుప్తా తెలిపారు. ఈ ఫండ్‌లు ప్రధానంగా భారత ప్రభుత్వ బాండ్లు (ఐజీబీ), రాష్ట్ర అభివృద్ధి రుణాల్లో (ఎస్‌డీఎల్) ఇన్వెస్ట్ చేస్తాయి. 2037 ఇండెక్స్ ఫండ్ అక్టోబర్ 6న, 2027 ఇండెక్స్ ఫండ్ అక్టోబర్ 11న ముగుస్తాయి. రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు.

శామ్‌కో నుంచి టైమర్ ఎస్‌టీపీ

శామ్‌కో మ్యుచువల్ ఫండ్ .. టైమర్ ఎస్‌టీపీ పేరిట ఒక సిస్టమాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ)ని, ఓవర్‌నైట్ ఫండ్‌ను ఆవిష్కరించింది. టైమర్‌ఎస్‌టీపీని వారంవారీ, నెలవారీ, త్రైమాసికాలవారీగా కనీసం రూ. 25,000 నుంచి ప్రారంభించవచ్చు. తాము సొంతంగా తయారు చేసిన ఈక్విటీ మార్జిన్ ఆఫ్ సేఫ్టీ ఇండెక్స్ (EMOSI) ఇండికేటర్ ఆధారంగా ఇది పని చేస్తుందని కంపెనీ సీఐవో ఉమేష్ కుమార్ మెహతా తెలిపారు. మార్కెట్లు గరిష్ట, కనిష్ట స్థాయుల్లో ఉన్నప్పుడు తగు రీతిలో ఇన్వెస్ట్ చేసేందుకు ఇది ఉపయోగపడగలదని పేర్కొన్నారు. మరోవైపు, ఓవర్‌నైట్ ఫండ్ ఎన్‌ఎఫ్‌వో (న్యూ ఫండ్ ఆఫర్) అక్టోబర్ 4న ప్రారంభమై 6న ముగుస్తుంది. కనీసం రూ. 5,000 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

దివాలా అంచున స్విస్ బ్యాంక్?

2008లో ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్థిక సంక్షోభానికి ముసలం బ్యాంకింగ్ రంగంలోనే మొదలైన సంగతి గుర్తుండే ఉంటుంది. అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ లేమాన్ బ్రదర్స్ దివాలా తీయడంతో స్టాక్ మార్కెట్లు పేక మేడల్లా కుప్పకూలాయి. ఇప్పుడు సరిగ్గా మళ్లీ అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగానికి అలాంటి షాక్ తగలబోతోందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అనేక సమస్యలతో సతమతమవుతున్న స్విట్జర్లాండ్ బ్యాంకింగ్ దిగ్గజం క్రెడిట్ స్విస్... క్లిష్ట పరిస్థితుల్లో ఉందంటూ స్వయంగా దాని సీఈఓ వెల్లడించడంతో దివాలా తీయొచ్చంటూ గగ్గోలు మొదలైంది.

- 'క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాం': క్రెడిట్ స్విస్ సీఈఓ
- సిబ్బందికి రాసిన లేఖలో వెల్లడి
- బ్యాంక్ కార్యకలాపాలు పటిష్టమేనంటూ భరోసా
- షేరు పతనం చూసి ఆందోళన చెందొద్దని ఊరడింపు
- పునర్‌వ్యవస్థీకరణతో గాడిలో పడతామని ప్రకటన
- ఇది 'లేమాన్ 2.0' కాబోతోందంటూ ఊహాగానాలు
- నేడు ప్రపంచ మార్కెట్ల స్పందనపై ఉత్కంఠ



న్యూయార్క్: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం క్రెడిట్ స్విస్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు సంస్థ సీఈవో ఉల్రిచ్ కోర్నర్ పేర్కొన్నారు. దీంతో తాజా పునర్‌వ్యవస్థీకరణ చర్యలకు తెరతీయనున్నట్లు సిబ్బందికి రాసిన లేఖలో వెల్లడించారు. తద్వారా తగిన చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే బ్యాంక్ పటిష్టంగానే ఉన్నట్లు స్పష్టం చేశారు. బ్యాంకు షేరు పతనాన్ని చూసి కలత చెందొద్దని కూడా సిబ్బందికి సూచించారు. పటిష్ట స్థాయిలో మూలధన బేస్‌తోపాటు లిక్విడిటీ కూడా బాగానే ఉందని సీఈవో వివరించారు. అయితే, ఒకపక్క బ్యాంకు షేరు రోజుకో ఆల్‌టైమ్ కనిష్టాన్ని తాకుతుండటం... దివాలా వదంతుల నేపథ్యంలో ఉల్రిచ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నెల (అక్టోబర్) 27న బ్యాంక్ చేపట్టనున్న వ్యూహాత్మక సమీక్ష ఫలితాలు వెలువడేవరకూ సిబ్బందికి ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందించేందుకు నిర్ణయించుకున్నట్లు సీఈవో లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. మీడియాలో ఊహాగానాలకు స్పందించకుండా క్లయింట్లకు సేవలందించడంపై దృష్టిపెట్టాలని కూడా తమ సిబ్బందికి ఉల్రిచ్ సూచించినట్లు సమాచారం. కాగా, బ్యాంకు ఈ నెల 27న మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేయనుంది.

మూడు ముక్కలు...

మూడేళ్లుగా వెలుగుచూస్తున్న రకరకాల స్కామ్‌లు... క్రెడిట్ స్విస్‌ను అతలాకుతం చేశాయి. మరోపక్క, యూరప్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం, ద్రవ్యోల్బణం సెగలు, వడ్డీరేట్ల పెంపు ప్రభావం కూడా బ్యాంకులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో క్రెడిట్ స్విస్ గ్రూపును మూడు సంస్థలుగా విడదీసేందుకు బోర్డు ప్రణాళికలు సిద్ధం చేసింది. లాభదాయకంగా ఉన్న యూనిట్లను విక్రయించాలనేది బ్యాంకు యోచన. ప్రతిపాదనల ప్రకారం అడ్వయిజరీ బిజినెస్, అధిక ఒత్తిడిలోగల ఆస్తుల (హైరిస్క్ రుణాల)తో బ్యాడ్ బ్యాంక్‌లను విడదీయనుంది. వీటిని మినహాయించగా మిగిలిన బిజినెస్‌లతో మరో సంస్థ ఏర్పాటు కానుంది. అయితే ఈ అంశాలపై క్రెడిట్ స్విస్ స్పందించకపోవడం గమనార్హం!

ఇదీ నేపథ్యం...

స్విట్జర్లాండ్‌లోని రెండో అతిపెద్ద బ్యాంక్ అయిన క్రెడిట్ స్విస్ గత మూడేళ్లలో రహస్య (స్పైయింగ్) కార్పొరేట్ కుంభకోణం, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ల మూసివేత, రికార్డ్ ట్రేడింగ్ నష్టాలు, న్యాయపరమైన వ్యాజ్యాల పరంపర వంటి పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. దీంతో బ్యాంక్ చైర్మన్ యాక్సెల్ లేమన్ వేసవిలో ఉల్రిచ్ కోర్నర్‌ను సీఈవోగా ఎంపిక చేసి బ్యాంకును గాడిలోపెట్టే బాధ్యతలు అప్పగించారు. బ్యాంక్ నిర్వహణలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టేందుకు అనుమతించారు. కాగా.. ఈ నెల మొదట్లో వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా 5,000 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి.

ఇన్వెస్టర్లలో వణుకు..!

గత కొద్ది నెలలుగా క్రెడిట్ స్విస్ ఎదుర్కొంటున్న సవాళ్లతో బ్యాంకు షేరు కుప్పకూలుతూ వస్తోంది. ఈ ఏడాది ఆరంభంలో 9 డాలర్లుగా ఉన్న షేరు ధర తాజాగా సరికొత్త ఆల్‌టైమ్ కనిష్టానికి (3.9 డాలర్లు) దిగజారింది. మార్కెట్ విలువ 10 బిలియన్ డాలర్లకు పడిపోయింది. కాగా, సీఈఓ తాజాగా చేసిన వ్యాఖ్యలతో బ్యాంక్ దివాలా తీయనుందంటూ ట్విటర్‌లో మారుమోగుతోంది. అమెరికాతో సహా ప్రపంచ వ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను ఎడాపెడా పెంచడంతో మాంద్యం భయాలు వెంటాడుతున్న తరుణంలో క్రెడిట్ స్విస్ దివాలా వార్తలు ఇన్వెస్టర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇదే జరిగితే మార్కెట్ సెంటిమెంట్ మరింత బలహీనపడొచ్చనేది విశ్లేషకుల అభిప్రాయం. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు నేడు ఎలా స్పందిస్తాయోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

'సుజ్లాన్' తులసి తంతి తుది శ్వాస

- గుండెపోటుతో 'విండ్ మ్యాన్' మరణం
- ప్రధాని మోదీ సంతాపం

న్యూఢిల్లీ: పవన విద్యుత్ రంగ దిగ్గజం సుజ్లాన్ ఎనర్జీ వ్యవస్థాపకుడు, విండ్ మ్యాన్‌గా పేరొందిన తులసి తంతి (64) కన్నుమూశారు. ఆయన శనివారం గుండెపోటుతో మరణించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలిపింది. తులసి తంతికి భార్య (గీత), ఇద్దరు సంతానం (కుమారుడు ప్రణవ్, కుమార్తె నిధి) ఉన్నారు. ఆయన మరణంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియుష్ గోయల్ సంతాపం వ్యక్తం చేశారు. 'దేశ ఆర్థిక పురోగతికి తోడ్పడిన దిగ్గజాల్లో తులసి తంతి ఒకరు. ఆయన అకాల మరణంపై కుటుంబసభ్యులకు నా సంతాపం తెలియజేస్తున్నాను' అని మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్‌లో ప్రధాని ట్వీట్ చేశారు. విలేకరుల సమావేశంలో పాల్గొని అహ్మదాబాద్ నుంచి పుణెకు వస్తుండగా ఛాతీలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ కారు డ్రైవరుకు తులసి తంతి సూచించారు. అయితే, ఆస్పత్రిలో చికిత్స పొందేలోగానే ఆయన కన్నుమూశారు.



పవన విద్యుత్‌లో దిగ్గజం..

తులసి తంతి 1958లో రాజ్‌కోట్‌లో జన్మించారు. గుజరాత్ యూనివర్సిటీలో బీకామ్ చదివారు. 1995లో సుజ్లాన్ ఎనర్జీ ఏర్పాటుతో పవన విద్యుత్ రంగంలోకి ప్రవేశించారు. ఈ రంగంలో ప్రవేశించడానికి ముందు ఆయనకు టెక్స్‌టైల్ వ్యాపారం ఉండేది. దాన్ని 2001లో విక్రయించారు. అటు పైన 2003లో అమెరికన్ సంస్థ డాన్‌మర్ అండ్ అసోసియేట్స్ నుంచి 24 టర్బైన్‌లకు సుజ్లాన్‌కు భారీ ఆర్డరు దక్కింది. ఆ తర్వాత కంపెనీ వేగంగా విస్తరించడంలో తులసి తంతి కీలక పాత్ర పోషించారు. 2006 నుంచి బెల్జియంకు చెందిన టర్బైన్ విడిభాగాల తయారీ సంస్థ జెడ్‌ఎఫ్ విండ్ పవర్ యాంట్‌వెర్పెన్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు. అలాగే ఇండియన్ విండ్ టర్బైన్ తయారీదారుల సమాఖ్యకు ప్రెసిడెంట్‌గా కూడా ఉన్నారు.

కష్టకాలంలో కంపెనీ..

సుజ్లాన్ ఎనర్జీ ఆర్థిక సమస్యల్లో ఉన్న తరుణంలో తంతి అకాల మరణం ప్రాధాన్యం సంతరించుకుంది. 2005లో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయిన తర్వాత శరవేగంగా కార్యకలాపాలు విస్తరించిన సుజ్లాన్ ఎనర్జీ ఒక దశలో రూ. 65,474 కోట్ల మార్కెట్ వేల్యుయేషన్ దక్కించుకుంది. కంపెనీలో మెజారిటీ వాటాలున్న తంతి సంపద విలువ దాదాపు రూ. 43,537 కోట్లకు పెరిగింది. అయితే, ఆ తర్వాత అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యం తలెత్తడం, ఆ తర్వాత పరిణామాలతో పవన విద్యుత్ రంగం కుదేలైంది. దీనికి టర్బైన్‌లలో లోపాల ఫిర్యాదులు మొదలైనవి కూడా తోడు కావడంతో సుజ్లాన్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. కంపెనీ విలువ రూ. 8,536 కోట్లకు పడిపోయింది. భారీగా రుణాలు పేరుకుపోయాయి. వాటిని తీర్చేందుకు వర్కింగ్ క్యాపిటల్, ఇతరత్రా అవసరాల కోసం నిధులను సమకూర్చుకునేందుకు సుజ్లాన్ అక్టోబర్ 11న రూ. 1,200 కోట్ల రైట్స్ ఇష్యూకు రానుంది. ఈ తరుణంలో తంతి హఠాన్మరణంతో తలెత్తబోయే పరిణామాలపై ఆసక్తి నెలకొంది. అయితే, అనుభవజ్ఞులైన బోర్డు డైరెక్టర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ సారథ్యంలో తంతి ఆకాంక్షలను నెరవేరుస్తామని సుజ్లాన్ ఎనర్జీ పేర్కొంది.

సెల్‌ఫోన్ అందజేత


సెల్‌ఫోన్ అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఒడిశాకు చెందిన కితుంగ గర్బంగ అనే ప్రయాణికుడు తన సోదరి ఎనైల్ రైతాతో కలసి ఆదివారం శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి కొత్తూరు బస్ ఎక్కి ప్రయాణం చేశారు. బస్ ఎక్కే సమయంలో తన ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌ను జారవిడుచుకున్నారు. ఆ సెల్‌ఫోన్ కాంప్లెక్స్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ ఆర్.మహేశ్వరరావుకు దొరికింది. దాన్ని ఆయన బాధ్యతతో ఆర్టీసీ ఎస్ఎం వి.శామ్యూల్‌కు మహేశ్వరరావు అందజేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ప్రయాణికుడు తన ఫోన్‌కు వేరొక వ్యక్తి ఫోన్ నుంచి కాల్ చేయగా ఆ ఫోన్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని ఎస్ఎం శామ్యూల్ వద్ద ఉందని, తగిన ఆధారాలు చూపించి తీసుకువెళ్లాలని శామ్యూల్ చెప్పారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి కాంప్లెక్స్‌కు వచ్చి తగిన ఆధారాలు చూపించగా ఆ ఫోన్‌ను పోలీసుల సమక్షంలో అందజేశారు.

రైలు నుంచి దూకిన విద్యార్థిని


గాయపడిన విద్యార్థికి ఆస్పత్రిలో చికిత్స చేస్తున్న వైద్యులు

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం సంత్రమమాలి అనే విద్యార్థిని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి దూకేయడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆమదాలవలస మండలం బత్తిలి దగ్గర సింగిడి గ్రామానికి చెందిన సంత్రమమాలి నూజివీడులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీలో సీఎస్‌సీ చదువుతోంది. దసరా సెలవులు కావడంతో ఇంటికి వచ్చేందుకు కన్యాకుమారి నుంచి హౌరా వచ్చే సూపర్‌ఫాస్ట్ రైలెక్కింది. అయితే ట్రైన్ ఆమదాలవలస వద్ద ఆగలేదు. దీంతో ఆమె కాసేపు ఎదురుచూసి నౌపడ వద్ద దిగడానికి ప్రయత్నించి గెంతేయడంతో గాయపడింది. రైల్వే ఏఎస్ఐ ఎస్.నర్సింహులు ఆమెను వెంటనే 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

ఊరెళ్తున్నారా..?





- జాగ్రత్తలు పాటించాల్సిందే
- తాళం వేసి ఉన్న ఇళ్లే దొంగల టార్గెట్
- సమాచారమిస్తే నిఘా పెడతామంటున్న పోలీసులు
- ఎల్‌హెచ్ఎంఎస్‌పై విస్తృత ప్రచారం

ఇచ్ఛాపురం రూరల్/శ్రీకాకుళం: దసరాకు ఊరెళ్తున్నారా...అయితే ఇంటి విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాల్సిందే. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు పొద్దంతా వీధుల గుండా తిరుగుతూ తచ్చాడుతుంటారు. ఇరుగు పొరుగువారికి మాయమాటలు చెప్పి వివరాలు అడిగి తెలుసుకుంటారు. రాత్రిపూట వచ్చి దర్జాగా తమ పని కానిచ్చేస్తారు. ప్రస్తుతం పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో స్వగ్రామాలు, విజయ దశమి ఉత్సవాలు, జాతర్లు చూసేందుకు, విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తుంటారు. ఈ సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- దసరాకు ఊర్లెళ్లేవారు ఇరుగుపొరుగు వారికి చెప్పి వెళ్లడం మంచిది. పోలీసులకు సైతం సమాచారం ఇవ్వొచ్చు.
- తక్కువ ధరకు దొరికే వైఫై బేస్డ్ రోటో కెమెరాను ఇంటి వద్ద అమర్చుకోవాలి. మీ ఇంటి వద్ద జరిగే విషయాలు సెల్‌ఫోన్‌కు అలర్ట్ రింగ్‌టోన్ వస్తుంది. అది వారికి వినిపించదు. వారు దొంగతనం చేస్తుండగానే పట్టుకునే అవకాశం ఉంటుంది. ఒకేసారి నాలుగు సెల్ ఫోన్లకు వినియోగించుకోవచ్చు. ఒక పోలీస్ అధికారి నంబర్ సైతం వాడుకోవచ్చు.
- మార్కెట్‌లో సైరన్ మోగే తాళాలు అతి తక్కువ ధరలో లభిస్తున్నాయి. దానిని ఎవరు కదిలించే ప్రయత్నం చేసినా సైరన్ మోగుతుంది.
- తాళం వేసినట్లు కనిపించకుండా డోర్ కర్టెన్ కప్పి ఉంచాలి.
- నగలు, నగదు బీరువాల్లో ఉంచవద్దు. బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి.
- కొత్తగా ఎవరైనా అద్దెకు దిగితే వారి పూర్తి వివరాలు సేకరించాలి.
- అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే అప్రమత్తంగా ఉండాలి. వీలైతే మొబైల్ ద్వారా ఫొటో తీసి పోలీసులకు పంపించాలి.

ఎల్‌హెచ్ఎంఎస్‌తో అభయం



ఊరెళ్తున్న వారికి ఎల్‌హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం) అభయంగా నిలుస్తోంది. తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారి ఇంటి వద్ద ఎల్‌హెచ్ఎంఎస్ పరికరం ఏర్పాటు చేస్తారు. ఇది పోలీసు కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమవుతుంది. ఇంటి వద్ద ఎటువంటి అనుమానాస్పద కదలికలు చేసినా పోలీసులు సకాలంలో చేరుకుని చర్యలు తీసుకుంటారు. దీనిపై పోలీసులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజలకు రక్షణగా పోలీసులు

ప్రజల భద్రత, ఆస్తుల రక్షణకు మేమున్నాం. నిర్భయంగా సమాచారం ఇవ్వండి. రక్షణ కల్పిస్తాం. పట్టణ ప్రాంతాల్లో 24 గంటలు ప్రత్యేక వాహనంలో పోలీసులు తిరుగుతుంటారు. 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే 5 నిమిషాల వ్యవధిలో మీ వద్ద ఉంటాం. ఊర్లెళ్లే ముందు పోలీస్ స్టేషన్లో సమాచారం ఇస్తే నిఘా ఏర్పాటు చేస్తాం. – ఎం.శివరామిరెడ్డి, డీఎస్పీ, కాశీబుగ్గ

ప్రజలు సహకరించాలి..

నేరాల అదుపునకు ప్రజలు సహకరించాలి. ఎల్‌హెచ్ఎంఎస్, సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరిస్తే 90 శాతం నేరాలు తగ్గించవచ్చు. నేరాలు జరిగిన వెంటనే నిందితులను పట్టుకునేందుకు వీలు కలుగుతుంది. – ఎం.మహేంద్ర, డీఎస్పీ, శ్రీకాకుళం

సీసీ కెమెరాలు కీలకం..



- నేర విచారణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇటీవల శ్రీకాకుళం పట్టణంలో వైద్యుడి కిడ్నాప్, డీసీసీబీ కాలనీలో జరిగిన దొంగతనం ఘటనలను ఛేదించటంలో సీసీ ఫుటేజ్‌లే ప్రధాన పాత్ర పోషించాయి. కాలనీలు, వీధులు, అపార్టుమెంట్లు, ఇళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను కట్టడి చేయవచ్చు.
- ఒక సీసీ కెమెరా ఏర్పాటుతో పది మంది పోలీసులు చేపట్టే నిఘాను పర్యవేక్షణ చేయవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అత్యాధునికమైన సీసీ కెమెరా ఏర్పాటు చేసేందుకు రూ.6వేలు వరకు ఖర్చవుతుంది. డీసీసీసీ కాలనీలో ఇప్పటికే ఓ దాత సహకారంతో నాలుగు కెమెరాలు ఏర్పాటు చేశారు. డిసెంబర్ నాటికి నగరంలోని మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రణాళికలను రూపొందించారు.ఇందులో ప్రజల భాగస్వామ్యం అయ్యేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

అపూర్వ సమ్మేళనం



జి.సిగడాం ఉన్నత పాఠశాలలో 1997 –2022 మధ్య 6 నుంచి 10 వతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ గురువులు చిత్తిరి అప్పలనాయుడు, దేశరాజు సత్యనారాయణ, జడ్డు శ్రీరామమూర్తితోపాటు మరో 10 మందిని ఘనంగా సన్మానించారు. - జి.సిగడాం

కలల చదువు..

- ఇంజినీరింగ్ క్లాస్‌వర్క్ ప్రారంభం
- 1454 మందికి ప్రవేశాలు


ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులు, తల్లి దండ్రులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసింది. ఈ మేరకు విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టు పూర్తి చేశారు. జిల్లాలో నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, టెక్కలి ఐతం కళాశాల, చిలకపాలేం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల్లో 1454 మంది ప్రవేశాలు పొందారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ క్లాస్‌వర్క్ కూడా ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థులు ఇంజినీరింగ్‌లో విద్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. అందులోనూ ప్రధాన సబ్జెక్టులతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రధానం. ఇంగ్లిష్‌లో మాట్లాడడం, సెమినార్, గ్రూప్ డిస్కషన్లలో పాల్గొనడం వంటివి చేయాలి. కరిక్యులమ్‌లో ప్రత్యేక కోర్సులు లాగ్వేజ్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ వంటివి చేయాలి. అలాగే ఆన్‌లైన్ కోర్సులను కూడా పూర్తి చేస్తే మంచి భవిష్యత్ ఉంటుంది. జిల్లా విద్యార్థుల్లో మంచి పోటీతత్వం ఉంటుంది. లోపాలను అధిగమిస్తే ఇంజినీరింగ్‌లో మెరుగైన విద్యార్థులు బయటకు వస్తారని నిపుణులు చెబుతున్నారు. ఇంజినీరింగ్‌లో అన్ని బ్రాంచ్‌ల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయి. సాఫ్ట్‌వేర్ అవకాశాలు సైతం లభిస్తాయి. విద్యార్థులు ఆసక్తి ఉన్న బ్రాంచ్‌లను ఎంచుకున్నాక పూర్తిస్థాయి దృష్టి పెట్టాల్సి ఉంటుంది. సివిల్, సీఎస్‌డీ, సీఎస్ఈ, సీఎస్ఎం, ఈసీఈ, ట్రిపుల్ ఈ, ఐఎన్ఎఫ్, మెకానికల్, ఏఐ వంటి బ్రాంచ్‌లు ఉండగా, ఎక్కువ మంది విద్యార్థులు సీఎస్ఈ, ఈసీఈ, ఏఐ వంటి బ్రాంచ్‌లకు ప్రాధాన్యత నిచ్చారు. విద్యార్థులు ఎంచుకున్న బ్రాంచ్‌లో నైపుణ్యాలు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుంది.

పూర్తిస్థాయి పట్టు సాధించాలి



విద్యార్థులు ఎంచుకున్న బ్రాంచ్‌లో పూర్తిస్థాయి పట్టుసాధించాలి. అప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయి. ప్రధానంగా కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్, విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కాలేజ్‌లో చేరిన నుంచి శ్రమించి చదవాలి. ఉన్నత విద్యా మండలి ఇంజినీరింగ్‌లో ఇంటర్న్‌షిప్ వంటివి అమలు చేస్తుంది. కరిక్యులమ్ మేరకు విద్యార్థులు చదివితే మంచి భవిష్యత్ ఉంటుంది.

– డాక్టర్ పాగిరి సుగుణాకర్‌రావు, శ్రీకాకుళం నగర పాలక సంస్థ ప్రజారోగ్యం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

ఉద్యోగమే లక్ష్యం..



విద్యార్థులు ఇంజినీరింగ్‌లో చేరిన నుంచి విషయ పరిజ్ఞానం, భావ వ్యక్తీకరణ, ఇంగ్లిష్‌కు ప్రాధాన్యమివ్వాలి. చాలా కార్పొరేట్ కంపెనీలు క్యాంపస్ సెలెక్షన్లు నిర్వహిస్తున్నాయి. నైపుణ్యం ఉన్న వారందరికీ ఉద్యోగాలు వస్తాయి.

– చింతాడ శ్రావణి, ప్లేస్‌మెంట్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల

పరిశ్రమ అవసరాలు గుర్తించాలి



విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిద్ధం కావాలి. కనీసం 70 శాతం మార్కులతో ఇంజినీరింగ్ పూర్తి చేసేలా శ్రమించి చదవాలి. అప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది.

– జి.రామకృష్ణ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఒడిశా జలపాతంలో పాతపట్నం విద్యార్థి గల్లంతు

పాతపట్నం: పాతపట్నం కిరణ్మయి వీధికి చెందిన పోలుబోతు వంశీ (20) ఒడిశాలోని జలపాతం వద్ద గల్లంతయ్యాడు. యువకుడు పాతపట్నం మహేంద్ర డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల సందర్భంగా ముగ్గురు స్నేహితులతో కలిసి వంశీ ఈ నెల 1వ తేదీన మధ్యాహ్నం రెండు బైక్‌లపై ఒడిశాలోని గజపతి జిల్లా జిరంగి సమీపంలో గుడ్ గుధ వాటర్ ఫాల్స్‌కు వెళ్లారు. జలపాతంలో స్నానం చేస్తుండగా కాలుజారి లోయలో పడిపోయాడు. స్నేహితులు ఎంతగా వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో వారు వెంటనే కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. వారు గజ ఈతగాళ్లతో రెండు రోజుల పాటు గాలించినా ఫలితం లేకపోయింది. వంశీ తండ్రి పోలుబోతు వెంకటరావు తాపీమేస్త్రిగా పనిచేస్తున్నారు. తల్లి సునీత గృహిణి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.



Cell Point
#1 Mobile Retail Seller
23 Years
MOST TRUSTED BRAND
దసరా & దీపావళి
పండుగల నజరానా
₹ Upto 6,900
BAJAJ FINSERV
INSTANT CASHBACK
DUSSEHRA • CASH BACK OFFERS
Upto ₹10,000
DIRECT DISCOUNT
23వ వార్షికోత్సవ సంబరాలు
Debit Card EMI
0% Down Payment
Smart TV 32" (80cms)
కేవలం రూ.8,999* కే
Direct Discount Upto ₹10,000
CASH BACK upto ₹5,000
Upto 10% CASHBACK
Pay ₹1 Get SMART PHONE
micromax
ఇప్పుడు మా వద్ద
ఆన్‌లైన్ కంటే తక్కువ ధరకే
IN2C
3 GB, 32 GB
₹7,499
₹6.499
IN2B
4 GB, 64 GB
₹8,499
₹7.499
Exchange on any handset damage
Stocks ఉన్నత వరకు
EASY EMI
3 Months
0% Interest
Monthly ₹2,500
Mi 11i
CASH BACK Upto ₹2,000
Free Watch
vivo
Y22
Airpods ₹199*
₹1450 MONTHLY EMI
CASH BACK Upto ₹1,000
Y75
Smartwatch ₹499*
₹1500 MONTHLY EMI
CASH BACK Upto ₹1,500
V25Pro
Smart Calling Watch ₹999*
₹1999 MONTHLY EMI
CASH BACK Upto ₹3,500
6 months extended warrenty - 1 time Screen Replacement - ₹6000 Cash Back on Bajaj
oppo
A57
Airpods ₹199*
₹1749 MONTHLY EMI
CASH BACK Upto 10%
A77s
Smartwatch ₹499*
₹1374 MONTHLY EMI
CASH BACK Upto 10%
F21s Pro
Smart Calling Watch ₹999*
₹1733 MONTHLY EMI
CASH BACK Upto ₹3,000
No Cost EMI - Zero Down Payment - ₹6000 Cash Back on Bajaj
10 T 5G
CASH BACK Upto ₹5,000
mi
Note 11 Pro +
DIRECT DISCOUNT ₹1000
₹1,916 MONTHLY EMI
CASH BACK Upto ₹1,250
Free Airpods
realme
C21 Y
DIRECT DICOUNT upto ₹1,000
9 PRO 5G
CASH BACK upto ₹2,000
SAMSUNG
Amp your awesome with No Shake Cam
Awesome festive offers starting at ₹24499*
A13
Airpods ₹199*
₹1400 MONTHLY EMI
DIRECT DISCOUNT ₹1,000
A23
Smartwatch ₹499*
₹1459 MONTHLY EMI
DIRECT DISCOUNT ₹2,000
A53
Smart Calling Watch ₹999*
₹1693 MONTHLY EMI
DIRECT DISCOUNT ₹4,000
oppo
Lowest Price
A16e
3GB - 32GB
₹9,490
₹8,999
A16K
3GB - 32GB
₹9,490
₹8,999
ONEPLUS
10 PRO 5G
DIRECT DISCOUNT ₹5,000
CASH BACK Upto ₹6,000
CASH BACK upto ₹5000
EXCHANGE BONUS upto ₹3000
iphone 14
MRP ₹79,990 ₹71,900*
iphone 13
MRP ₹69,990 ₹63,900*
24 MONTHS EMI TENURE
0% Processing Fee
Monthly EMI ₹2,496
Upto 60% Discount on Accessories
Buy any Smart Phone Get...
₹99*
₹199*
₹499*
₹999*
UPTO 7.5% CASH BACK*
SBI card
Cell Point
IDFC FIRST Bank
HDB
BAJAJ FINSERV
HDFC BANK
zest
HOME CREDIT
Pine Labs
TVS CREDIT
* Conditional Apply



మరో విజయమే లక్ష్యంగా...

ఆసియా కప్ మహిళల టి20 క్రికెట్ టోర్నీలో వరుసగా రెండో విజయమే లక్ష్యంగా మలేసియాతో నేడు జరిగే మ్యాచ్‌లో భారత్ బరిలోకి దిగనుంది. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమిండియా తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై 41 పరుగులతో గెలిచిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం ఒంటి గంటకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో శ్రీలంక 11 పరుగులతో యూఏఈపై, పాకిస్తాన్ 9 వికెట్లతో మలేసియాపై గెలిచాయి.

మెయిన్ 'డ్రా'కు రామ్‌కుమార్ అర్హత



జపాన్ ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ రామ్‌కుమార్ రామనాథన్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందాడు. టోక్యోలో ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో 299వ ర్యాంకర్ రామ్‌కుమార్ 5–7, 6–4, 6–1తో 124వ ర్యాంకర్ ఇలియాస్ ఈమర్ (స్వీడన్)పై సంచలన విజయం సాధించాడు. గంటా 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ 13 ఏస్‌లు సంధించాడు.

బోపన్న జోడీకి టైటిల్



టెల్ అవీవ్ (ఇజ్రాయెల్): భారత టెన్నిస్ సీనియర్ స్టార్ రోహన్ బోపన్న తన కెరీర్‌లో 22వ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం జరిగిన టెల్ అవీవ్ ఏటీపీ–250 టోర్నీ ఫైనల్లో టాప్ సీడ్ బోపన్న (భారత్)–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీ 6–2, 6–4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–ఆండ్రెస్ మొల్తెని (అర్జెంటీనా) ద్వయంపై గెలిచింది. ఈ ఏడాది 42 ఏళ్ల బోపన్నకిది మూడో డబుల్స్ టైటిల్. పుణే ఓపెన్, అడిలైడ్ ఓపెన్‌లలో అతను రామ్‌కుమార్ జోడీగా డబుల్స్ టైటిల్స్ సాధించాడు. బోపన్న–మిడిల్‌కూప్ జోడీకి 50,180 డాలర్ల (రూ. 40 లక్షల 94 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

జావెలిన్ త్రోయర్ శివ్‌పాల్‌పై నాలుగేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: గత ఏడాది అక్టోబర్‌లో డోపింగ్ పరీక్షలో దొరికిపోయిన భారత అగ్రశ్రేణి జావెలిన్ త్రోయర్ శివ్‌పాల్ సింగ్‌పై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నాలుగేళ్ల నిషేధం విధించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 27 ఏళ్ల శివ్‌పాల్ టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొని 27వ స్థానంలో నిలిచాడు. 2019 ఆసియా చాంపియన్‌షిప్‌లో అతను రజతం సాధించాడు.

విజేత పెరెజ్



సింగపూర్: రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ సెర్జియో పెరెజ్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో రెండో విజయం సాధించాడు. ఆదివారం జరిగిన సింగపూర్ గ్రాండ్‌ప్రిలో పెరెజ్ విజేతగా నిలిచాడు. 59 ల్యాప్‌ల ఈ రేసును పెరెజ్ అందరికంటే వేగంగా 2గం:02ని.15.238 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని పొందాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన లెక్‌లెర్క్ (ఫెరారీ) రెండో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో 11 విజయాలు సాధించిన వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఏడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. తదుపరి రేసు జపాన్ గ్రాండ్‌ప్రి ఈనెల 9న జరుగుతుంది.

పరుగుల వర్షంలో తేడా పదహారే!

- రెండో టి20లో 16 పరుగులతో భారత్ విజయం
- పోరాడి ఓడిన దక్షిణాఫ్రికా
- డేవిడ్ మిల్లర్ సెంచరీ
- సూర్యకుమార్, రాహుల్ మెరుపులు



సూర్యకుమార్



డేవిడ్ మిల్లర్

గువహటి: మ్యాచ్ ఆరంభానికి కొద్దిసేపు ముందు వరకు కూడా వాన ఆటకు అంతరాయం కలిగించేలా కనిపించింది. అయితే ఆపై అసలు వర్షమైతే రాలేదు కానీ 'బర్సపారా' మైదానంలో పరుగుల వర్షం కురిసింది. ముందుగా భారత్ మెరుపు బ్యాటింగ్‌తో భారీ స్కోరు నమోదు చేయగా... అసాధ్యమనుకున్న లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా చివరి వరకు పోరాడింది. చివరకు 16 పరుగుల తేడాతో గెలిచిన భారత్ స్వదేశంలో దక్షిణాఫ్రికాపై 2–0తో తొలిసారి ద్వైపాక్షిక సిరీస్ సొంతం చేసుకుంది. సిరీస్‌లో చివరిదైన మూడో టి20 మంగళవారం ఇండోర్‌లో జరుగుతుంది.

ఆదివారం జరిగిన రెండో టి20లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. టి20ల్లో ఇది భారత్‌కు నాలుగో అత్యధిక స్కోరు. సూర్యకుమార్ యాదవ్ (22 బంతుల్లో 61; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేఎల్ రాహుల్ (28 బంతుల్లో 57; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీలు సాధించగా, కోహ్లి (28 బంతుల్లో 49 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ శర్మ (37 బంతుల్లో 43; 7 ఫోర్లు, 1 సిక్స్) అదే స్థాయిలో చెలరేగారు. అనంతరం దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 3 వికెట్లకు 221 పరుగులు చేసింది. డేవిడ్ మిల్లర్ (47 బంతుల్లో 106 నాటౌట్; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు), డి కాక్ (48 బంతుల్లో 69 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) నాలుగో వికెట్‌కు 84 బంతుల్లోనే అభేద్యంగా 174 పరుగులు జోడించినా జట్టును గెలిపించలేకపోయారు.

ఒకరితో పోటీ పడి మరొకరు...

గత మ్యాచ్‌లో డకౌటైన రోహిత్ ఈసారి కొన్ని చక్కటి షాట్లతో శుభారంభం చేయగా, మరో ఎండ్‌లో రాహుల్ మొదటినుంచే దూకుడు ప్రదర్శించాడు. పార్నెల్ ఓవర్లో అతను వరుసగా 6, 4 కొట్టగా రోహిత్ మరో ఫోర్ సాధించాడు. పవర్‌ప్లేలో భారత్ 57 పరుగులు చేసింది. ఆ తర్వాత నోర్జే వేసిన 9వ ఓవర్లో భారత్ పండగ చేసుకుంది. రాహుల్ వరుసగా 4, 6 బాదగా, రోహిత్ మరో రెండు ఫోర్లు కొట్టడంతో ఆ ఓవర్లో 21 పరుగులు వచ్చాయి. తొలి వికెట్‌కు 59 బంతుల్లో 96 పరుగులు జోడించిన తర్వాత రోహిత్ వెనుదిరగ్గా... 24 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత రాహుల్ అవుటయ్యాడు. అయితే ఆ తర్వాత సూర్య విధ్వంసం దక్షిణాఫ్రికాను అచేతనంగా మార్చేసింది. తొలి నాలుగు బంతుల్లో రెండు ఫోర్లు కొట్టిన అతను రబడ ఓవర్లో చెలరేగిపోయాడు. అతను 2 సిక్స్‌లు, 2 ఫోర్లు బాదడంతో మొత్తం 22 పరుగులు వచ్చాయి. పార్నెల్ వేసిన బంతిని మరో భారీ సిక్సర్‌గా మలచిన సూర్య 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు. మరో వైపు తన తొలి 14 బంతుల్లో 18 పరుగులు చేసిన కోహ్లి, తర్వాతి 14 బంతుల్లో 31 పరుగులు సాధించాడు. ఎట్టకేలకు సూర్య రనౌటైనా... చివరి ఓవర్లో దినేశ్ కార్తీక్ (7 బంతుల్లో 17 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మరిన్ని పరుగులు జోడించాడు.

నిబంధన అమలు చేయలేదు!

ఐసీసీ కొత్త నిబంధనలు అక్టోబర్ 1నుంచి అమల్లోకి రాగా, ఆదివారం జరిగిందే తొలి అంతర్జాతీయ మ్యాచ్. నిబంధనల ప్రకారం స్ట్రయికర్ షాట్ కొట్టి అవుటైతే పరుగు తీసే ప్రయత్నం చేస్తూ నాన్‌స్ట్రయికర్ అతడిని దాటినా సరే, కొత్తగా వచ్చే బ్యాటర్ మాత్రమే స్ట్రయికింగ్ తీసుకోవాలి. కానీ రెండో ఓవర్ నాలుగో బంతికి రోసో అవుటయ్యాక, ఐదో బంతికి డి కాక్ స్ట్రయిక్ తీసుకున్నాడు. అంపైర్లు దీనిని గుర్తించలేకపోయారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (ఎల్బీ) (బి) మహరాజ్ 57; రోహిత్ (సి) స్టబ్స్ (బి) మహరాజ్ 43; కోహ్లి (నాటౌట్) 49; సూర్యకుమార్ (రనౌట్) 61; కార్తీక్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 237. వికెట్ల పతనం:** 1–96, 2–107, 3–209. **బౌలింగ్:** రబడ 4–0–57–0, పార్నెల్ 4–0–54–0, ఇన్‌గిడి 4–0–49–0, మహరాజ్ 4–0–23–2, నోర్జే 3–0–41–0, మార్క్‌రమ్ 1–0–9–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: బవుమా (సి) కోహ్లి (బి) అర్ష్‌దీప్ 0; డికాక్ (నాటౌట్) 69; రోసో (సి) కార్తీక్ (బి) అర్ష్‌దీప్ 0; మార్క్‌రమ్ (బి) అక్షర్ 33; మిల్లర్ (నాటౌట్) 106; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 221. వికెట్ల పతనం:** 1–1, 2–1, 3–47. **బౌలింగ్:** చహర్ 4–1–24–0, అర్ష్‌దీప్ 4–0–62–2, అశ్విన్ 4–0–37–0, అక్షర్ 4–0–53–1, హర్షల్ 4–0–45–0.

భారత్ సంచలనం

రెండో సీడ్ జర్మనీపై విజయం



సత్యన్

చెంగ్డూ (చైనా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు సంచలనం సృష్టించింది. గ్రూప్–2లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3–1తో రెండో సీడ్, టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత జర్మనీ జట్టును ఓడించింది. ప్రపంచ 37వ ర్యాంకర్ సత్యన్ జ్ఞానశేఖరన్ గొప్ప ప్రదర్శనతో రెండు మ్యాచ్‌ల్లో గెలిచి భారత విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలి మ్యాచ్‌లో సత్యన్ 11–13, 4–11, 11–8, 11–4, 11–9తో 36వ ర్యాంకర్ డూడా బెనెడిక్ట్‌ను ఓడించాడు. రెండో మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 7–11, 9–11, 13–11, 3–11తో డాంగ్ కియు చేతిలో ఓడిపోయాడు. మూడో మ్యాచ్‌లో 142వ ర్యాంకర్ మానవ్ ఠక్కర్ 13–11, 6–11, 11–8, 12–10తో 74వ ర్యాంకర్ రికార్డో వాల్తెర్‌పై గెలవడంతో భారత్ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో మ్యాచ్‌లో సత్యన్ 10–12, 7–11, 11–8, 11–8, 11–9తో ప్రపంచ 9వ ర్యాంకర్ డాంగ్ కియును ఓడించడంతో భారత్ చిరస్మరణీయ విజయం సాధించింది. చెక్ రిపబ్లిక్‌తో జరిగిన గ్రూప్–5 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3–0తో గెలిచి తొలి విజయం నమోదు చేసింది.

పటిదార్, ముకేశ్‌లకు తొలి అవకాశం

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన






ముకేశ్

న్యూఢిల్లీ: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో ఈనెల 6, 9, 11 తేదీల్లో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించారు. 16 మంది సభ్యుల ఈ బృందానికి శిఖర్ ధావన్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, శ్రేయస్ అయ్యర్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. మిడిలార్డర్ బ్యాటర్ రజత్ పటిదార్ (మధ్యప్రదేశ్), పేస్ బౌలర్ ముకేశ్ కుమార్ (బెంగాల్) మొదటిసారి భారత జట్టులోకి ఎంపికయ్యారు. గత కొంత కాలంగా దేశవాళీ క్రికెట్‌లో చక్కటి ఫామ్‌లో ఉన్న పటిదార్ అవకాశం దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో బెంగళూరు తరఫున విశేషంగా రాణించిన అతను రంజీ ట్రోఫీ ఫైనల్లో సెంచరీ సాధించాడు. ఇటీవల న్యూజిలాండ్ 'ఎ'తో జరిగిన టెస్టు సిరీస్‌లో కూడా రెండు సెంచరీలతో భారత్ 'ఎ' టాప్ స్కోరర్‌గా నిలిచాడు. దేశవాళీ వన్డేల్లో చెప్పుకోదగ్గ ప్రదర్శన లేకపోయినా, ఫస్ట్‌క్లాస్ ప్రదర్శన ముకేశ్‌ను సెలక్టర్ల దృష్టిలో పడేలా చేసింది. గత రెండేళ్లుగా బెంగాల్ తరఫున అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన అతను న్యూజిలాండ్ 'ఎ'తో జరిగిన టెస్టు సిరీస్‌లో 9 వికెట్లు తీశాడు. ఒక్కసారి ఐపీఎల్ ఆడకుండా అతను భారత జట్టులోకి ఎంపిక కావడం విశేషం.


భారత వన్డే జట్టు: ధావన్ (కెప్టెన్), శ్రేయస్ (వైస్ కెప్టెన్), రుతురాజ్, గిల్, పటిదార్, రాహుల్ త్రిపాఠి, ఇషాన్ కిషన్, సంజు సామ్సన్, షహబాజ్, శార్దుల్, కుల్దీప్, రవి బిష్ణోయ్, ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్, సిరాజ్, దీపక్ చహర్.

రష్మీ రాథోడ్‌కు రజత పతకం


బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ క్రీడాంశాల్లో ఫైనల్ చేరిన తెలంగాణ జట్లు



రష్మీ



పల్లవి



కార్తీక

అహ్మదాబాద్: జాతీయ క్రీడల్లో ఆదివారం తెలంగాణకు ఒక రజత పతకం లభించింది. మరో రెండు పతకాలు ఖరారయ్యాయి. మహిళల షూటింగ్ స్కీట్ ఈవెంట్ ఫైనల్లో తెలంగాణకు చెందిన రష్మీ రాథోడ్ 25 పాయింట్లు స్కోరు చేసి రజతం సాధించింది.

బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ జట్టు ఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్లో తెలంగాణ 3–2తో మహారాష్ట్రపై నెగ్గింది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో సిక్కి రెడ్డి–పుల్లెల గాయత్రి జోడీ 21–9, 21–16తో సిమ్రన్–రితిక జంటను ఓడించి తెలంగాణను గెలిపించింది. వియత్నాం ఓపెన్‌లో ఆడి శనివారం రాత్రి నేరుగా గుజరాత్ చేరుకున్న సిక్కి రెడ్డి ఆదివారం మధ్యాహ్నం సెమీఫైనల్లో ఆడటం విశేషం. నేడు ఫైనల్లో కేరళతో తెలంగాణ ఆడుతుంది. మహిళల 3x3 బాస్కెట్‌బాల్ ఈవెంట్‌లో తెలంగాణ జట్టు ఫైనల్ చేరి కనీసం రజత పతకం ఖాయం చేసుకుంది.

రజతాలు నెగ్గిన పల్లవి, కార్తీక

జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ ఖాతాలో ఆదివారం రెండు రజత పతకాలు చేరాయి. మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 64 కేజీల విభాగంలో విజయనగరం జిల్లాకు చెందిన ఎస్.పల్లవి రజతం సాధించింది. 18 ఏళ్ల పల్లవి మొత్తం 199 కేజీల బరువెత్తి రెండో స్థానంలో నిలిచింది. మహిళల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో జి.కార్తీక రజతం సాధించింది. కార్తీక 12.85 మీటర్ల దూరం దూకింది. అథ్లెటిక్స్ మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యెర్రాజీ ఫైనల్ చేరింది.

రెస్ట్ ఆఫ్ ఇండియాకు ఆధిక్యం

రాజ్‌కోట్: రంజీ ట్రోఫీ మాజీ చాంపియన్ సౌరాష్ట్రతో జరుగుతున్న ఇరానీ ట్రోఫీ మ్యాచ్‌పై రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు పట్టు బిగించింది. రెస్ట్ ఆఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 110 ఓవర్లలో 374 పరుగులకు ఆలౌటైంది. 276 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఆల్‌రౌండర్ సౌరభ్ కుమార్ (55; 10 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. విహారి (82; 11 ఫోర్లు, 1 సిక్స్), సర్ఫరాజ్ ఖాన్ (138; 20 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర రెండో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లకు 49 పరుగులు చేసింది. ఈ రెండు వికెట్లు సౌరభ్ పడగొట్టాడు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీలో 92 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1 సర్వీస్ ఉద్యోగాల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా వివిధ శాఖలు/విభాగాల్లో మొత్తం 92 గ్రూప్1 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 92
» **అర్హతలు:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డివిజనల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పోస్టులకు బీఈ(ఫైర్)ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పోస్టులకు 21–30 ఏళ్లు, డిప్యూటీ సూపరింటెండ్ ఆఫ్ జైల్ పోస్టులకు 18–30ఏళ్లు, డివిజనల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పోస్టులకు21–28 ఏళ్లు, మిగతా పోస్టులకు 18–42ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష(స్క్రీనింగ్), మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులు ప్రారంభం: 13.10.2022
» దరఖాస్తులకు చివరి తేది: 02.11.2022
» ప్రిలిమినరీ పరీక్ష తేది: 18.12.2022
» మెయిన్ పరీక్షలు: మార్చి ద్వితీయార్థం 2023
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

వాతావరణ శాఖలో 990 సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులు

భారత వాతావరణ శాఖ(ఐఎండీ)లో గ్రూప్ బి నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్ పోస్టులైన సైంటిఫిక్ అసిస్టెంట్ ఖాళీల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **సైంటిఫిక్ అసిస్టెంట్ (భారత వాతావరణ విభాగం) నియామక పరీక్ష–2022**
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 990
» **పోస్టుల వివరాలు:** సైంటిఫిక్ అసిస్టెంట్.
» **అర్హతలు:** 10+2(సైన్స్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్), బ్యాచిలర్ డిగ్రీ(భౌతిక శాస్త్రం/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ అప్లికేషన్స్) లేదా డిప్లొమా(ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణత ఉండాలి. » **వయసు:** 18.10.2022 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష(పార్ట్–1, పార్ట్–2), ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్యసమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 18.10.2022
» కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహణ: డిసెంబర్, 2022
» వెబ్‌సైట్: https://ssc.nic.in

తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో 40 పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా టీఎస్‌సీఏబీ శాఖల్లో ఖాళీగా ఉన్న మేనేజర్, స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40
» **పోస్టుల వివరాలు:** మేనేజర్(స్కేల్–1)–27, స్టాఫ్ అసిస్టెంట్–13.
» **అర్హత:** 55% మొత్తం మార్కులతో ఏదైనా డిగ్రీ/డిగ్రీ(కామర్స్)ఉత్తీర్ణులై ఉండాలి.
» అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర స్థానికతతోపాటు తెలుగు భాషలో ప్రావీణ్యం అవసరం.
» **వయసు:** 01.09.2022 నాటికి 20 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:**మేనేజర్ పోస్టులకు ప్రిలిమినరీ పరీక్ష(ఆబ్జెక్టివ్), మెయిన్ గ్జామినేషన్(ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్)ఆధారంగా,స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుకు ప్రిలిమినరీ పరీక్ష(ఆబ్జెక్టివ్),మెయిన్ ఎగ్జామినేషన్(ఆబ్జెక్టివ్)ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.10.2022
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ:** నవంబర్ 2022
» **వెబ్‌సైట్:** https://tscab.org

తూర్పు రైల్వేలో 3115 అప్రెంటిస్ ఖాళీలు

కోల్‌కతాలోని తూర్పు రైల్వే..రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)..తూర్పు రైల్వే పరిధిలోని వర్క్‌షాప్‌లు,డివిజన్‌లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3115
» **ట్రేడుల వివరాలు:** ఫిట్టర్,వెల్డర్,మెకానికల్, మెషినిస్ట్,కార్పెంటర్,లైన్‌మ్యాన్, వైర్‌మ్యాన్,రిఫ్రిజరేషన్ అండ్ ఏసీ మెకానిక్,ఎలక్ట్రీషియన్, మెకానిక్ మెషీన్ టూల్ మెయింటనెన్స్ తదితరాలు. **అర్హత:** పదోతరగతి, సంబంధిత ట్రేడులో నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:**మెట్రిక్యులేషన్,ఐటీఐలో సాధించిన మార్కులు,మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తులకు చివరి తేది:** 29.10.2022
» **వెబ్‌సైట్:** https://rrcrecruit.co.in

పీఓ పోస్టు..పట్టేస్తారా!

» 1,673 పీఓ పోస్టుల భర్తీకి ఎస్‌బీఐ నోటిఫికేషన్
» ఎంపికైతే ప్రారంభంలోనే బేసిక్ పే రూ.41,960
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు

దేశంలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. జూనియర్ మేనేజ్‌మెంట్ స్కేల్-1 హోదాలో.. మొత్తం 1,673 పీఓ ఖాళీల భర్తీకి ఎస్‌బీఐ ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది. బ్యాచిలర్ డిగ్రీ మొదలు, ప్రొఫెషనల్, టెక్నికల్ ఇలా.. అన్ని డిగ్రీల అభ్యర్థులు పోటీ పడేందుకు అర్హులే!! ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ పీఓ నోటిఫికేషన్ వివరాలు.. ఎంపిక ప్రక్రియ, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..



ఎస్‌బీఐ తాజా నోటిఫికేషన్ ద్వారా రెగ్యులర్ ప్రాతిపదికగా 1,600 పోస్టులను, బ్యాక్‌లాగ్ వేకెన్సీ కేటగిరీలో 73 పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టనుంది. గతేడాదితో పోల్చితే ఖాళీల సంఖ్య తగ్గడం గమనార్హం. గత ఏడాది రెండు వేలకు పైగా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, ఈ ఏడాది ఆ సంఖ్య 1,673గానే ఉంది.

అర్హతలు

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** ఏప్రిల్ 1, 2022 నాటికి 21–30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్ల చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **ఎంపికైన వారికి ప్రారంభ బేసిక్ పే:**రూ.41,960గా ఉంటుంది.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

ఎస్‌బీఐ పీఓ ఎంపిక ప్రక్రియలో ఫేజ్–1, ఫేజ్–2, ఫేజ్–3.. ఇలా మూడంచెల విధానం ఉంటుంది. ఫేజ్–1(ప్రిలిమినరీ పరీక్ష), ఫేజ్–2 (మెయిన్ ఎగ్జామినేషన్), ఫేజ్–3 సైకోమెట్రిక్ టెస్ట్ (ఇంటర్వ్యూ/గ్రూప్ ఎక్సర్‌సైజెస్).

ప్రిలిమినరీకి 100 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ఫేజ్–1ను ప్రిలిమినరీ పరీక్షగా పేర్కొంటారు. ఈ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో, ఆబ్జెక్టివ్ తరహాలో వంద మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 35 ప్రశ్నలు–35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు చొప్పున మొత్తం 100 మార్కులకు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం ఒక గంట. ప్రిలిమ్స్‌లో కేటగిరీల వారీగా మెరిట్ లిస్ట్‌ను రూపొందించి మెయిన్‌కు అభ్యర్థులను ఖరారు చేస్తారు. ఒక్కో పోస్ట్‌కు పది మంది (1:10 నిష్పత్తిలో)ని ఎంపిక చేస్తారు.

ఫేజ్-2 మెయిన్

- రెండో దశ మెయిన్‌లో 200 మార్కులకు ఆబ్జెక్టివ్ ఆన్‌లైన్ పరీక్ష, 50 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్ నిర్వహిస్తారు.
- ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పరీక్షలో నాలుగు విభాగాలు ఉంటాయి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, డేటాఅనాలసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 30 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–60 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు–40 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు.
- ప్రిలిమ్స్, మెయిన్ ఆబ్జెక్టివ్ పరీక్షల్లో నెగిటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కుల కోత విధిస్తారు.

ఫేజ్-2లోనే డిస్క్రిప్టివ్ టెస్ట్

ఫేజ్–2 మెయిన్ పరీక్షలోనే 50 మార్కులకు డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఈ పరీక్షలో లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్ అంశాలు ఉంటాయి. పరీక్ష సమయం 30 నిమిషాలు. కంప్యూటర్ ఆధారంగా తమ సమాధానాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

పెరిగిన వెయిటేజీ

ఫేజ్–2 మెయిన్‌లో ఈ ఏడాది జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్‌కు వెయిటేజీ పెరిగింది. గతేడాది వరకు 40ప్రశ్నలతోనే ఉన్న ఈ విభాగంలో.. ఈ సంవత్సరం 50 ప్రశ్నలు ఉంటాయని పేర్కొన్నారు.

తుది దశ

- ఎంపిక ప్రక్రియలో తుది దశ(ఫేజ్–3)లో గ్రూప్ ఎక్సర్‌సైజ్, ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు.
- మెయిన్ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున (1:3 నిష్పత్తిలో) తుది దశకు ఎంపిక చేస్తారు.
- మొత్తం 50 మార్కులకు నిర్వహించే చివరి దశ ఎంపిక ప్రక్రియలో గ్రూప్ ఎక్సర్‌సైజ్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 మార్కులు ఉంటాయి.

గ్రూప్ ఎక్సర్‌సైజ్ అంటే

గ్రూప్ ఎక్సర్‌సైజ్‌కు ఎంపికైన అభ్యర్థులను బృందాలుగా విభజిస్తారు. ఒక్కో బృందంలో గరిష్ఠంగా అయిదుగురు ఉండేలా చూస్తారు. వీరికి నిర్దిష్టంగా ఒక అంశాన్ని ఇచ్చి..దానిపై అభ్యర్థుల అభిప్రాయం లేదా సమాధానాన్ని అడుగుతారు. అభ్యర్థులకు ఆయా సామాజిక అంశాలపై ఉన్న అవగాహన, టీమ్ స్కిల్స్ వంటి వాటిని పరిశీలిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ ఎక్సర్‌సైజ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇందులో అభ్యర్థులకు ఉన్న బ్యాంకింగ్ నాలెడ్జ్, బ్యాంకింగ్ రంగంలో కెరీర్‌పై ఆసక్తి, లక్షణాలను పరిశీలిస్తారు.

తుది విజేతల ఖరారు

రెండో దశ మెయిన్, చివరి దశ(ఫేజ్–3) పర్సనల్ ఇంటర్వ్యూ, గ్రూప్ ఎక్సర్‌సైజెస్‌లలో చూపిన ప్రతిభ ఆధారంగా..నిర్దిష్ట అర్హత మార్కులను, ఖాళీలను, రిజర్వేషన్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది విజేతలను నిర్ణయిస్తారు. ఈ జాబితాలో నిలిస్తే ఎస్‌బీఐలో పీఓగా కొలువుదీరినట్లే.

ఎంపికలో వెయిటేజీ విధానం

తుది విజేతల ఎంపిక విషయంలో ఎస్‌బీఐ వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తోంది. మెయిన్(250 మార్కులు)లో పొందిన మార్కులకు 75 శాతం ; చివరి దశలోని గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ(50 మార్కులు)లో చూపిన ప్రతిభకు 25 శాతం వెయిటేజీ ఇస్తోంది. ఇలా మొత్తం వంద మార్కులకు అభ్యర్థులు పొందిన మార్కులను క్రోడీకరించి తుది విజేతలను నిర్ణయిస్తుంది.

కెరీర్ స్కోప్

ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన వారు పనితీరు, ప్రతిభ ఆధారంగా సీజీఎం, చైర్ పర్సన్ స్థాయిలకు సైతం చేరుకోవచ్చు. తొలుత పీఓగా ఎంపికైన వారికి రెండేళ్ల శిక్షణ తర్వాత స్కేల్–1 హోదా లభిస్తుంది. రెండేళ్ల శిక్షణ తర్వాత నిర్వహించే పరీక్షలో ప్రతిభ చూపితే నేరుగా స్కేల్–2 కేడర్‌లో డిప్యూటీ మేనేజర్ హోదా లభిస్తుంది. ఆ తర్వాత స్కేల్–3 మేనేజర్ స్థాయి హోదా; స్కేల్–4: చీఫ్ మేనేజర్ హోదా; స్కేల్– 5: అసిస్టెంట్ జనరల్ మేనేజర్; స్కేల్–6: డిప్యూటీ జనరల్ మేనేజర్; స్కేల్–7: జనరల్ మేనేజర్ హోదాలకు చేరుకోవచ్చు.

ప్రిపరేషన్ పక్కాగా

- రీజనింగ్ విభాగంలో రాణించేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. విశ్లేషణ సామర్థ్యం, తార్కికత్వం పెంచుకునే విధంగా కృషి చేయాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్‌పై పట్టు సాధించాలి.
- డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించేందుకు కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్,డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.
- ఈ ఏడాది వెయిటేజీ పెరిగిన జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్‌కు సంబంధించి మరింత ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో పరిణామాలు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో రాణించేందుకు.. బేసిక్ గ్రామర్‌తో మొదలు పెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్,కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్,పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- గ్రూప్ ఎక్సర్‌సైజెస్, పర్సనల్ ఇంటర్వ్యూలో రాణించడానికి ఇంగ్లిష్ వ్యాకరణం, వాక్య నిర్మాణంపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.
- గ్రూప్ ఎక్సర్‌సైజెస్ కోసం దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర జనరల్ ఎస్సే పుస్తకాలు అభ్యసించడం ఉపయుక్తంగా ఉంటుంది.

ఎస్‌బీఐ పీఓ-2022 నోటిఫికేషన్.. ముఖ్య తేదీలు

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి:
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** సెప్టెంబర్ 22 – అక్టోబర్ 12.
- **ప్రిలిమినరీ పరీక్ష (ఆన్‌లైన్) తేదీలు:** డిసెంబర్ 17, 18, 19, 20.
- **మెయిన్ ఎగ్జామినేషన్(ఆన్‌లైన్):** 2023 జనవరి/ ఫిబ్రవరి.
- **తుది ఫలితాల వెల్లడి:** ఫిబ్రవరి/మార్చి, 2023
- **వెబ్‌సైట్:** https://bank.sbi/careers, https://www.sbi.co.in/careers